fb/prajasakti, www.prajasakti.com

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

సంపుటి : 38 సంచిక : 64 | విజయవాడ, మంగళవారం 6 మార్చి 2018 | 12 + 12 పేజీలు వెల : 4.00

ఏపి భవన్‌లో మీడియాపై ఆంక్షలు

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

న్యూఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్‌లో మీడియాపై ప్రభుత్వం ఆంక్షలు విధించింది. ప్రత్యేక హోదా కోసం ఢిల్లీలో ఆందోళన చేసేందుకు రాష్ట్రం నుంచి వచ్చిన రాజకీయ పార్టీల నేతలు, ప్రజా సంఘాల నేతల నుంచి బైట్లను తీసుకోరాదని నిబంధనలు విధించింది. ఏపి భవన్ గోడలకు ఆదేశాల ప్రతులను అతికించింది. మీడియా ప్రతినిధులు రాజకీయ నేతల బైట్లు తీసుకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించడం గమనార్హం. ఈ ఆంక్షలపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్ర విభజన సందర్భంలో ప్రస్తుత సిఎం చంద్రబాబు నాయుడు ఏపి భవన్‌లో ఆందోళన కూడా చేశారని, అదే చంద్రబాబు ఇప్పుడు ఢిల్లీ వచ్చే ప్రతిపక్ష నేతల మాటలను ఆంధ్రప్రదేశ్ ప్రజలకు వెళ్లకూడదనే అక్కసుతో మీడియాపై ఆంక్షలు విధించడం అప్రజాస్వామ్యకమని వివిధ రాజకీయ పార్టీల నేతలు, ప్రజా సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు.



ఏపి అసెంబ్లీలో ప్రసంగిస్తున్న గవర్నర్ నరసింహన్

నాడు ప్యాకేజీ..నేడు హోదా

- గవర్నర్ నోట చంద్రబాబు మాట
- విభజన హామీలన్నీ కేంద్రం నెరవేర్చాలి
- శాసనసభలో సీట్ల సంఖ్య పెంచాలి
- ఉభయ సభలనుద్దేశించి ప్రసంగం

2లో

అప్పుడలా..

'ప్రత్యేక కేటగిరి హోదా కింద లభించేవన్నీ సహాయంగా రాష్ట్రానికి లభిస్తాయి. పేరు మాత్రమే ప్రత్యేక కేటగిరి హోదాకు బదులు ప్యాకేజీ అంటారు. దీన్ని సాధించడంలో రాష్ట్రం చేసిన కృషి ఫలించింది. దీనికి చట్టబద్ధత కోసం కృషి చేస్తాం. హోదా కింద రాష్ట్రానికి చేకూరే మద్దతు, రాయితీలు ఇతర సహాయాలన్నీ ప్రత్యేక సాయంలో భాగంగా ఉంటాయని కేంద్రం హామీ ఇచ్చింది'.

- మార్చి 6, 2017 బడ్జెట్ సమావేశాల్లో..

ఇప్పుడిలా..

'విభజన వల్ల తీవ్రంగా నష్ట పోయిన ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందే. రైల్వేజోన్‌తో పాటు విభజన చట్టంలో పేర్కొన్న హామీలన్నీ నెరవేర్చాలి. జాతీయ ప్రాముఖ్యత గల సంస్థలు ఏర్పాటు చేయాలి. దుగరాజపట్నం పోర్టు, కడప జిల్లాలో స్టీల్ ప్లాంటు, వైజాగ్-చెన్నై పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేయాలి. శాసనసభలో సీట్ల సంఖ్యను పెంచాలి'.

- మార్చి 5, 2018 సమావేశాల్లో ..



ఉత్తమ చిత్రంగా నిలిచిన 'ది షేప్ ఆఫ్ వాటర్'లో ఒక దృశ్యం

'ది షేప్ ఆఫ్ వాటర్'కు ఆస్కార్ల పంట

ప్రజాశక్తి సినిమా డెస్క్ : 90వ ఆస్కార్ అవార్డుల్లో ఉత్తమ చిత్రంగా 'ది షేప్ ఆఫ్ వాటర్' నిలిచింది. ఉత్తమ నటుడిగా గేరీ ఓల్డ్‌మ్యాన్, ఉత్తమ నటిగా ఫ్రాన్సెస్ మెక్‌డోర్మండ్ అకాడమీ పురస్కారాలు అందుకున్నారు. విదేశీ భాషా చిత్రాల విభాగంలో 'ఎ ఫెంటాస్టిక్ ఉమెన్' నిలిచింది. 13 విభాగాల్లో పోటీ పడ్డ 'ది షేప్ ఆఫ్ వాటర్' 4 పురస్కారాలు సొంతం చేసుకుంది. మూడు అవార్డులతో 'డన్‌క్రిక్' చిత్రం రెండో స్థానంలో నిలిచింది. 'ది షేప్ ఆఫ్ వాటర్' తర్వాత అత్యధికంగా తొమ్మిది విభాగాల్లో పోటీ పడిన 'త్రీ బిల్‌బోర్డర్స్ అవుట్‌సైడ్ ఎబ్బింగ్ మిస్సోరీ 2' చిత్రం మాత్రం రెండు అవారులతో మూడో స్థానానికి పరిమితమైంది. ఈ చిత్రంతో పాటు రెండేసి విభాగాల్లో 'డార్కెస్ట్ అవర్', 'బ్లాడ్ రన్నర్ 2049' అవార్డులను సొంతం చేసుకున్నాయి.




ఉత్తమ నటుడు అవార్డు సొంతం చేసుకున్న గేరీ ఓల్డ్‌మ్యాన్

8న బడ్జెట్

12 నుండి చర్చ
28 వరకూ సమావేశాలు
బిఎసిలో నిర్ణయం- 9,10,11 సెలవు
హోదా, విభజన హామీలే కీలకం
మరో 22 అంశాలపై దృష్టి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



బడ్జెట్ సమావేశాల్లో హోదా, విభజన హామీలు తదితర అంశాలకు ప్రాధాన్యమివ్వాలని నిర్ణయించారు. బిజినెస్ ఎడ్వయిజరీ కమిటీ (బిఎసి) సమావేశంలో సోమవారం ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయాల ప్రకారం ఈనెల 28వ తేదీ వరకూ అసెంబ్లీ సమావేశాలు నిర్వహించనున్నారు. ఎనిమిదో తేదీన ఉదయం 11.30 గంటలకు బడ్జెట్‌ను ప్రతిపాదించనున్నారు. అనంతరం మూడు రోజులపాటు సెలవులు రానున్నాయి. ఇటీవల మరణించిన మిగతా 9లో

ఢిల్లీ వీధుల్లో ఏపి గర్జన



ఢిల్లీలో ధర్నా చేస్తున్న వైసిపి నాయకులకు సంఘీభావం తెలుపుతున్న సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శులు మధు, రామకృష్ణ

వైసిపి ధర్నా, నేతలు అరెస్టు, విడుదల
సిపిఎం, సిపిఐ సంఘీభావం
పార్లమెంట్‌లో ఏపి ఎంపిల ఆందోళన
అమిత్ షా నివాసం వద్ద ధర్నా
మోడీ, చంద్రబాబులపై పోలీస్ స్టేషన్‌లో కాంగ్రెస్ ఫిర్యాదు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్ సమావేశాల మొదటిరోజైన సోమవారం నాడు ఢిల్లీలో హోదా పోరు హోరెత్తింది. పార్లమెంటు లోపల, బయట ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేయాలన్న నినాదాలు మారుమ్రోగాయి. వైసిపి ధర్నా, మోడీ, చంద్రబాబులపై కాంగ్రెస్ ఫిర్యాదు, పార్లమెంట్‌లో ఏపి ఎంపిల ఆందోళన, కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీతో టిడిపి, బిజెపి నేతలు భేటీ, ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి, విద్యార్థి జెఎసి నేతలు బిజెపి జాతీయాధ్యక్షుడు అమిత్ షా నివాసం వద్ద ధర్నా, ఆందోళన చేస్తున్న పలువురి అరెస్ట్ వంటి వరుస మిగతా 9లో

జైట్లీతో టిడిపి, బిజెపి నేతల భేటీ 2

గవర్నర్ 'హోదా'పైనే చర్చంతా

శాసనసభ లాబీల్లో సభ్యుల ఇష్టాగోష్టి



గవర్నర్ ప్రసంగ పాఠాన్ని పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మెల్యేలు

ఢిల్లీ పరిణామాలపై యనమలతో భేటీ
వ్యూహ కమిటీ సభ్యులతోనూ బాబు చర్చ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

హోదాపై గవర్నర్ చేసిన ప్రసంగ ప్రయోజనాలపై శాసనసభ లాబీల్లో చర్చ సాగింది. గతంలో ప్యాకేజి అన్న గవర్నర్ నేడు హోదా కావాలని చెప్పడంపై భిన్నాభిప్రాయాలతో సభ్యులు చర్చించుకున్నారు. హోదాపై గవర్నర్ స్పందించడం వల్ల కేంద్రం ఇరుకున పడుతుందని, దాని వల్ల రాష్ట్రానికి మేలు జరిగే అవకాశాలుంటాయని కొంతమంది శాసన సభ్యులు వ్యాఖ్యాంచారు. గవర్నర్ ప్రసంగంలో హోదా మాటలను పొందుపరచడం ద్వారా గవర్నర్‌ను కూడా మిగతా 9లో

ఫ్రంట్ కోసం కెసిఆర్ కసరత్తు



సమన్వయ కర్తల నియమాకం
అజెండా రూపకల్పనకు చర్చలు
సిఎం కార్యాలయం వెల్లడి

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

జాతీయస్థాయిలో రాజకీయ ఫ్రంట్‌ను ఏర్పాటు చేస్తానని ప్రకటించిన తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ ఆ దిశలో కసరత్తు ప్రారంభించారు. ఈ మేరకు ఆయన తన భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకుంటున్నట్లు సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ముఖ్యమంత్రి కార్యాలయం తెలిపింది. దీనిలో భాగంగా జాతీయ స్థాయిలో అజెండాను రూపొందించేందుకు వివిధ సంఘాలు, సంస్థలు, ప్రముఖులతో చర్చించేందుకు సమన్వయకర్తలను ఇప్పటికే నియమించారని ఆ ప్రకటన పేర్కొంది. ఈ సమన్వయ కర్తలు వారితో సంప్రదిస్తారని, సమావేశాలు ఏర్పాటు చేస్తారని తెలిపింది. ముఖ్యమంత్రి కార్యాలయం విడుదల చేసిన ప్రకటన ప్రకారం ఐఎఎస్, మిగతా 9లో

త్రిపురలో వేర్పాటు కుంపటి

'ప్రత్యేక త్విప్రాలాండ్'కు బిజెపి మిత్రపక్షం డిమాండ్
గౌరవప్రదమైన పదవులు ఇవ్వకపోతే వెలుపలి మద్దతే



'మాకున్నది ఒకే ఒక్క డిమాండ్. ప్రత్యేక త్విప్రాల్యాండ్ ఏర్పాటు చేసి తీరాలి. ప్రభుత్వంలో మేము కొనసాగినా ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పోరాటం ఉధృతం చేస్తాం. కేబినెట్‌లో ఒక వేళ మాకు గౌరవప్రదమైన పదవులు ఇవ్వకపోతే ప్రభుత్వంలో ఉండం. వెలుపలి నుంచే మద్దతిస్తాం'

- నరేంద్ర చంద్ర దేవ్‌వర్మ, ఐపిఎఫ్‌టి అధ్యక్షులు

అగర్తలా : త్రిపుర అసెంబ్లీలో బిజెపి-ఐపిఎఫ్‌టి కూటమి మెజార్టీ సాధించిన రెండు రోజుల్లోనే గిరిజన వేర్పాటు వాదం గొంతు విప్పుతోంది. బిజెపితో కలిసి ఎన్నికల్లో పోటీ చేసిన ది ఇండిజీనియస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర (ఐపిఎఫ్‌టి) అధినేత నరేష్ చంద్రదేవ్ వర్మ సోమవారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ తమ పార్టీ దీర్ఘకాలంగా డిమాండ్ చేస్తున్న ప్రత్యేక త్విప్రాలాండ్ ఏర్పాటు డిమాండ్‌ను తెరపైకి తెచ్చారు. త్రిపుర తదుపరి ముఖ్యమంత్రిగా గిరిజనుడిని చేయాలని ఆయన డిమాండ్ చేశారు. త్రిపురను విభజించి గిరిజనులకు ప్రత్యేక త్విప్రాలాండ్ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని ఐపిఎఫ్‌టి దీర్ఘకాలంగా పోరాడుతున్న విషయం తెలిసిందే. ఈ డిమాండ్ సాధనకోసం తరచు హింసాత్మక ఉద్యమాలతో రోడ్డెక్కుతున్న ఐపిఎఫ్‌టి రాష్ట్రంలోని బెంగాలీలను టార్గెట్ చేస్తోంది. ఈ పార్టీకి సరిహద్దు అవతలి నుండి కార్యకలాపాలు నిర్వహిస్తున్న వేర్పాటు వాద సంస్థలతో సంబంధాలున్న విషయం మిగతా 8లో



విజయవాడలో విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులకు మద్దతుగా దీక్షలు చేపట్టిన సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గఫూర్, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు జి రామారావులకు సంఘీభావం తెలుపుతున్న ఎన్‌జివో సంఘం నాయకులు సాగర్ తదితరులు - వార్త 7లో

జూడాల సమ్మె తాత్కాలిక వాయిదా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తమ సమస్యల పరిష్కారం కోసం జూనియర్ డాక్టర్లు (జూడా) సంఘం మంగళవారం నుంచి తలపెట్టిన సమ్మె తాత్కాలికంగా వాయిదా పడింది.

జుడాలు సమ్మెకు సిద్ధమవడంతో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాసరావు ఆ సంఘ నాయకులతో సోమవారం రాత్రి చర్చలు ప్రారంభించారు. ఈ చర్చల్లో 8వ తేది వరకు సమ్మెను వాయిదా వేయాలని నిర్ణయించినట్టు జుడాల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరమణ తెలిపారు. 2016-17 ఏడాదికి జూనియర్ డాక్టర్లకు 15 శాతం హైక్ బకాయిలు చెల్లించేందుకు అంగీకరించడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఇది ఇలా ఉండగా సీనియర్ రెసిడెంట్స్, సూపర్ స్పెషాలిటీ వైద్యులందరికీ 40 శాతం గౌరవ వేతనాలు పెంచినట్లు సోమవారం రాత్రి మంత్రి కామినేని శ్రీనివాస్ కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు ఆర్థిక శాఖ మిగతా 9లో

ఉపాధి నిధుల జాప్యంపై ఎంపీలు పార్లమెంట్‌లో ప్రస్తావిస్తారు : సిఎం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధి హామీ నిధుల జాప్యంపై పార్లమెంట్‌లో ఎంపిలు ప్రస్తావిస్తారని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. కోటి పని దినాల లక్ష్యాన్ని ఈ నెలలో పూర్తి చేయాలన్నారు. నీరు-ప్రగతి, వ్యవసాయ అనుబంధ రంగాలపై తన నివాసం నుంచి సోమవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సీజన్‌లో ఒక్క ఎకరంలోనూ పంటలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కందులు అపరాలకు గిట్టుబాటు లభించేలా చూడాలన్నారు. తెగుళ్ల నియంత్రణకు, నాణ్యమైన గాలి కోసం వ్యవసాయ, వాతావరణ శాఖలు ఇస్రో అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.

సమావేశం

శాసనసభ సమావేశాల అనంతరం వివిధ సంక్షేమ పథకలపై మంత్రులతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



జైట్లీతో టిడిపి, బిజెపి నేతలు భేటీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీతో టిడిపి, బిజెపి నేతలు భేటీ అయ్యారు. కేంద్ర మంత్రి సుజనా చౌదరి, రాష్ట్ర ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు, టిడిపి, బిజెపి ఎంపిలు రామ్మోహన్ నాయుడు, కంభంపాటి హరిబాబు, ఏపి భవన్ రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్ ప్రకాశ్, ఏపి ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు కుటుంబ రావు భేటీలో పాల్గొన్నారు. సమావేశం అనంతరం మంత్రి యనమల రామకష్ణుడు మీడియాతో మాట్లాడుతూ 'ప్రత్యేక హోదా మిగతా రాష్ట్రాలకు ఇచ్చి మాకెందుకు ఇవ్వరని అడిగాము. రాష్ట్రానికి రూ.ఆరు వేల కోట్లు రెవెన్యూ లోటు రావాలి. ఇప్పటికీ రూ.నాలుగు వేల కోట్లు మాత్రమే ఇచ్చారని చెప్పాము' అని తెలిపారు. అలాగే రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితుల గురించి కూడా తెలిపామని యనమల అన్నారు. " వెంకయ్య నాయుడు నివాసంలో జరిగిన సమావేశానికి, ఇప్పుడు జరిగిన సమావేశానికి తేడా ఉంది. బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగింది. అన్ని అంశాలను అడిగే హక్కు మాకుంది. కాబట్టి మేము వచ్చి అడిగాము. ఏదో ఒక ప్రయోజనం ఉండాలి కాబట్టి ఇక్కడ అందరితో మాట్లాడుతున్నాం. రాష్ట్రానికి న్యాయం జరిగేలా చూస్తున్నాం. అమిత్ షాతో మరోసారి భేటీ అవుతాం. ప్రస్తుత సమావేశంలో ఆయన లేరు. ఫ్లైట్ లేటు కావడంతో మేమొచ్చే సరికే అమిత్ షా వెళ్లిపోయారు" అని యనమల రామకృష్ణుడు అన్నారు.బిజెపి ఎంపి కంభంపాటి హరిబాబు మాట్లాడుతూ "సమావేశంలో రెండు ఆర్థిక పరమైన అంశాలపై చర్చించాం. ప్రత్యేక హోదా ఇవ్వకపోయినా అటువంటి ఆర్థిక ప్రయోజనాలు ఇస్తామని జైట్లీ అన్నట్లు తెలిపారు. వీటిని వెంటనే అమలు చేసే విధంగా చర్యలు తీసుకుంటుందని అన్నారు. నిధులు ఏ విధంగా ఇవ్వాలో దానిపై కూడా చర్చ జరిగింది. నిధుల విడుదలలలో ఆలస్యం అవుతుందన్న భావన ఉంది" అని అన్నారు.

ప్రాజెక్టుల కోసం భూగర్భ పైపు లైన్లు
ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు భూగర్భ పైపు లైన్లు వేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. భూసేకరణ సమస్యగా మారడం వల్ల భూగర్భ పైపులైన్లు వేయడం ద్వారా ప్రాజెక్టుల నిర్మాణం వేగవంత మవుతుందని ఆయన పేర్కొన్నారు. భూగర్భ మార్గంలో పైపులైన్లు వేయడానికి ఎవరి అను మతి అవసరం ఉండదని, భూసేకరణకు అయ్యే వ్యయం కూడా ఆదా అవుతుందన్నారు. సచివాలయంలో సోమవారం ఆయన పోల వరం సహా ఇతర ప్రాజెక్టుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. పోలవరం ప్రాజెక్టులో వివిధ పనులకు సంబంధించి ఇంకా మిగిలి ఉన్న డిజైన్లను శరవేగంగా రూపొం దించి, కేంద్రం నుంచి ఆమోదం పొందేలా చూడాలన్నారు. డిజైన్ల రూపకల్పనకు, పర్య వేక్షణకు ప్రత్యేకంగా అధికారిని నియమించాలని చెప్పారు. 2018 జనవరి వరకు పోలవరం ప్రాజెక్టు కోసం రూ.13,053.91 కోట్లు ఖర్చు చేయగా జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన అనంతరం రూ.7,918.04 కోట్లు ఖర్చు చేసినట్లు అధికారులు ఈ సందర్భంగా సిఎంకు వివరించారు.

నాడు ప్యాకేజి.. నేడు హోదా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో:

రాష్ట్ర ప్రజలు తీవ్ర కష్టాల్లో ఉన్నారని, విభజన హామీ ప్రకారం రాష్ట్రానికి హోదా ఇవ్వాల్సిందేనని ఉమ్మడి రాష్ట్రాల గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ పేర్కొన్నారు. ఆ బాధ్యత కేంద్రంపై ఉందని ఆయన స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఆయన ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించారు. గతేడాది బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్రానికి ప్రత్యేక ప్యాకేజీకి చేసిన కృషి ఫలించింది అన్న ఆయన సోమవారం ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాల్లో హోదా కావాలని కోరడం చర్చనీయాంశంగా మారింది. విభజన కారణంగా రాష్ట్రం ప్రధాన ఆర్థిక కేంద్రాన్ని కోల్పోయిందని, రెవెన్యూ లోటు, తక్కువ ఆదాయంతో కష్టాలు మరింత పెరిగాయని, ఈ తరుణంలో రాష్ట్రానికి హోదా ఇస్తే తప్ప ప్రజల కష్టాలు తప్పవని గవర్నర్ పేర్కొనడం వెనుక ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి మనసులోని మాటనే గవర్నర్ అసెంబ్లీలో తన నోట వినిపించారని పరిశీలకులు భావిస్తున్నారు. విభజన చట్టంలోని హామీలన్నీ కేంద్రం అమలు చేయాల్సి ఉందని, ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతోందని గవర్నర్ వివరించారు. దీంతో ఈ అంశం అసెంబ్లీలోనూ, లాబీల్లోనూ ప్యాకేజీ, హోదా అంశాలు సర్వత్రా చర్చనీయంగా మారాయి. గత బడ్జెట్ ప్రసంగాన్ని ప్రస్తుత ప్రసంగాన్ని పరిశీలిస్తే గవర్నర్ మాటల్లో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. రాష్ట్రానికి హోదా కావాలని ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం రావడం, గత నెల 8న రాష్ట్రంలో వామపక్షాలు తలపెట్టిన బంద్ విజయవంతం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ హోదా వైపు మొగ్గుతోంది. రాష్ట్రానికి హోదా ఇవ్వలేమని, ప్యాకేజీ ఇస్తామని కేంద్రం ప్రకటించడం, తర్వాత దానిని కూడా అమలు చేయకపోవడంతో రాష్ట్రంలో ఆందోళన మొదలైంది. కేంద్ర తాజా బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచేయి చూపించడంతో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం తలెత్తింది. ఈ దశలోనే చంద్రబాబు ఆలోచనను గవర్నర్ సోమవారం ప్రకటించారని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.



గవర్నర్‌కు ఆహ్వానం పలుకుతున్న సిఎంచంద్రబాబు, స్పీకర్ కోడెల

11.3 శాతం వృద్ధి రేటు

విభజనతో నష్టం వాటిల్లినప్పటికీ ఆంధ్రప్రదేశ్ వేగంగా దూసుకుపోతోందని గవర్నర్ నరసింహన్ పేర్కొన్నారు. 11.3 శాతం వృద్ధి రేటుతో రాష్ట్రం పరుగులు పెడుతోందన్నారు. అది జాతీయ సగటు 6.97 కంటే ఎక్కువగా ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభ బడ్జెట్ సమావేశాలు సోమవారం ఉదయం ప్రారంభంకాగా, గవర్నర్ ఉభయ సభలనుద్దేశించి ప్రసంగించారు. రాష్ట్ర ప్రజలు కష్టాల్లో ఉన్నారని, రాష్ట్రాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని ఆయన స్పష్టం చేశారు. విభజనతో రాష్ట్రం ప్రధాన ఆర్థిక కేంద్రాన్ని కోల్పోయిందని తెలిపారు. రెవెన్యూ లోటు, తక్కువ ఆదాయంతో కష్టాలు మరింత పెరిగాయన్నారు. విభజన చట్టంలో హామీలన్నీ కేంద్రం అమలు చేయాల్సి ఉందన్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతోందన్నారు. భౌగోళిక ప్రదేశం ఆధారంగా ఇరు రాష్ట్రాలకూ ఆస్తులు పంచితే, అప్పులు మాత్రం జనాభా ఆధారంగా పంచారని గుర్తు చేశారు. వెనుకబడిన జిల్లాలకు ఆర్థిక సాయం అందించాల్సి ఉందని, 9,10 షెడ్యూల్ సంస్థలను విభజిం చాల్సి ఉందని తెలిపారు. విశాఖపట్నం, విజయవాడ మెట్రో రైలు మార్గాలు, అమరావతికి ఆర్థిక సహాయం పెంపు, పన్ను విధింపు విషయాల్లో తేడాలు తదితర అంశాలను గవర్నర్ ప్రస్తావించారు.

అగ్రిగోల్డ్ పెద్ద కుంభకోణం

అగ్రిగోల్డ్ వ్యవహారం పెద్ద కుంభకోణమని గవర్నర్ వ్యాఖ్యానించారు. అగ్రిగోల్డ్ రాష్ట్రంలో 32.02 లక్షల మంది నుంచి రూ.6380 కోట్లు డిపాజిట్లు సేకరించిందన్నారు. మోసానికి గురైన వారిలో డిపాజిటర్ల, ఏజెంట్లు దాదాపు 136 మంది ఆత్మహత్య చేసుకున్నారన్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం ఒక్కొక్కరికీ రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియో చెల్లించినట్లు తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ కొరత లేకుండా చేయగలిగామన్నారు. అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. అభివృద్ధి ఫలాలు చిట్ట చివరి వ్యక్తికి చేరేవరకు నిర్విరామంగా కృషి చేస్తామన్నారు. శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు చెప్పారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పోలీసు వ్యవస్థ ఆధునికీకరించినట్లు పేర్కొన్నారు. వామపక్ష తీవ్రవాదాన్ని అదుపులోకి తెచ్చామని, రౌడీయిజాన్ని పూర్తిగా అణచివేశామని పేర్కొన్నారు. పోలీసులు కనపడకుండా పోలీసింగ్ మాత్రమే కనబడేలా రాష్ట్రాన్ని తీర్చిదిద్దామని తెలిపారు. ఎకో, హెరిటేజ్, టూరిజం విభాగాల్లో ఆధునిక సదుపాయాలతో కొత్త పర్యాటక ప్రాజెక్టులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కియా మోటార్స్ కర్మాగారం అనంతపురం జిల్లాకు ఒక గేమ్ ఛేంజర్‌గా నిలుస్తుందన్నారు. ఆటో మొబైల్ కేంద్రంగా అనంతపురం అభివృద్ధి చెందుతోందన్నారు. తిరుపతి ఎలక్ట్రానిక్ హబ్‌గా మారుతోందన్నారు. ఔషధ, ఏరోస్పేస్, డిఫెన్స్, ఇంజనీరింగ్ ఉత్పత్తుల హబ్‌గా విశాఖ, జౌళి, ఆహారశుద్ధి కేంద్రాలుగా కృష్ణా, గుంటూరు అభివృద్ధి చెందుతుందన్నారు. కర్నూలులో ఆల్ట్రా మెగా ఫుడ్ పార్క్ ఏర్పాటు కాబోతున్నట్లు తెలిపారు. వృద్ధి గమనాన్ని సుస్థిరపరచడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

యువతకు ఉపాధి కల్పన

యువతకు ఉపాధి కల్పించడమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. ప్రైవేటు రంగంలో పెద్ద ఎత్తున ఉపాధిని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేస్తోందన్నారు. 2019లో 10 లక్షల మందికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు. 2018 లో చమురు, సహజవాయువు అన్వేషణలో ప్రభుత్వం పెట్టుబడులు ఆశిస్తోందని చెప్పారు. విజయవాడ, విశాఖ, తిరుపతి విమానాశ్రయాలు ప్రయాణికులు రద్దీ విషయంలో దేశంలోనే అధిక వృద్ధి నమోదు చేస్తున్నాయన్నారు. భోగాపురం, ఓర్వకల్లు, దగదర్తి, దొనకొండ కొత్త విమానాశ్రయాల పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. ప్రపంచంలోనే మొట్టమొదటి గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్‌సిటీగా అమరావతి నిర్మాణం కాబోతోందన్నారు. అమరావతి ఒక పరిపాలన రాజధాని మాత్రమే కాదని, అంతర్జాతీయ కేంద్రంగా భావిస్తున్నట్లు తెలిపారు. 2018లో సింగపూర్ కన్సార్టియం ద్వారా స్టార్టప్ ఏరియా మాస్టర్ డెవలప్‌మెంట్ ప్రారంభం కానున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని 12,854 గ్రామ పంచాయతీలకు గాను 6311 గ్రామ పంచాయతీలను ఓడిఎఫ్‌గా ప్రకటించామని తెలిపారు. ఉభయ గోదావరి, నెల్లూరు, కృష్ణా, ప్రకాశం, గుంటూరు జిల్లాలను ఓడిఎఫ్ జిల్లాలుగా ప్రకటించినట్లు పేర్కొన్నారు.

కౌలు రైతులకు పెద్ద ఎత్తున రుణాలిచ్చారనేది అవాస్తవం
ఎపి కౌలు రైతుల సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కౌలు రైతులకు పెద్ద ఎత్తున రుణాలిచ్చామని గవర్నర్ బడ్జెట్ ప్రసంగంలో తెలిపిన అంశాలు అవాస్తవమని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎన్ రంగారావు, పి జమలయ్య తెలిపారు. ఈ మేరకు సోమవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఏడాది ఇచ్చిన మొత్తం పంట రుణాలు రూ. 63 వేల కోట్లని, అందులో కౌలు రైతులకు ఇచ్చింది కేవలం రూ.2326 కోట్లేనని తెలిపారు. రుణమాఫీలోనూ కౌలు రైతులకు ప్రభుత్వం అన్యాయం చేసిందని పేర్కొన్నారు. రూ. 574 కోట్లకుగాను రూ. 144 కోట్లు మాత్రమే రుణమాఫీ చేసి చేతులు దులుపు కొన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాస్తవాలు విస్మరించి అబద్ధాలు చెప్పటం రైతాంగాన్ని మోసగించడమేనని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా కౌలు రైతులకు దామాషాను బట్టి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రుణాలందించాలని వారు డిమాండ్ చేశారు.

ప్రజ్ఞ

1. ఇండియా బై ది నైల్ కల్చరల్ ఫెస్టివల్ 2018ను ఎక్కడ నిర్వహించనున్నారు?
2. 2018 పొలిటికల్ అండ్ పబ్లిక్ లైఫ్ అవార్డులలో లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ ఎవరికి లభించింది ?
3. ట్రిప్ అడ్వైజరీ సంస్థ సర్వేలో 2018 సంవత్సరానికి ఆసియాలోనే అందమైన బీచ్‌గా ఏది ఎంపికైంది?
4. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా ఫిరంగిపురం రైల్వే స్టేషన్ ఈ మధ్య వార్తల్లో నిలవడానికి గల కారణం?
5. ఆర్మేనియా అధ్యక్షుడిగా ఎవరు ఎన్నికయ్యారు?

సమాధానాలు 11లో

ఆత్మస్తుతి - అర్ధ సత్యాలు

- గవర్నర్ ప్రసంగంపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మధు
- విభజన హామీలపై దాగుడు మూతలు
- ప్రస్తావన లేని దళితులపై దాడులు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో


గవర్నర్ ప్రసంగంలో రాష్ట్ర ప్రభుత్వ ఆత్మస్తుతి, రాష్ట్ర పరిస్థితులు, పాలన పట్ల అర్ధ సత్యాలతో నిండి ఉందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు విమర్శించారు. ప్రభుత్వ పాలన విధానానికి సూచికగా భావించే ఈ ప్రసంగంలో కీలకమైన రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోసం కేంద్రం పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఏలాంటి వైఖరిని తీసుకుంటుందో స్పష్టం చేయకుండా దాగుడు మూతలు కొనసాగించడం గర్హనీయమని సోమవారం ఆయన ఒక ప్రకటనలో వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక హోదాకు మంగళం పాడి ప్రత్యేక ప్యాకేజ్ ఇస్తామంటే దీనిని అర్ధరాత్రి మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి స్వాగతించారని గుర్తు చేశారు.

'గత మూడేళ్ల తొమ్మిది నెలల కాలంలో నా ప్రభుత్వం కఠినమైన, అలుపెరగని కృషి చేసింది' అని గవర్నర్ తన ప్రసంగంలో అనడం హాస్యాస్పదమన్నారు. హామీలను త్వరగా అమలు చేయాలనే ప్రజల డిమాండ్‌ను పునరుద్ఘాటిస్తున్నానని చెప్పడం కాదని, వాటిని సాధించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తోందో, ఏలాంటి వైఖరిని చేపడుతుందో పేర్కొనక పోవడం బిజెపి-టిడిపిల దోబూచులాటకు అద్దం పడుతోందని విమర్శించారు. కడప స్టీల్‌ప్లాంట్, వైజాగ్-చెన్నై పారిశ్రామిక కారిడార్, మెట్రో రైలు తదితర సమస్యల కంటే శాసనసభలో సీట్ల పెంపు గురించి ప్రసంగంలో పేర్కొన్నారంటే, ఈ ప్రభుత్వ ప్రాధాన్యతలు ఏలా ఉన్నాయో ఇట్టే బోధపడుతుందని తెలిపారు. రాష్ట్ర రాజధాని నడిబొడ్డున ఒక శాసనసభ్యుడు భూకబ్జాకు పాల్పడ్డారని మీడియా కోడై కూస్తుంటే రౌడీయిజాన్ని పూర్తిగా అదుపులోకి తీసుకు రావడమైందని గవర్నర్ పేర్కొనడం కొండంత అబద్ధమని తెలిపారు. పోలీసులు కనబడకుండా, పోలీసింగ్ కనబడే విధంగా అంటే గవర్నర్ దృష్టిలో ప్రజా సమస్యలపై ఆందోళన చేస్తున్న వామపక్షాలు, ప్రతిపక్షాలకు చెందిన నాయకులు, కార్యకర్తల ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధాలకు పాల్పడడమేనేమోనని అభిప్రాయం వ్యక్తం చేశారు. సంక్షేమం గురించి సుదీర్ఘంగా ఏకరువు పెట్టిన గవర్నర్, ప్రభుత్వ పథకాలకు అన్ని విధాలా అర్హులైన పేదలను అడ్డుకుంటూ రాజ్యాంగేతర శక్తులుగా వ్యవహరిస్తున్న జన్మభూమి కమిటీల గుర్తించి ప్రస్తావించకపోవడం గర్హనీయమన్నారు. 2016, 2017లో వర్షపాతం భారీ లోటులో ఉన్నా ఎరువుల వినియోగం తగ్గి పోయినప్పటికీ ఆహార ధాన్యాల ఉత్పత్తి మాత్రం పెరుగుతుందనడం అర్ధ రహితమని పేర్కొన్నారు. ఈ ఏడాది ఇచ్చిన వ్యవసాయ రుణాలు రూ.63 వేల కోట్లలో కౌలుదార్లకు అతి స్వల్పంగా రూ.2,326 కోట్లు (3.7శాతం) మాత్రమే ఇచ్చారని పేర్కొన్నారు. అయినా కౌలుదార్లకు రుణాలను మూడేళ్లలో ఎనిమిది రెట్లు పెంచామని చెప్పుకోవడం ప్రజలను మోసగించడమేనని వివరించారు. కౌలుదార్లకు పంట రుణాల్లో 10 శాతం ఇస్తామని టిడిపి ఎన్నికల ప్రణాళికలో హామీనిచ్చి, నాలుగేళ్ల నాటికి అందులో మూడో వంతు మాత్రమే అమలు చేసిందని తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ స్థాపిత సామర్థ్యం రెట్టింపైందని చెప్పుకున్న ప్రభుత్వం, వ్యవసాయ పంపు సెట్లకు కనీసం తన ఎన్నికల హామీ మేరకు 9 గంటల సరఫరాను సైతం అమలు చేయకపోవడం క్షంతవ్యం కాదని పేర్కొన్నారు. ఉపాధి హామీ అంటే ఎన్ని వ్యవసాయ కార్మిక, పేద రైతు కుటుంబాలకు పని కల్పించారో, అందులో చట్టం ఇచ్చిన హామీ ప్రకారం వంద రోజుల పని ఎంత మందికిచ్చారో చెప్పకుండా ఆ నిధుల నుంచి ఎన్ని భవనాలు, సిసి రోడ్లు నిర్మించారో పేర్కొనడం ద్వారానే ఉపాధిని ఈ సర్కారు కాంట్రాక్టర్లకు ఏలా అప్పగించిందో విదితం చేస్తోందని తెలిపారు. సమాజంలో సగ భాగంగా ఉన్న మహిళల కోసం మొత్తం 147 పేరాల ప్రసంగంలో కేవలం రెండు పేరాలు మాత్రమే కేటాయించడంలోనే ఈ ప్రభుత్వానికి మహిళలు, వారి సమస్యల పట్ల ఏపాటి శ్రద్ధ ఉందో విదితమవుతోందన్నారు. అదే సమయంలో రియల్ టైమ్ గవర్నెన్స్ అంశానికి 8 పేరాలు కేటాయించడం గమనార్హమని తెలిపారు. గరగపర్రు, పెదగొట్టిపాడు, మహా భారతం తదితర ఘటనల్లో దళితులపై యథేచ్ఛగా దాడులు జరిపి , సాంఘిక బహిష్కరణలకు గురి చేస్తుంటే వాటిని అరికట్టే చర్యల గురించి గవర్నర్ ప్రసంగంలో ఒక్క మాట కూడా లేదని ఆందోళన వ్యక్తం చేశారు. విష జ్వరాలు, అంతుపట్టని వ్యాధులతో గిరిజనులు పిట్టల్లా రాలిపోతుంటే వాటి గురించి గవర్నర్ అసలు ప్రస్తావించనే లేదన్నారు. యువతను ఊరించిన నిరుద్యోగ భృతి గురించి గవర్నర్ పేర్కొనలేదని తెలిపారు.



సంక్షేమానికి పెద్దపీట : మంత్రి కాల్వ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమానికి పెద్దపీట వేసిందని రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కాల్వ శ్రీనివాసులు పేర్కొన్నారు. అసెంబ్లీ తొలిరోజు సోమవారం మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ రెవిన్యూ లోటుతో ఆదాయం లేక ఇబ్బంది పడుతూ కూడా బాధ్యతగా ప్రభుత్వాన్ని నడిపిస్తున్న తీరు దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. గవర్నర్ ప్రసంగంలో రాష్ట్ర ప్రగతి చిత్రాన్ని ఆవిష్కరిస్తూనే, విభజన చట్టంలోని హామీల అమలుకు ప్రభుత్వం నిరంతరం చేసిన కృషిని ప్రసం గంలో పొందుపరిచారన్నారు. రెవిన్యూలోటు, జాతీయ సంస్థలకు నిధులు, పోలవరానికి నిధుల కేటాయింపు అంశాల్లో స్పష్టమైన వైఖరితోనే ఉన్నామన్నారు. వైసిపి బాధ్యతారాహిత్యంగా శాసన సభా సమావేశాలను బహిష్కరించిందని మంత్రి అన్నారు. ప్రతిపక్షం సభలో లేక పోయినా ప్రజల సమస్యలను అధికారపక్ష సభ్యులే మంత్రుల దృష్టికి తీసుకురావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచిం చారని శ్రీనివాసులు తెలిపారు. సభలో ప్రతిపక్ష పాత్ర కూడా తామే పోషిస్తామన్నారు.

నదుల అనుసంధాన ఘనత చంద్రబాబుదే : విప్ పల్లె

గోదావరి, కృష్ణా నదుల అనుసంధానం చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని ప్రభుత్వ విప్ పల్లె రఘునాథ రెడ్డి తెలిపారు. పట్టిసీమ ద్వారా నదుల అనుసంధానం దేశ వ్యాప్తంగా ఎందరికో ఆదర్శంగా నిలచిందన్నారు. కాంగ్రెస్ పార్టీ 67 ఏళ్లలో చేయలేని అభివృద్ధిని చంద్రబాబు కేవలం మూడేళ్లలో చేసి చూపించారన్నారు. పోలవరం, హంద్రీనీవా, గాలేరీ -నగరి, వెలుగొండ తదితర ప్రాజెక్టులను త్వరతి గతిన పూర్తి చేసేందుకు చంద్రబాబు సర్కారు కృషి చేస్తోందన్నారు.

జగన్ జైలుకు వెళ్లడం ఖాయం : జివి ఆంజనేయులు

జగన్ అవినీతి కేసుల్లో జైలుకు వెళ్లడం ఖాయమని వినుకొండ ఎమ్మెల్యే జివి ఆంజనేయులు అన్నారు. బాధ్యత లేని ప్రతిపక్షం ఉండటం దురదృష్టకరమన్నారు. ప్రధాని మోడీని నిలదీయలేని జగన్ డిల్లీలో ధర్నాల పేరుతో డ్రామాకు తెరదీశారన్నారు.


19 అంశాలను నెరవేర్చాల్సిందే : డొక్కా

విభజన చట్టంలోని 19 అంశాలను కేంద్రం నెరవేర్చాల్సిందేనని, కేంద్రంపై మరింత ఒత్తిడి తెస్తామని టిడిపి ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ అన్నారు. పాదయాత్ర కంటే అసెంబ్లీ పవిత్రమైనదని, ఎన్ని పాదయాత్రలు చేసినా అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలను చర్చించి పరిష్కారమార్గాన్ని కనుగొనాలన్నారు. గవర్నర్ ప్రసంగం వినూత్నంగా ఉందన్నారు.

విభజన చట్టంలోని అంశాలపై చర్చించాలి :
బిజెపి ఫ్లోర్ లీడర్ విష్ణుకుమార్‌రాజు

అసెంబ్లీ సమావేశాల్లో విభజన చట్టంలోని అంశాలపై చర్చ జరగడం ద్వారా వాస్తవాలు రాష్ట్ర ప్రజలకు తెలుస్తాయని శాసనసభ బిజెపి ఫ్లోర్ లీడర్ విష్ణుకుమార్ రాజు అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి బిజెపి కట్టుబడిఉందన్నారు. కొన్ని రాజకీయ పార్టీలు కేంద్ర ప్రభుత్వంపై, బిజెపిపైనా అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని, అసత్య ప్రచారాలను నమ్మే స్థితిలో ప్రజలు లేరని అన్నారు.

రూ.5వేల కోట్లిస్తే 1700 కోట్లే ఖర్చు చేశారు : వీర్రాజు



పోలవరం ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం రూ. 5 వేల కోట్లు నిధులు విడుదల చేస్తే, రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ.1700 కోట్లే ఖర్చు చేసిందని, ఇప్పటి వరకు 30 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయన్నారు. ప్రాజెక్టుకు కేటాయించిన నిధుల వినియోగంపై కమిటీ అధ్యయనం చేస్తోందన్నారు. ప్రత్యేక హోదాతో రూ 3 వేల కోట్లు మాత్రమే వస్తాయని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పిన మాట నిజంకాదా అని ఆయన ప్రశ్నించారు.

కేంద్ర నిధుల వినియోగంపై సర్వే : ఎమ్మెల్సే మాధవ్

కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధుల వినియోగానికి సంబంధించి ఎయిమ్స్, నిట్, పోలవరం, కేంద్ర విద్యాలయాల పనులు ఏ మేర జరిగాయని, ఖర్చు ఎంత చేశారనే విషయాలపై క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహిస్తామని ఎమ్మెల్సీ మాధవ్ తెలిపారు. విభజన చట్టంలోని అంశాలు, హామీల అమలుపై శాసనసభలో కూలంకషంగా చర్చ జరగాలని బిజినెస్ అడ్వయిజరీ కమిటీకి తాము సూచించామన్నారు. ఔట్ సోర్సింగ్, విద్యుత్తు కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు అసెంబ్లీ వేదికగా ఉండాలని ప్రభుత్వాన్ని కోరామన్నారు. ప్రత్యేకహోదా 11 రాష్ట్రాల్లో అమల్లో లేదని, అక్కడ కేవలం పారిశ్రామిక ప్రోత్సాహకాలు మాత్రమే కేంద్రం ఇస్తోందని తెలిపారు.

ప్రత్యేకం

కియా కోసం 825 కోట్ల ఖర్చు
బడ్జెట్‌లో పెట్టాలని ప్రతిపాదన

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

కియా... రాష్ట్ర ఖజానాకు భారంగా మారుతోంది. ఎక్కడి నుంచో వచ్చిన సంస్థ కోసం స్థానికంగా వందల కోట్ల రూపాయలను తృణ ప్రాయంగా ఖర్చు చేస్తున్నారు. రానున్న కాలంలో లభించే ప్రయోజనాల మాట ఎలా ఉన్నప్పటికీ, ప్రస్తుతం ఖజానాకు ఇబ్బందులు తప్పడం లేదని ఆర్థిక శాఖ అధికారులే అంటున్నారు. కియా కార్ల సంస్థ రాష్ట్రానికి వచ్చినందుకు పదే పదే ఆనందాన్ని వ్యక్తం చేస్తున్న ముఖ్యమంత్రి, తెర వెనుక ఖర్చును మాత్రం చెప్పడం లేదు. ఇప్పటికే పెద్ద మొత్తంలో సొమ్మును ఖర్చు చేసిన ఎపిఐఐసి అధికారులు ఆ మొత్తాన్ని బడ్జెట్‌లో పెట్టాలని ప్రతిపాదిస్తున్నారు.

అనంతపురం జిల్లా పెనుగొండ మండలంలో దాదాపు ఆరు వేల కోట్ల రూపాయలతో దక్షిణ కొరియా దేశానికి చెందిన కియా సంస్థ కార్ల తయారీ కేంద్రాన్ని ప్రారంభిస్తోంది. దీనికి సంబంధించిన పనులు కూడా వేగవంతంగా జరుగుతున్నాయి. అయితే పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించి రాష్ట్ర ఖజానాపై భారం ఎక్కువగా ఉండడం చర్చకు తావిస్తోంది. పెద్ద పరిశ్రమలను ఆహ్వానించేందుకు కొంత నజరానాలను, తాయిలాలను ఇవ్వక తప్పదని అధికారులు అంటున్నప్పటికీ, అది తలకు మించిన భారంగా మారిందని చెబుతున్నారు. తాజాగా ఈ పరిశ్రమకు ఇచ్చే భారీ ప్రోత్సాహకాల కోసం రూ.825 కోట్లు కావాలని ఎపిఐఐసి అధికా రులు ప్రతిపాదించడం, దానిని బడ్జె ట్‌లో పొందుపరచాలని కోరడం విశేషం. నజరానాలు భావ్యమే కానీ, ఇంత భారీగానా.. ! అన్న ప్రశ్నను కొంతమంది అధికారులే సంధిస్తుం డటం గమనార్హం. కియా సంస్థను ప్రోత్సహించేందుకు భూమి కోసం రూ. 247 కోట్లు, భూమి చదును, జిఎస్టీ, ఎపిఐఐసి టవర్ల కోసం రూ.126 కోట్లు, సర్వీసు రోడ్లు, కెనాల్ పనులకు రూ. 90 కోట్లు, జాతీయ రహదారిపై ఫ్లయ్ ఓవర్లకు రూ. 80 కోట్లు, ఇతర సౌకర్యాలకు రూ. 107 కోట్లు, విద్యుత్ సరఫరా కోసం రూ. 100 కోట్లు, నీటి సరరాకు రూ. 60 కోట్లు, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కోసం రూ. 14 కోట్లు ఖర్చు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇంత మొత్తాన్ని ఒక సంస్థకు ఖర్చు చేయడం ద్వారా వచ్చే ఫలితాలు ఏమిటనే అంశం చర్చనీయాంశమైంది. ఇవి కాకుండా పన్నుల్లో రాయితీలు కూడా అదనపు ప్రోత్సాహకాలుగా ఉన్నాయి. భారీగా నిర్మిస్తున్న ఈ సంస్థ ద్వారా దాదాపు పది వేల మందికి ఉపాధి లభిస్తుందని అధికారులు చెబుతున్నారు. ఇందులో నాలుగు వేల మందికే నేరుగా ఉపాధి ఉంటుందని, మిగిలిన వారికి పరోక్ష ఉపాధి లభిస్తుందని అంటున్నారు. వీరిలో సంస్థ నేరుగా సమకూర్చుకునే సాంకేతిక సిబ్బంది మినహాయిస్తే స్థానికంగా ఉన్న వారిలో ఎంత మందికి ఉపాధి లబ్ధి సమకూరుతుందనేది విస్పష్టంగా చెప్పలేమని అధికారులు అంగీకరిస్తు న్నారు. ఇదే అంశాన్ని ఎపిఐఐసి చైర్మన్ కృష్ణయ్య వద్ద ప్రస్తావించగా, కియా వంటి భారీ పరిశ్రమ కోసం కొంత భారాన్ని మోయడం అవసరమేన న్నారు. రూ. 825 కోట్ల వరకు బడ్జెట్‌లో పొందుపరచాలని కోరుతున్నామని, ఈ నిధుల వల్ల నిరుద్యోగం కొంతవరకు తీరుతుందని చెప్పారు. వాస్తవంగా ఇప్పటికే ఇందులో కొంత సొమ్మును తాము ఖర్చు చేశామని, బడ్జెట్‌లో పొందుపరచడం ద్వారా ఈ మొత్తాన్ని తాము రీయింబర్స్‌మెంట్ కోరుతున్నామని తెలిపారు.



సంక్షిప్తం

ఆర్టీజిని సందర్శించిన గవర్నర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గంట కాదు...ఒక రోజంతా ఇక్కడే ఉండిపోవాలనిపిస్తోందని తెలుగు రాష్ట్రాల గవర్నర్ నరసింహన్ అన్నారు. వెలగపూడి సచివాలయంలోని రియల్ టైం గవర్నెన్స్ సెంటర్ (ఆర్టీజి)ను సోమవారం సందర్శించారు. అక్కడాయన సతీమణితో పాటు దాదాపు గంటకుపైగా గడిపారు. ఆర్టీజి పనితీరుపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజెంటేషన్ ఇచ్చారు. ఆర్టీజిలోని ప్రతి అంశం గురించి గవర్నర్ విపులంగా అడిగి తెలుసుకున్నారు. బ్యాటరీకారులో సచివాలయం మొత్తాన్ని పరిశీలించారు.

చేతికి కట్టుతో అసెంబ్లీకి హాజరైన బాలకృష్ణ

హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చేతికి కట్టుతోనే శాసనసభ సమావేశాలకు హాజరయ్యారు. గాయం కారణంగా ఇటీవల ఆయన శస్త్ర చికిత్స చేయించుకున్న సంగతి తెలిసిందే. చేతి కట్టుతోనే సభకు వచ్చిన ఆయనను పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు పరామర్శించారు. ఆయన కూడా వారిని కుశల ప్రశ్నలు వేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ ఎన్టీఆర్ బయోపిక్ సినిమా షూటింగ్‌ను ఈనెల 29 నుంచి ప్రారంభించనున్నట్లు తెలిపారు. గాయం గురించి మంత్రులు అడగగా ఇదొక దెబ్బే కాదని ఆయన వ్యాఖ్యా నించారు.

బిజెపి సభ్యులతో కలిసిరాని కామినేని

బిజెపి సభ్యులతో అదే పార్టీకి చెందిన మంత్రి కామినేని శ్రీనివాస్ కలవక పోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. శాసనసభ సమావేశాల ప్రారంభం సందర్భంగా బిజెపికి చెందిన మంత్రి మాణిక్యాలరావు, ఎమ్మెల్సీలు సోము వీర్రాజు, మాధవ్, ఆ పార్టీ శాసనసభా పక్షనేత విష్ణుకుమార్‌రాజు, ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ సోమవారం తమ పార్టీ కండువాలు ధరించుకుని అభివాదాలు చేస్తూ సభకు హాజరయ్యారు. వారితో పాటు అదే పార్టీకి చెందిన మరో మంత్రి కామినేని వారితో కలవకుండా వేరుగా సభలోకి వెళ్లారు.

టిడిపి నాయకుని ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి- అనంతపురం క్రైం

అనంతపురం జిల్లా పుట్టపర్తి నియోజకవర్గ టిడిపి నాయకుడు కొండసాని సురేష్‌రెడ్డి సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసుల సాక్షిగా నగర ఒకటో పోలీస్‌స్టేషన్‌లో బిపి మందు బిళ్లలు వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇటీవల కాలంలో పోలీసులు క్రికెట్ బెట్టింగ్ గ్యాంగ్‌పై ప్రత్యేక నిఘా ఉంచారు. అందులో భాగంగానే మూడు రోజుల క్రితం క్రికెట్ బెట్టింగ్ ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. పోలీసుల విచారణలో కొండసాని సురేష్‌రెడ్డి పేరు ప్రస్తావనకు వచ్చింది. ఈనెల 4వ తేదీన పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో మనస్తాపాంతో బిపి మందు బిళ్లలు ఎక్కువ మోతాదులో తీసుకున్నారు. గమనించిన పోలీసులు హుటాహుటిన స్థానిక శ్రీనివాస ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం ఆయనను బెంగళూరుకు తరలించారు.



గుంటూరులో నిర్వహిస్తున్న నంది నాటకోత్సవాల్లో సోమవారం ప్రదర్శించిన రంగుల లోకం నాటికలోని ఓ దృశ్యం

తెనాలి నంది నాటకోత్సవాలకు విశేష ఆదరణ

ప్రజాశక్తి-తెనాలి (గుంటూరు)

నంది నాటకోత్సవాలు సమాజంలో రుగ్మతలను రూపుమాపే కథాంశాలతో చక్కని సందేశాన్ని ఇస్తున్నాయి. ఆధునిక పోకడలను నేటి సమాజం ఆలోచించాల్సిన అవసరం ఉందని చాటి చెబుతున్నాయి. సోమవారం రెండు నాటకాలు, నాలుగు నాటికలను ఆయా కళాపరిషత్‌లు ప్రదర్శించాయి. నవజ్యోతి ఆర్ట్స్ కావలి వారు ప్రదర్శించిన 'చిత్రం' నాటకం ప్రేక్షకులను ఆలోచింప చేసింది. సుమాంజలి ఆర్ట్స్ మంగళగిరి వారి 'రెండు ఒక్కటైతే' నాటకాన్ని పివి.భవానీప్రసాద్ రచించగా దర్శకత్వం మహబూబ్‌చంద్ అందించారు. నేటి సమాజంలో స్త్రీలు పురుషులతో సమానం, స్త్రీలకు అనేక హక్కులు ఉన్నాయి, తల్లిదండ్రులను పోషించే బాధ్యత పిల్లలది, కాపురంలో కలహాలు వచ్చినప్పటికీ ఇరువురు సర్దుకుపోయి అత్తమామలతో సంతోషంగా గడపాలన్నదే నాటకం సారాంశం. ప్రద్యున్ ఆర్ట్ క్రియేషన్ విజయవాడ వారి 'తులసి తీర్థం' నాటికకు రచన అప్పలాచార్య, దర్శకత్వం ఎస్.శివాజీ అందించారు. మనిషికి మనిషికి మధ్య కావాల్సినవి కులాలు, మతాలు కావు మంచితనం, మానవత్వం ఒక్కటే జీవితాన్ని ముందుకు నడిపిస్తాయన్న సారాంశంతో నాటిక ఆద్యంతం హాస్య చలోక్తులతో ప్రేక్షకులను ఆలోచింప చేసింది. అభ్యుదయ ఆర్ట్స్ విజయవాడ వారి 'అన్వేషిత' నాటికకు రచన, దర్శకత్వం ఎ.సాయి పద్మశేఖర్ అందించారు. ఆర్‌ఆర్ క్రియేషన్స్ విజయవాడ వారి 'ఒక్క క్షణం' నాటికకు రచన బివి.శ్యామ్‌ప్రసాద్, దర్శకత్వం బి.రాజగోపాల్ అందించారు. హర్షక్రియేషన్స్ విజయవాడవారి 'నా గూడు' నాటికకు రచన ఐ.లక్ష్మీసౌజన్య, దర్శకత్వం కత్తి శ్యాం ప్రసాద్‌లు అందించారు. ఈ సందర్భంగా సీనియర్ కళాకారులు వట్టి సాంబశివరావు, పందిటి ప్రసాద్‌బాబు, వెలగా సుభాష్‌చంద్రబోస్, దార్ల సుబ్బారావు, అడిగొప్పల సాంబశివరావు, సిహెచ్.కోటేశ్వరరావులను బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు, పట్టణ రంగస్థల కళాకారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు షేక్ జానీబాషా, ఎం.సత్యనారాయణశెట్టి పలువురు ప్రముఖులు ఘనంగా సత్కరించారు.

రొయ్యల ఫ్యాక్టరీలో అమోనియా గ్యాస్ లీక్

- 9 మందికి అస్వస్థత
- ఇద్దరి పరిస్థితి విషమం
- ఫ్యాక్టరీ వద్ద సిఐటియు ధర్నా
- యాజమాన్య నిర్లక్ష్యంపై ఫ్యాక్టరీస్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆగ్రహం

ప్రజాశక్తి - కరప, కాకినాడ రూరల్ (తూర్పుగోదావరి)

కరప మండలం గురజానపల్లి వీరభద్ర ఎక్స్‌పోర్ట్ రొయ్యల ఫ్యాక్టరీలో సోమవారం అమోనియా గ్యాస్ లీకవడంతో తొమ్మిదిమంది మహిళా కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఏడాదిలో ఇది నాలుగో ప్రమాదం కావడం గమనార్హం.

గురజానపల్లి వీరభద్ర ఎక్స్‌పోర్ట్ రొయ్యల ఫ్యాక్టరీలో రోజుకు రెండు షిఫ్టులలో సుమారు 750 మంది పనిచేస్తున్నారు. వీరిలో కరప, గురజానపల్లి, గొర్రిపూడి, వేములవాడ, పెనుగుదురు, నడకుదురు తదితర గ్రామాల వారితోపాటు ఒడిశా నుంచి వచ్చినవారూ ఉన్నారు. ఫ్యాక్టరీ పనిలో కార్మికులు నిమగ్నమై ఉండగా, కంప్రెషర్ మరమ్మతులకు గురవడంతో పెద్దశబ్దంతో అమోనియా గ్యాస్ లీకైంది. సుమారు 250 మంది కార్మికులు బయటకు పరుగులు తీశారు. కరప మండలం గురజానపల్లికి చెందిన దేవు సుబ్బలక్ష్మి, వేములవాడకు చెందిన రేవు కామేశ్వరి, బండి జ్యోతి, కరపకు చెందిన ఎస్.దేవి, రేవు కామేశ్వరి, కోరుమిల్లి దేవి, గొర్రిపూడికి చెందిన సింగురుమల్లి దుర్గ, రచ్చ సుధ, తాళ్లరేవు మండలం ఏటిమొగకు చెందిన ఓలేటి కామేశ్వరి అస్వస్థతకు గురయ్యారు. వీరిలో దుర్గ, సుధ పరిస్థితి విషమంగా ఉంది.

సిఐటియు ఆధ్వర్యాన ధర్నా

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వీరలక్ష్మి, నాయకులు అజయ్‌కుమార్, దుర్గా ప్రసాద్, సతీష్ ఫ్యాక్టరీ వద్దకు చేరుకుని ధర్నా చేశారు. యాజమాన్యం స్పందించకపోవడంతో నాయకులు ఫ్యాక్టరీ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. సెక్యూర్టీ సిబ్బంది అడ్డుకోవడంతో కొద్దిసేపు వాగ్వివాదం నెలకొంది. అనంతరం సిఐటియు నాయకులు లోపలికి ప్రవేశించారు.



అమోనియా లీకైన ప్రదేశంలో వాటరింగ్ చేయిస్తున్న అధికారులు

యాజమాన్యంపై ఫ్యాక్టరీస్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆగ్రహం

ఫ్యాక్టరీస్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఎంవి.శివకుమార్‌రెడ్డి ఫ్యాక్టరీ వద్దకు చేరుకున్నారు. అమోనియా గ్యాస్ వెదజల్లుతుండటంతో యాజమాన్యంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మాస్కులు ధరించకుండా కార్మికులతో పనులు చేయించడమేమిటని ప్రశ్నించారు. భద్రతా పరికరాలు ఉన్నా అత్యవసర సమయాల్లో అశ్రద్ధగా వ్యవహరించడం వల్ల ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. పూర్తి విచారణ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాకినాడ నుంచి వచ్చిన ఫైర్ ఇంజన్ సిబ్బంది వాటరింగ్ చేసి అమోనియా ప్రవాహాన్ని పూర్తిగా అరికట్టారు.

ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వీరలక్ష్మి మాట్లాడుతూ గతంలో పలుమార్లు గ్యాస్ లీకైనా, యాజమాన్యం భద్రతా చర్యలు తీసుకోకుండా పనులు చేయిస్తుండటంతో మరోసారి ప్రమాదం సంభవించిందన్నారు. కార్మికుల ప్రాణాలు పట్టవా అని ప్రశ్నించారు. సంఘటన తర్వాత కూడా కార్మికులను ఫ్యాక్టరీలో ఉంచడమేమిటని యాజమాన్యాన్ని నిలదీశారు. ఆక్వా కార్మిక సంఘం జిల్లా నాయకురాలు పిఎస్ సత్యవతి శివకుమార్‌రెడ్డికి జరిగిన సంఘటనను వివరించారు. ఫ్యాక్టరీలో సుమారు నాలుగుసార్లు అమోనియా గ్యాస్ లీకైందన్నారు. కార్మికులకు రక్షణ లేకుండా పోయిందని, అస్వస్థతకు గురైన వారికి పూర్తి వైద్యం, పరిహారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పద్మ, వెంకటలక్ష్మి, ఆర్‌డిఒ రఘుబాబు, రూరల్ సిఐ రాంబాబు, తహశీల్దార్ బి.శ్రీదేవి, ఎంపిడిఒ కామశాస్త్రి, ఎస్ఐ అప్పలరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

రొయ్యల ఫ్యాక్టరీలో అస్వస్థతకు గురైన తొమ్మిదిమంది కాకినాడ రూరల్‌లోని గొడారిగుంట లక్ష్మి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎవరికీ ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. బాధితులను ఐద్వా జిల్లా నాయకులు సుభాషిణి పరామర్శించారు. బాధితుల కుటుంబ సభ్యులు ఆసుపత్రి వద్దకు పెద్దఎత్తున చేరుకున్నారు. బాధితులకు వైద్యం సరిగా అందించడంలేదని విమర్శించారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళా కార్మికురాలు

టెట్‌లో ప్రశ్నలు మాయం !

- అభ్యర్థుల టెన్షన్
- ప్రభుత్వం స్పందించాలని వినతి

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) రాసిన కొందరు విద్యార్థులు టెన్షన్ పడుతున్నారు. ఎస్‌జిటి, స్కూల్ అసిస్టెంట్, లాంగ్వేజ్ పండిట్ పరీక్షలను ప్రభుత్వం గత నెల 21 నుంచి మార్చి 2 వరకు నిర్వహించింది. ఇందులో సాంకేతిక లోపాలు జరిగినట్లు విద్యార్థులు చెబుతున్నారు. అక్కడే ఇన్విజలేటర్లకు సమస్య చెప్పినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందనా రాలేదని తెలుస్తోంది. తమకు జరిగిన అన్యాయానికి న్యాయం చేయాలని, లేదంటే నష్టపోతామని ఆందోళన చెందుతున్నారు.

గత నెల 24న ఉదయం జరిగిన ఎస్‌జిటి పరీక్షలో ఐదు ప్రశ్నలు కనిపించలేదని అభ్యర్థులు చెబుతున్నారు. కడప, కర్నూలు, శ్రీకాకుళం, గుంటూరు, ఒంగోలు కేంద్రాల్లో ఇంజినీరింగ్ కళాశాలల్లో పరీక్షలు నిర్వహించారు. పరీక్ష రాసే క్రమంలో కొన్ని కేంద్రాల్లో ఐదు ప్రశ్నలు డిస్‌ప్లే కాలేదని అనేక మంది అభ్యర్థులు 'ప్రజాశక్తి'కి తెలిపారు. అప్పుడే స్థానికంగా ఇన్విజిలేటర్లకు ప్రశ్నలు కనిపించని విషయం తెలిపామని, అక్కడే లేఖ రాసిచ్చామని చెప్పారు. నెల్లూరు జిల్లా హసనాపురం ప్రాంతానికి చెందిన వంకదారి జనార్దన్‌రావు (హాల్ టికెట్ నం.1710714319056) చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాల గుంటూరులో పరీక్ష రాశారు. ఇదే కళాశాలలో అనేక మంది అభ్యర్థులకు ఐదు ప్రశ్నలు కనిపించలేదని చెప్పారు. కె.వెంకటేష్ (హాల్ టికెట్ నం.1710114302944) ఆదిత్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాల టెక్కలి శ్రీకాకుళంలో ఇదే పరిస్థితి ఏర్పడింది. ఎ.మల్లి (హాల్ టికెట్ నం.1710714320679) కల్లాం హరనాధ్‌రెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌హెచ్-4 గుంటూరు కేంద్రంలోనూ ఇలాంటి పరిస్థితే నెలకొంది.



రాష్ట్ర వ్యాప్తంగా అనేక కేంద్రాల్లో ఇలాంటి పరిస్థితులు నెలకొన్నాయి. స్థానికంగా అధికారులకు తెలియజేసినా అభ్యర్థులకు ఎలాంటి న్యాయమూ జరగలేదు.

మాకు న్యాయం చేయండి



టెట్ పరీక్షలో ఎస్‌జిటి పేపర్-1 గత నెల 24 ఉదయం జరిగిన పరీక్షల్లో రాష్ట్ర వ్యాప్తంగా అనేక చోట్ల ఐదు ప్రశ్నలు కనిపించలేదు. చివరిలో ఈ విషయం తెలిసింది. ఈ విషయాన్ని స్థానికంగా ఇన్విజిలేటర్లకు తెలియజేశామని 'ప్రజాశక్తి'కి తెలిపారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో ఇలాంటి పరిస్థితులున్నాయి. అనేక మంది అభ్యర్థులు ఇబ్బంది పడ్డారు. ప్రభుత్వం పరిశీలించి మాకు న్యాయం చేయాలి. ప్రభుత్వం ఇప్పటికే కీ విడుదల చేసింది. రేపు ఫలితాలు వచ్చినా తమకు న్యాయం జరగకపోతే ఆత్మహత్యలే శరణ్యం. విద్యాశాఖ మంత్రి జోక్యం చేసుకుని మా భవిష్యత్తును కాపాడాలి.

- టెట్ అభ్యర్థి జనార్దన్‌రావు

పే స్కేల్ బకాయిలో 20 శాతం చెల్లింపు

ఎన్‌ఎంయు సమ్మె నోటీస్ ఉపసంహరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్టీసి కార్మికులకు బకాయి ఉన్న పే స్కేల్‌లో 20 శాతం ఇచ్చేందుకు యాజమాన్యం అంగీకరించింది. ఆర్టీసి గుర్తింపు సంఘమైన నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్‌ఎంయు)తో రవాణా శాఖ మంత్రి అచ్చెన్నాయుడుతోపాటు ఆర్టీసి ఎండి ఎం మాలకొండయ్య సోమవారం చర్చలు జరిపారు. బకాయి ఉన్న పే స్కేల్‌లో 20 శాతాన్ని జూన్ 10న ఇవ్వడానికి అంగీకరించారు. సిబ్బందికి రావాల్సిన నూతన పే స్కేల్ సవరణ అమలుకు ఆదేశాలివ్వడానికి సమావేశంలో ఆమోదం తెలిపారు. సమైక్యాంధ్ర ఉద్యమ కాలంలోని అరవై రోజుల సమ్మె కాలాన్ని ప్రత్యేక సెలవుగా ప్రకటించాలని నిర్ణయించారు. ఈ నెల 12న ఇవ్వనున్న సమ్మె నోటీసును ఉపసంహరించుకున్నట్లు ఎన్‌ఎంయు నేతలు తెలిపారు. అనంతరం ఆర్టీసి రికార్డ్ రూమ్‌ను మంత్రి పరిశీలించారు. తమ సమస్యల పరిష్కారానికి కృషి చేసిన మంత్రికి ఎన్‌ఎంయు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

ఒంటెద్దుపోకడల వల్ల నష్టం

గుర్తింపు సంఘం ఒంటెద్దు పోకడల వల్ల కార్మికులకు నష్టం చేకూరే ప్రమాదముందని ఆర్టీసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు ఎస్‌కె జిలానీ బాషా, ప్రధాన కార్యదర్శి సిహెచ్ సుందరయ్య, ప్రచార కార్యదర్శి ఎం అయపరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్మికుల సంక్షేమం కోసం అన్ని సంఘాలు ఐక్యంగా పోరాడాలని పేర్కొన్నారు. చర్చల ద్వారానే వేతన ఒప్పందాన్ని సాధించుకోగలమని తెలిపారు.



ఎపికి ప్రత్యేక హోదా కల్పించాలని ప్లకార్డులతో వైఎస్ జగన్ నిరసన

హోదా కోసం ప్లకార్డులతో జగన్ నిరసన

1400 కిలోమీటర్లు పూర్తయిన యాత్ర

ప్రజాశక్తి-పంగులూరు(ప్రకాశం)

రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వైఎస్ఆర్‌సిపి అధినేత వైఎస్ జగన్మోహనరెడ్డి ప్రకాశం జిల్లా అలవలపాడులో సోమవారం ప్లకార్డులు చేపట్టి నిరసన తెలిపారు. వైసిపికి చెందిన జూనియర్ డాక్టర్లు ఆ పార్టీ కండువాలు కప్పుకొని జగన్‌ను కలిశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించాలని వారితో పాటు ప్లకార్డులు చేతపట్టి జగన్ కొంతసేపు నడిచారు. ప్రజా సంకల్ప యాత్ర ప్రకాశం జిల్లా నాగులపాడు వద్ద 1400 కిలోమీటర్లకు చేరింది. అక్కడ వైసిపి కార్యకర్తలు పూలతో స్వాగతం పలికారు. యాత్ర మొత్తం పంగులూరు మండలంలో సాగింది. అలవలపాడు సమీపంలోని ఇటుక బట్టీల వద్దకు రాగానే కార్మికులు జగన్‌ను కలసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఏళ్ల తరబడి ఇటుక బట్టీలలో పనిచేస్తున్నా తమ కూలి పెంచడం లేదని, పెరిగిన ధరలకనుగుణంగా యజమానులు ఇస్తున్న కూలి డబ్బులు చాలడం లేదని తెలిపారు. మధ్యాహ్నం ఎర్రం చినపోలిరెడ్డి ఎత్తిపోతల పథకం నిర్వాసితులు జగన్‌ను కలిశారు. ప్రాజెక్టు కింద ఉన్న నిర్వాసితులందరికీ నష్టపరిహారం అందజేయనందున తాము ఇళ్లు ఖాళీ చేయలేకపోతున్నామని తెలిపారు. మార్గమధ్యలో పొగాకు, మిర్చి, ధరలపై రైతులతో మాట్లాడారు.

బడ్జెట్‌లో వెయ్యి కోట్లు కేటాయించాలి

ఎపి రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో వినూత్న నిరసన

ప్రజాశక్తి - కర్నూలు సిటీ

ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన రజకులకు 2018-19 రాష్ట్ర బడ్జెట్‌లో వెయ్యి కోట్లు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి సి.గురుశేఖర్ డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో రజకుల సంక్షేమానికి తగిన నిధులు కేటాయించాలని ఎపి రజకవృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌ను ముట్టడించారు. జిల్లా నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో వచ్చిన రజకులు కలెక్టరేట్ ఎదుట చాకిరేవుపెట్టి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. జిల్లా అధ్యక్షులు ఎం.నాగరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి గురుశేఖర్, వృత్తి సంఘాల కార్యదర్శి జెఎన్.శేషయ్య తదితరులు మాట్లాడారు. రాష్ట్రంలో రజకులు అత్యంత హీనంగా చూస్తున్నారని అన్నారు. అత్యాచారాలు, దౌర్జన్యాలు దాడులు సర్వసాధారణమైపోయాయని ఆందోళన చేశారు. రజకులపై దాడులను అరికట్టేందుకు ఎస్‌సి, ఎస్‌టి తరహాలో ఒక రక్షణ చట్టం తయారు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగంలోఉన్న పోలీస్, గురుకుల పాఠశాలలో దోబీ పోస్టులను రజకులకే కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రతి రజక సొసైటీలకు రూ.30 లక్షల రుణాలు ఇవ్వాలన్నారు.

చిత్తూరు జిల్లాలో దారుణం

పసికందు బలి

ప్రజాశక్తి-తిరుపతి ప్రతినిధి

గుప్తనిధుల కోసం గుర్తు తెలియని వ్యక్తులు ఎనిమిది నెలల పసికందును బలిచ్చారు. ఈ ఘటన చిత్తూరు జిల్లాలో ఆలస్యంగా వెలుగుచూసింది. స్థానికుల కథనం ప్రకారం.. పెనుమూరు మండలం కలవగుంట గ్రామ సమీపంలోని ఎన్‌టిఆర్ జలాశయం వద్ద గట్టుపై పసికందు మృతదేహం సమీపంలో పసుపు, కుంకుమ, నిమ్మకాయలు, కొత్తకుండలు పడి ఉన్నాయి. దీనిని గ్రామస్తులు గుర్తించారు. అలాగే పసికందు తల లేకుండా ఉండటంతో ఇది కచ్చితంగా గుప్త నిధుల కోసమే బలిచ్చుంటారని గ్రామస్తులు అంటున్నారు. ఈ ఘటన జరిగి మూడు రోజులు అవుతుండటంతో పసికందు మృతదేహం బాగా ఉబ్బిపోయి గుర్తు తెలియని స్థితిలో ఉంది. మొండెంతో పసికందు ఉండటంతో ఆ పసిపాప ఎవరన్నది గుర్తుపట్టలేకున్నారు. పెనుమూరు ఎస్ఐ ఛాన్‌బాషా, సిబ్బంది సంఘటనా స్థలం చేరుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ సభ్యులతో కలెక్టరేట్ల ముట్టడి

ఉధృతమైన విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమ్మె

ప్రజాశక్తి -యంత్రాంగం

సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, రెగ్యులరైజ్ చేయాలని తదితర సమస్యల పరిష్కారం కోరుతూ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారానికి 14 రోజుకు చేరింది. ఆయా జిల్లా కలెక్టరేట్లను కుటుంబసభ్యులతో ముట్టడించారు. మండుటెండను లెక్క చేయకుండా పిల్లలు నిరసన తెలిపారు. వేతనాలు పెంచి మమ్మల్ని, మా కుటుంబాలను ఆదుకోవాలని కాంట్రాక్టు కార్మికుల పిల్లలు కోరారు. ఇప్పటికైనా మాపై దయచూపండి చంద్రబాబు తాతయ్యా అంటూ ఆ పిల్లలు ప్లకార్డులతో కలెక్టరేట్ల ఎదుట మండుటెండలో నిలబడి వేడుకోవడం అందరిని కలచివేసింది. గుంటూరు జిల్లా కలెక్టరేట్‌ను కుటుంబ సభ్యులతో కలిసి ముట్టడించారు. మహిళలు తమసమస్యలను ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రశ్నించారు. జిల్లా వ్యాప్తంగా 700 మందికి పైగా కార్మికులు వారి కుటుంబ సభ్యులు కలెక్టరేట్ ముట్టడిలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఆర్‌వి నరసింహారావు మాట్లాడారు. విజయవాడ ధర్నా చౌక్ వద్ద విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమ్మెకు సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఏ గఫూర్ దీక్షలో పాల్గొని మద్దతు తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు సిహెచ్ బాబూరావు, వై.వెంకటేశ్వరరావు, ఎఐటియుసి రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఓబులేసు సంఘీభావం తెలిపారు. శ్రీకాకుళం జిల్లా పాతపట్నం మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ వద్ద వంటావార్పు కార్యక్రమం చేపట్టారు. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో కదంతొక్కారు. కలెక్టరేట్ నుంచి జెడ్‌పి, ఫైర్‌స్టేషన్ సెంటర్ మీదుగా ఆర్‌ఆర్ పేటలోని ఎపిఇపిడిసిఎల్ ఎస్‌ఇ కార్యాలయానికి ప్రదర్శనగా చేరుకున్నారు. హెచ్చరించారు. భీమవరంలో విద్యుత్‌శాఖ సిఎమ్‌డి దిష్టిబొమ్మను శవయాత్ర చేసి దహనం చేశారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ కలెక్టరేట్ ఎదుట కార్మికులు చేపట్టిన నిరవధిక దీక్ష రెండో రోజుకు చేరింది. ఒంగోలులో విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమ్మె 14వ రోజూ ఉధృతంగా సాగింది.

విద్యుత్ జెఎసితోపాటు సిఐటియు, ఎఐటియుసి, ఇతర కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఒంగోలులో విద్యుత్ భవన్ నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన చేశారు. మధ్యాహ్నం వరకు కలెక్టరేట్‌ను ముట్టడించి ఆందోళన చేపట్టారు. అనంతరం నిరవధిక దీక్షలను కొనసాగించారు. విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు తమ భార్యా పిల్లలతో కలసి కడప కలెక్టరేట్ ఎదుట బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. గంట పాటు ఎండను సైతం లెక్కచేకుండా బైటాయించి ప్రభుత్వానికి, విద్యుత్ యాజామాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ నెల 7న విద్యుత్ సౌదా ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తాతయ్యా మానాన్నకు వేతనం పెంచండి. సమాన పనికి సమాన వేతనాలు చెల్లించండి. అప్పుడు మమ్మల్ని మా నాన్న బాగా చదివిస్తాడని చిత్తూరు కలెక్టరేట్ ఎదుట మండుటెండలో విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల పిల్లలు ప్లకార్డులు చేత పట్టుకొని వేడుకుంటూ నిరసన తెలిపారు.



గుంటూరు జిల్లా కలెక్టరేట్ వద్ద మండుటెండలో ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలుపుతున్న చిన్నారులు

సంపాదకీయం

త్రిపుర ఫలితాలు

ఈశాన్య ఎన్నికల ఫలితాలు దేశంలో బిజెపి మతతత్వ ప్రమాదాన్ని మరింత పెంచాయి. ముఖ్యంగా త్రిపురలో పాతికేళ్లు సుపరిపాలనను అందించిన సిపిఐ(ఎం) ఓడిపోవడం ప్రత్యామ్నాయ రాజకీయ శక్తులకు ఎదురుదెబ్బ. వామపక్ష ప్రభుత్వ పరిపాలనలో అవినీతి మచ్చలేని ముఖ్యమంత్రి, మంత్రివర్గం... అధికార దర్పానికి దూరంగా ప్రజలకోసం అహర్నిశలు పనిచేసిన ప్రభుత్వం... అయినా ఎన్నికల్లో సిపిఐ(ఎం) ఎందుకు ఓడిపోయిందన్న ప్రశ్న అభివృద్ధి కాముకులందినీ కలచి వేస్తోంది. దీనికి అంతర్గత బాహ్య కారణాలు రెంటినీ పరిశీలించాల్సి ఉంది. సిపిఎంకు యువతరం ఓట్లు తక్కువగా వచ్చిన వైనాన్ని పరిశీలిస్తే 25 ఏళ్లు అధికారంలో ఉన్నాక కొత్త తరంలో ప్రభుత్వంపై కొంత అసంతృప్తి వచ్చినట్లు కనిపిస్తోంది. ఈ కాలంలో మాణిక్ సర్కార్ ప్రభుత్వం గిరిజనుల్లో పెద్ద ఎత్తున చేపట్టిన విద్యావాప్తి కార్యక్రమం వల్ల ఉన్నత విద్యకు ఎదిగిన గిరిజన యువత సంఖ్య పెరిగింది. కానీ రాష్ట్రంలో దానికి తగ్గట్టు ఉపాధి అవకాశాలు పెరగలేదు. విద్యావంతులందరికీ ఉద్యోగ కల్పన త్రిపుర లాంటి చిన్న రాష్ట్రానికి, అందునా ఈ వ్యవస్థ పరిధిలో కేంద్ర సహకారం లేకుండా అంత సులభం కాదు. పైగా కేంద్రంలోని నరేంద్ర మోడీ సర్కారు త్రిపురకు నిధులివ్వకుండా, పరిశ్రమలు పెట్టకుండా సహాయ నిరాకరణ చేసింది. సర్వశిక్షా అభియాన్ కింద 10,000 మంది ఉపాధ్యాయులు రెగ్యులర్ కాకుండా ఉద్యోగాలు కోల్పోయారు. ఉపాధి హామీ పథకం నిధులపై కేంద్రం కోత విధించింది. ఫలితంగా యువతలో ముఖ్యంగా గిరిజన యువతలో అసంతృప్తి వచ్చింది. దాన్ని వేర్పాటు వాద ఐపిటిఎఫ్ రెచ్చగొట్టి రాజకీయంగా సొమ్ము చేసుకుంది. ఈ సంస్థకు విదేశీ వేర్పాటువాద, ఉగ్రవాద సంస్థలతో సంబంధాలున్నాయి. ఇటువంటి సంస్థతో దేశభక్తిని గురించి నిత్యం ఇల్లెక్కి కూసే బిజెపి పొత్తుపెట్టుకుంది. గత పాతికేళ్లలో మరో ప్రభుత్వాన్ని గురించిన అనుభవం లేని యువతరం మార్పును కోరుకోవడం వల్ల కొంతవరకు వామపక్షాలకు వ్యతిరేకంగా ఓట్లు వేసినట్లు కనిపిస్తోంది.

దీనికితోడు ఆర్ఎస్ఎస్ ప్రచార రథాలను, బిజెపి డబ్బు సంచులను పెద్ద ఎత్తున ఎన్నికల్లో దించాయి. ఢిల్లీ అగ్రనేతలంతా గత మూడు నాలుగేళ్లుగా వామపక్ష ప్రభుత్వాన్ని పడగొట్టడమే లక్ష్యంగా పావులు కదుపుతూ వచ్చారు. కాషాయ నేతలు గెలుపు కోసం అన్ని రకాల అనైతిక పద్ధతులకూ పాల్పడ్డారు. గడిచిన మూడేళ్లుగా పోలింగ్ కేంద్రాల స్థాయిలో ఓటరు జాబితాలోని ప్రతి 60 మందికి ఒక ఒక కాషాయ కార్యకర్తను నియమించి క్షేత్రస్థాయిలో మత ప్రాతిపదికన ఓటర్లను చీల్చడానికి ప్రయత్నించారు. కేంద్ర యంత్రాంగమంతా పదే పదే త్రిపురలో పర్యటిస్తూ తమ అవకాశవాద రాజకీయాలకు పాదులువేస్తూ వచ్చింది. ఈ మూడేళ్లలో 52మంది మంత్రులు త్రిపురలోనే తిరుగాడారు. ఎన్నికల సందర్భంగా 25మంది కేంద్రమంత్రులు, వందమంది ఎంపీలు, ఎమ్మెల్యేలు త్రిపురలో తిష్టవేశారు. ప్రధాని మోడీ నుండి అధ్యక్షుడు అమిత్‌షా వరకూ పార్టీ, ప్రభుత్వ నేతలందరూ ఇంత చిన్న రాష్ట్రంలో అన్ని సభలు నిర్వహించడం అనూహ్యం.

అయినా ఈ ఎన్నికల్లో సిపిఎంకు తగ్గిన ఓట్లు అయిదు శాతం మాత్రమే. బిజెపికి 43 శాతం ఓట్లు పోలవగా, సిపిఎంకు 42.7 శాతం ఓట్లు వచ్చాయి. వేర్పాటువాద పార్టీతో పొత్తు బిజెపికి తోడయింది. అయినా గత ఎన్నికల్లో కేవలం రెండు శాతంగా ఉన్న బిజెపి ఓట్లు నేడు ఇంతగా పెరగడానికి ప్రధాన కారణం ఆ రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీని అది మింగేయడమే. గతంలో 34 శాతం ఉన్న కాంగ్రెస్ ఓట్లు ఈ ఎన్నికల్లో బిజెపికి జమ అయ్యాయి. మొత్తం మీద చూసినప్పుడు అటు యువతరంలో ఉపాధి కొరత వల్ల వచ్చిన అసంతృప్తి, ఇటు కేంద్రంలో అధికార బలం కలిగిన కాషాయ పరివారపు కుయుక్తులు... త్రిపురలో వామపక్ష ప్రభుత్వ ఓటమికి కారణమయ్యాయి.

ఎన్నికల్లో గెలిచన వెంటనే బిజెపి-ఆర్ఎస్ఎస్ శక్తులు మార్క్సిస్టు పార్టీపై చేస్తున్న దాడులు, విధ్వంసం ఆందోళన కలిగిస్తున్నాయి. అనేక చోట్ల పార్టీ కార్యాయాలను కార్యకర్తల ఇళ్లను తగలబెడుతున్నట్లూ, పార్టీ క్యాడర్‌పై దాడులకు తెగబడుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. గతంలో బెంగాల్‌లో గెలిచిన మదంతో తృణమూల్ కాంగ్రెస్ కూడా ఇదే విధంగా దాడులకు తెగబడి వందలాది మంది పార్టీ కార్యకర్తలను హత్యలు చేసింది. ఇళ్లు, పార్టీ ఆఫీసులు తగుల బెట్టింది. ఇప్పటికీ అక్కడ పార్టీ దమన కాండను ఎదుర్కొంటున్నది. అదే విధమైన దాడులు నేడు త్రిపురలోనూ సాగుతుండడం ఆందోళనకరమైన విషయం. ఈ దాడులను దేశంలోని ప్రజాతంత్ర శక్తులు ముక్త కంఠంతో ఖండించాలి. నిన్న బెంగాల్‌లో, నేడు త్రిపురలో సిపిఎంపైనా, ప్రజల ప్రజాతంత్ర హక్కులపైనా జరుగుతున్న ఈ ఫాసిస్టు తరహా దాడులను అభ్యుదయ శక్తులు ఆపకపోతే అవి రేపు దేశమంతా విస్తరించే ప్రమాదం ఉంది.

ఇది విషయం



రాముడక్కడే పుట్టాడట
'శ్రీ శ్రీ' అది చూశాడట...
'బాబ్రీ'ని వదలకుంటే
సిరియా లా అల్లర్లట!

దేశంలో చాందసం
వైరస్ లా పెరుగుతోంది...
సన్యాసులను ఆపకుంటే
ఉన్మాదం ప్రబలుతుంది!

- కొల్లూరు వెంకట్

సీపీఐ(ఎం) రాజకీయ ఎత్తుగడల విధానం

తక్షణ - వ్యూహాత్మక అవసరాల అనుసంధానం

విశ్లేషణ



బి వి రాఘవులు

హైదరాబాద్‌లో జరుగనున్న సీపీఐ(ఎం) 22వ కాంగ్రెస్ చర్చ కోసం ముసాయిదా రాజకీయ తీర్మానాన్ని కేంద్రకమిటీ ఆమోదించి విడుదల చేసింది. వచ్చే మహాసభ వరకు పార్టీకి మార్గదర్శకంగా వుండేది కాబట్టి సహజంగానే మిత్రులకు, ప్రత్యర్థులకు తీర్మానం యొక్క మార్గ నిర్దేశంపై ఆసక్తి వుంటుంది. గతంలో మాదిరిగానే ఇప్పుడు కూడా తీర్మానంపై మీడియాలో రకరకాల వ్యాఖ్యానాలు వెలువడుతున్నాయి. అయితే వీటిలో కమ్యూనిస్టు పార్టీకి రాజకీయ తీర్మానం యొక్క అవసరం ఏమిటో తెలియక గానీ, తెలిసినా బుద్ధిపూర్వకంగా వక్రీకరించాలని గానీ, లేక తమ రాజకీయ ప్రయోజనాలకనుగుణంగా లేదన్న దుగ్ధతో గానీ చేసేవి ఎక్కువగా ఉన్నాయి. ఈ వ్యాఖ్యానాల మంచి చెడులను అర్థం చేసుకోవాలంటే రెండు విషయాలను గమనంలో ఉంచుకోవాలి. ఒకటి రాజకీయ విధానం యొక్క లక్ష్యం, రెండు మార్క్సిస్టు పార్టీ గతంలో అనుసరించిన రాజకీయ ఎత్తుగడల విధానాన్ని సమీక్షించి 21వ పార్టీ మహాసభ పొందుపరిచిన నిర్ధారణలు.

ఈ రెండు అంశాల గురించి ముందుగా క్లుప్తంగా ప్రస్తావిస్తాను.

రాజకీయ ఎత్తుగడల విధాన లక్ష్యం

వ్యూహాత్మక కర్తవ్యం వైపు పురోగమించేందుకు అనుసరించే తక్షణ ఎత్తుగడలనే రాజకీయ ఎత్తుగడల విధానం అంటాము. అంటే రాజకీయ ఎత్తుగడల విధానం ఎన్నికలు తదితర తక్షణ అవసరాలను తీర్చడంతో పాటు, పార్టీ స్వతంత్ర శక్తిని, వామపక్ష ప్రజాతంత్ర శక్తుల ఐక్యతను బలపర్చడానికి తోడ్పడాలి. తక్షణ అవసరాలకు మాత్రమే ప్రాధాన్యతనిచ్చి రెండవ అంశాన్ని అశ్రద్ధ చేస్తే మొదటి అంశాన్ని సాధించే శక్తి కూడా పార్టీకి తగ్గిపోతుంది.

రాజకీయ ఎత్తుగడల విధానాల అనుభవాలు

విశాఖలో జరిగిన 21వ మహాసభ గత 25 సంవత్సరాలలో వివిధ మహాసభలలో రూపొందించి అమలు చేసిన రాజకీయ ఎత్తుగడల విధానాన్ని సమీక్షించింది. తక్షణ పరిస్థితులలో జోక్యం చేసుకునేందుకు, తక్షణ ప్రమాదాన్ని ఎదుర్కొనేందుకు అవసరమైన ఎత్తుగడలను, మానోవర్స్‌ను రూపొందించుకునేందుకు ఉపయోగపడినా, రాజకీయ ఎత్తుగడల విధానంలోని లోపాలు పార్టీ స్వతంత్ర శక్తి పెరగకపోవడానికి, వామపక్ష ప్రజాతంత్ర సంఘటన నిర్మాణంలో పురోగమనం లేకపోవడానికి కారణమయ్యాయని నిర్ధారించింది. అన్ని మహాసభల రాజకీయ ఎత్తుగడల విధానాలు పార్టీ స్వతంత్ర శక్తిని పెంచుకోవాలని నిర్దేశిస్తున్నప్పటికీ, ఈ విషయంలో మనం పురోగమనం సాధించలేకపోయాం. ఓటింగ్ రూపంలో అయితే బలహీనపడ్డాం. అసమానాభివృద్ధి కొనసాగుతూనే ఉంది.

పార్టీ నిర్ణయించుకున్న తక్షణ రాజకీయ ఎన్నికల కర్తవ్యాన్ని సాధించే పనిలో మునిగిపోయి, రాజకీయ ఎత్తుగడల విధానంలోని మిగిలిన కీలక కర్తవ్యాలను తగినంతగా పట్టించుకోలేకపోయాం. సరళీకరణ విధానాల మూలంగా నష్టపోతున్న వివిధ తరగతుల ప్రజానీకాన్ని నిరంతర పోరాటాలలోకి సమీకరించి, ఐక్య ఉద్యమాలను బలంగా నిర్మించలేక పోయాం. మతోన్మాదంపై క్షేత్ర స్థాయి నుండి ఒక సమగ్ర రూపంలో పోరాటం చేయలేకపోయాం.

ఈ లోపాలు పునరావృతం కాకుండా రాజకీయ ఎత్తుగడల విధానంలో ఉండాల్సిన కీలక అంశాల గురించి విశాఖ రాజకీయ ఎత్తుగడల సమీక్ష పేర్కొన్న విషయాలను కింది విధంగా క్రోడీకరించవచ్చు.

సరైన రాజకీయ ఎత్తుగడల విధానంలో కీలక అంశాలు ఏంటి?

సరళీకరణ విధానాలపై పోరాటం

రాజకీయ ఎత్తుగడల విధానం సరళీకరణ విధానాల పట్ల మెతకగా వ్యవహరించేందుకు గాని, ప్రాధాన్యతను తగ్గించేందుకు గాని అవకాశమిచ్చేదిగా ఉండరాదు. సరళీకరణ విధానాలపై పోరాటాన్ని ఉధృతం చేసేందుకు తోడ్పడేదిగా ఉండాలి. సరళీకరణ విధానాల మూలంగా ప్రజలపై మోపబడుతున్న పెనుభారాలకు వ్యతిరేకంగా, కాలరాయబడుతున్న హక్కులను రక్షించుకోవడానికి, దిగజారుతున్న జీవన ప్రమాణాలను నిలబెట్టుకోవడానికి, పోరాటాలను ముమ్మరంగా నిర్వహించటం ద్వారా ప్రజలను ఐక్యం చేయగలగాలి. అప్పుడే ప్రజల్లో పెరిగిన అభద్రతను, చీలికలను, అనైక్యతను అధిగమించి ఆత్మవిశ్వాసాన్ని పెంచగలము. అన్నిరకాల విభజనలు, అస్తిత్వాలకు అతీతంగా వర్గ ఐక్యతను సాధించగలం.



> సరళీకరణ విధానాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటానికి, మతోన్మాదానికి వ్యతిరేకంగా జరిగే పోరాటాలకు అవినాభావ సంబంధం ఉంది. సరళీకరణ విధానాలపై పోరాటాన్ని అశ్రద్ధ చేసే ఏ రాజకీయ ఎత్తుగడలైనా మతోన్మాద వ్యతిరేక పోరాటాన్ని కూడా బలహీనం చేస్తాయి. సరళీకరణ విధానాల దుష్ప్రభావంపై పోరాటాలను, మతోన్మాద ఎజెండాకు వ్యతిరేకంగా జరిగే పోరాటాలను మిళితం చేసి సాగించడం ద్వారానే బీజేపీ, ఆర్ఎస్ఎస్ కూటమిపై జరిగే పోరాటాన్ని ముందుకు తీసుకెళ్ళగలం.

సరళీకరణ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాన్ని ముమ్మరం చేయకుండా వామపక్ష ప్రజాతంత్ర శక్తుల సమీకరణ సాధ్యం కాదు. పార్టీ స్వతంత్ర శక్తి కూడా పెరగదు. వాస్తవంలో ప్రజా ఉద్యమాలు బలహీనపడతాయి.

సరళీకరణ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాన్ని ముమ్మరం చేయకపోతే ఆ విధానాల వల్ల పెరుగుతున్న అసంతృప్తిని మెజారిటీ, మైనారిటీ మతోన్మాద శక్తులు వినియోగించుకుని చీలికలు సృష్టించి పాలకవర్గాల కొమ్ముకాస్తాయి. ఎక్కడ సరళీకరణ విధానాలపై జరగాల్సిన పోరాటాన్ని అశ్రద్ధ చేస్తే అక్కడ అభివృద్ధి నిరోధక శక్తులు బలం పుంజుకుంటాయనేది అంతర్జాతీయ అనుభవం, మన అనుభవం కూడా. మన దేశంలో సరళీకరణ విధానాల కాలంలో మతోన్మాదం కూడా పెరుగుతూ వచ్చింది. హిందూత్వ మతోన్మాద ప్రతినిధి అయిన బీజేపీ కేంద్రంలో అధికారంలోకి కూడా వచ్చింది.

దేశంలో బూర్జువా, భూస్వామ్య పార్టీలన్నీ దాదాపు సరళీకరణ విధానాలను ఆమోదించి అనుసరిస్తున్నాయి. కేంద్రంలో వరుసగా అధికారం లోకి వచ్చిన ప్రభుత్వాలు సరళీకరణ విధానాలను అనుసరించాయి. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు బడా బూర్జువా పార్టీలుగా వాటిని ఛాంపియన్ చేస్తున్నాయి. ప్రాంతీయ బూర్జువా పార్టీలు సైతం సరళీకరణ విధానాలకు సానుకూలంగా వున్నాయి. ఈ పార్టీలు అనుసరించే సరళీకరణ విధానాల పట్ల మతోన్మాదాన్ని వ్యతిరేకించడం పేరుతో మెతకగా వ్యవహరించినా, అది మతోన్మాదులను దెబ్బతీయడానికి తోడ్పడకపోగా, బలపడటానికి అవకాశం ఇచ్చినట్లవుతుంది.

గతంలో ఎక్కువ సందర్భాలలో మతోన్మాదంపై పోరాటం పేరుతో, ఎన్నికల ఎత్తుగడల పేరుతో సరళీకరణ విధానాల ప్రమాదానికి మనం తక్కువ ప్రాధాన్యతనిచ్చాము. సరళీకరణ విధానాలకు వ్యతిరేకంగా ప్రధానంగా పోరాటం చేయాల్సిన కర్తవ్యాన్ని, మతోన్మాదంపై పోరాటానికి లోబర్చుతూ వచ్చాము.

అందుకే మతోన్మాద వ్యతిరేక పోరాటంలో సరళీకరణ విధాన వ్యతిరేక పోరాటానికున్న ప్రాధాన్యతను, ఎన్నికల ఎత్తుగడలకు లోబర్చకుండా, ఎటువంటి మెతకదనానికి ఆస్కారం లేకుండా ముసాయిదా రాజకీయ తీర్మానం ప్రతిపాదించింది.

మతోన్మాదంపై పోరాటం

బీజేపీ, సంఘ్‌పరివార్ శక్తులకు వ్యతిరేకంగా చేయాల్సిన పోరాటాన్ని ఎన్నికల ఎత్తుగడలకు పరిమితం చేయకుండా ఒక సమగ్రమైన నిరంతర ప్రయత్నంగా సాగించాలి.

ఎన్నికల ఎత్తుగడలు, మానోవర్స్ ద్వారా మతోన్మాద శక్తులను తాత్కాలికంగా అధికారానికి దూరంగా పెట్టగల్గినా, దాన్ని బలహీనం చేయడానికి సరిపోలేదని అనుభవం చెబుతున్నది. బీజేపీ మతోన్మాద శక్తులను ఓడించడానికి, బలహీనపర్చడానికి పార్టీ రాజకీయ ఎత్తుగడల విధానం లక్ష్యంగా కృషి చేస్తున్నా, ఈ శక్తులు బలం పుంజుకోవడాన్ని నిరోధించలేక పోయింది. బీజేపీ కొన్నిసార్లు తాత్కాలికంగా ఓడిపోయినా తిరిగి అంతకన్నా ఎక్కువగా బలపడి ఎన్నికల్లో విజయం సాధిస్తూ వచ్చింది. మొదట 13 రోజులున్నా తర్వాత 13 నెలలు, ఆ తర్వాత పూర్తికాలం సంకీర్ణ ప్రభుత్వాలను నడిపింది. ఇప్పుడు ఏకంగా సంపూర్ణ మెజారిటీని సాధించి కేంద్రంలో అధికారంపై పట్టు పెంచుకుంది. హిందూత్వ మతోన్మాదాన్ని ఓడించడానికి, బలహీనం చేయడానికి ఎన్నికలలో ఓడించాలనే ప్రయత్నాలు సరిపోవనీ, ఒక సమగ్రమైన ప్రయత్నం కావాలని ఈ అనుభవం స్పష్టం చేస్తున్నది.

సరళీకరణ విధానాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటానికి, మతోన్మాదానికి వ్యతిరేకంగా జరిగే పోరాటాలకు అవినాభావ సంబంధం ఉంది. సరళీకరణ విధానాలపై పోరాటాన్ని అశ్రద్ధ చేసే ఏ రాజకీయ ఎత్తుగడలైనా మతోన్మాద వ్యతిరేక పోరాటాన్ని కూడా బలహీనం చేస్తాయి. సరళీకరణ విధానాల దుష్ప్రభావంపై పోరాటాలను, మతోన్మాద ఎజెండాకు వ్యతిరేకంగా జరిగే పోరాటాలను మిళితం చేసి సాగించడం ద్వారానే బీజేపీ, ఆర్ఎస్ఎస్ కూటమిపై జరిగే పోరాటాన్ని ముందుకు తీసుకెళ్ళగలం.

వామపక్ష ప్రజాతంత్ర శక్తుల బలం, క్రియాశీలతపై కూడా మతోన్మాదంపై పోరాట ఫలితం ఆధారపడి వుంటుంది. ఎందుకంటే ఈ శక్తులే మతోన్మాదంపై నికరంగా పోరాడేవి. మన రాజకీయ ఎత్తుగడలు పార్టీ స్వతంత్ర శక్తిని, వామపక్ష శక్తుల బలాన్ని పెంచేందుకు తోడ్పడకపోతే, తాత్కాలికంగా ఎన్నికల్లో మతోన్మాద శక్తులకు ఎదురుదెబ్బ తగిలినా, మతోన్మాదాన్ని శాశ్వతంగా బలహీనం చేయడంలో వెనకబడిపోతాము.

సరళీకరణ విధానంపై పోరాటాన్ని గాని, వామపక్ష ప్రజాతంత్ర సంఘటన నిర్మాణాన్ని గాని నిర్లక్ష్యం చేసే ఎత్తుగడలు మతోన్మాదంపై పోరాటాన్ని కూడా బలహీనపరుస్తాయి.

కుల వ్యవస్థ, పితృస్వామిక వ్యవస్థల్లో హిందూత్వ సిద్ధాంతం పాతుకుపోయి ఉంది. దోపిడీ, అణచివేతలను కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తుంది. హిందూత్వం పేరుతో, సాంస్కృతిక జాతీయవాదం పేరుతో తిరోగమన, సంకుచిత, దురభిమాన భావజాలాన్ని ప్రచారం చేస్తోంది. కులవ్యవస్థ, పితృస్వామిక ధోరణులకు వ్యతిరేకంగా జరిగే సామాజిక పోరాటాలు, హేతువాద ఉద్యమాలు హిందూత్వ మతోన్మాద వ్యతిరేక పోరాటంలో ఒక ముఖ్యమైన అంతర్భాగం.

హిందూత్వ మతోన్మాదులు మొత్తం సమాజంలోని అన్ని పార్శ్వాల్లోకి ప్రజాజీవన రంగాలన్నింటిలోకి రకరకాల మార్గాలు, కార్యకలాపాలు, సంస్థల ద్వారా చొచ్చుకుపోయే ప్రయత్నం చేస్తున్నారు. సాంస్కృతిక, సేవ, విద్యా రంగాలను వాడుకుంటున్నారు. మత విద్వేషాలను, చీలికలను రెచ్చగొడుతున్నారు. మతతత్వాన్ని ఒక కామన్‌సెన్స్‌గా చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఇందుకు పౌర సమాజంలోని అన్ని రంగాలలో మనం జోక్యం చేసుకోకుండా మతోన్మాదాన్ని బలహీనం చేయడం సాధ్యం కాదు.

ఈ పోరాటాలన్నింటినీ మేళవించినప్పుడే మతోన్మాదానికి వ్యతిరేకంగా ప్రజా మద్దతును కూడగట్టగలము.

వామపక్ష ప్రజాతంత్ర సంఘటన నిర్మాణం

రాజకీయ ఎత్తుగడల విధానం వర్గ శక్తుల బలాబలాల్లో సానుకూల మార్పు సాధించటానికి తోడ్పడాలి. పార్టీ స్వతంత్ర శక్తి పెరగడం, వామపక్ష ప్రజాతంత్ర శక్తుల సంఘటన నిర్మాణం పురోగమించడం ద్వారానే ఇది సాధ్యమవుతుంది. కానీ పార్టీ గతంలో అనుసరించిన రాజకీయ ఎత్తుగడల విధానంలోని లోపాల మూలంగా ఈ కర్తవ్యాలు నిర్లక్ష్యానికి గురయ్యాయి. వామపక్ష ప్రజాతంత్ర సంఘటన నిర్మాణం ఒక ప్రచార నినాదంగా మార్చి వేయబడిందని, తక్షణం ప్రయత్నం చేయాల్సిన కర్తవ్యంగా పరిగణించకుండా వదిలివేయబడిందని 21వ మహాసభ సమీక్ష వెల్లడించింది.

వామపక్ష ప్రజాతంత్ర శక్తులు బలహీనపడుతుండటం మూలంగా రాజకీయ ఎత్తుగడల విధానంలో భాగమైన తక్షణ ఎన్నికల కర్తవ్యాలను నెరవేర్చే శక్తి కూడా వామపక్షాలకు తగ్గిపోయే పరిస్థితి వచ్చింది. సరళీకరణ విధానాలపై, మతోన్మాదంపై నిరంకుశత్వం, సామ్రాజ్యవాదంపై పోరాడే పోరాట శక్తులకు ఆత్మవిశ్వాసం సన్నగిల్లుతుంది. తక్షణం ఈ పరిస్థితిని అధిగమించకపోతే పార్టీకే కాక దేశానికి కూడా నష్టం జరుగుతుంది. అందుకే వామపక్ష ప్రజాతంత్ర సంఘటన నిర్మాణం అనే కర్తవ్యాన్ని తక్షణ కర్తవ్యాల్లో ముఖ్యమైనదిగా పునరుద్ధరించాలని సమీక్ష నిర్దేశించింది. ఇటువంటి కృషికి ఆటంకమయ్యే బలహీనతలను రాజకీయ ఎత్తుగడల విధానంలో పునరావృతం కాకూడదని చెప్పింది.

అన్ని బూర్జువా పార్టీలు అనుసరిస్తున్న సరళీకరణ విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేయడం ద్వారానే బూర్జువా వర్గాల పరిపాలనకు ప్రత్యామ్నాయ కార్యక్రమాన్ని ప్రజల ముందుంచగలము.

పైన వివరించిన అనుభవాలను, గుణపాఠాలను దృష్టిలో ఉంచుకుని 21వ మహాసభ సరైన రాజకీయ విధానాన్ని రూపొందించినప్పటికీ పశ్చిమబెంగాల్‌లో పార్టీ రాష్ట్ర కమిటీ కాంగ్రెస్‌తో ఎన్నికల అవగాహనకు వచ్చింది. దానివలన పార్టీ ప్రయోజనం పొందకపోగా కాంగ్రెస్ లాభపడింది. కాంగ్రెస్‌తో అవగాహనకు రావడం పార్టీ అవగాహనకు అనుగుణంగా లేదని కేంద్ర కమిటీ నిర్ధారించింది.

(మిగతా భాగం రేపు)

జన వాక్యం

ముహూర్తాల వ్యాపారం

ఈ నెల 4 ,6 ,11 తేదీలలో వేలాది ముహూర్తాలున్నాయనీ అవి చాలా మంచివనీ ప్రచారం జరిగింది. దీంతో పురోహితులకు కొరత ఏర్పడింది. ఉన్న పురోహితులు చాలక తత్కాల్ ద్వారా ఏర్పాటు చేసుకుంటున్నారు. చివరకు చదువుకొనే పిల్లలను సైతం పెళ్ళి మంత్రాలు చదవటానికి పంపిస్తున్నారు. ఇటీవల యజ్ఞాలు, యాగాలు ముహూర్తాలు, పూర్వజన్మ, పునర్జన్మ వంటి మూఢ నమ్మకాలు ఎక్కువయ్యాయి. ప్రజల అమాయకత్వాన్ని, అజ్ఞానాన్ని ఆసరా చేసుకొని ఇటువంటి క్రతువులు జరిపిస్తున్నారు. అయినా వివాహాలలో చాలా మార్పులొచ్చాయి. మంత్ర తంత్రాలు లేకుండా దండల మార్పుతో పెళ్లి చేసుకోవచ్చు. స్పెషల్ మ్యారేజీ యాక్ట్ కింద, వివాహ వయసు వచ్చాక కులం, మతంతో పని లేదు. రెండు ఫోటోలు, నేటివిటీ ధ్రువీకరణ పత్రంతో రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి, ఇద్దరు సాక్షులతో రిజిస్టరు చేసుకోవచ్చు. 30 రోజుల తర్వాత పెళ్లి జరిగినట్లు సర్టిఫికెట్ ఇస్తారు. మొత్తం ఖర్చు రూ.25లతో అయిపోతుంది. సమాజం ఎంతో మార్పు చెందింది. పెళ్లి విషయంలో కూడా మార్పు రావాలి. అన్ని విషయాలలోనూ ఆధునికంగా ఆలోచించాలి. అదే మార్పుకు చిహ్నం.

నార్నె వెంకట సుబ్బయ్య,
ఏపి హేతువాద సంఘం.

వ్యాసాలు, ఉత్తరాలు రాయవల్సిన చిరునామా
editpageps@gmail.com

వాహన చట్ట సవరణ తిరోగమన చర్య

సందర్భం



ఆర్ లక్ష్మయ్య


రోడ్డు ప్రమాదాలలోను, ప్రమాద మరణాలలోను భారతదేశం ప్రపంచంలోనే మొదటి స్థానంలో ఉంది. ప్రతీ ఏటా ప్రమాద మరణాలు పెరుగుతున్నాయి. రోడ్డు ప్రమాదాలు, ప్రమాద మరణాలు తగ్గించడానికే మోటారు వాహనాల చట్ట సవరణ బిల్లును తీసుకు వచ్చినట్లు కేంద్రం ప్రజలను నమ్మిస్తున్నది. మన దేశంలో అతి తక్కువ ప్రమాద రికార్డులతో ఆర్టీసీలు అనేక సార్లు ప్రభుత్వాల నుండి అవార్డులు అందుకున్నాయి. ప్రమాదాలు తగ్గించాలంటే ఆర్టీసీలను విస్తరించి బలోపేతం చేయాలి. అందుకు భిన్నంగా మోటారు వాహన (ఎమ్‌వి) చట్ట సవరణ బిల్లు లోని 27 నుండి 33 క్లాజులలోని 66, 66 ఎ, 66 బి, 67, 72, 74, 88 ఎ మరియు 92 సెక్షన్లను కొత్తగా ప్రవేశపెట్టారు. ఇవి ఆర్టీసీల మనుగడను ప్రశ్నార్థకం చేసేవి. ప్రమాదాలు తక్కువగా ఉండడం వలనే ఇప్పటి వరకు ఆర్టీసీలకు థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్‌ల చెల్లింపులో మినహాయింపు ఉన్నది. సవరణ బిల్లుతో ఈ మినహాయింపు పోతుంది. భారీ ఇన్సూరెన్స్‌లు, ఇన్సూరెన్స్ ప్రీమియంలు ఆర్టీసీలు చెల్లించాలంటే అవి ఇక మనుగడ సాగించలేవు.

ఆర్టీసీ ఏర్పాటు, బస్సుల జాతీయం తరువాత వ్యవసాయ రంగం వేగంగా అభివృద్ధి చెందింది. వ్యవసాయ ఉత్పత్తులను ప్రజలకు చేర్చడంలో రైతులకు రవాణా సౌకర్యాలు చేయూతనిచ్చాయి. మరొక విధంగా అక్షరాస్యతకు, విద్యాభివృద్ధి, వైద్య సౌకర్యాలు అందుబాటులోకి తేవడానికి తోడ్పడ్డాయి. పారిశ్రామిక రంగానికి రవాణా సౌకర్యాలు ఎంతో ఊతాన్ని ఇచ్చాయి. కాలనీల నుండి పారిశ్రామిక కేంద్రాలకు రవాణా సౌకర్యాలతో పారిశ్రామిక రంగం అభివృద్ధి చెందింది. చట్ట ప్రకారం ఉద్యోగ కల్పనలో రిజర్వేషన్లు అమలు చేయడం వలన ఎస్‌సి, ఎస్‌టి, బిసి తరగతులకు, మహిళలకు పెద్ద సంఖ్యలో ఉపాధి అవకాశాలు లభించాయి. మన సమాజానికి అందిన ఈ ప్రయోజనాలతో పాటు లాభనష్టాలతో నిమిత్తం లేకుండా గ్రామీణ, కొండ ప్రాంతాల ప్రజానీకానికి రవాణా సౌకర్యాన్ని ఆర్టీసీలే అందించాయి. అనేక ఆర్థిక పరమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నప్పటికి ప్రభుత్వాల తరపున ఆర్టీసీలు ఈ భారాన్ని మోస్తున్నాయి. ఈ విధంగా సామాజిక బాధ్యతను సైతం అవి నెరవేరుస్తున్నాయి. ఆర్టీసీలు మూత బడితే ప్రయివేటు ఆపరేటర్లు ఈ సౌకర్యాలను ప్రజలకు అందించరు. వారికి లాభాపేక్ష తప్ప సామాజిక బాధ్యత ఉండదు. ఈ బిల్లు మన సమాజానికి శాపం వంటిది. ప్రజా ప్రయోజనాలకు ఎంతో నష్టదాయకం. బిల్లులో ప్రతిపాదించిన పర్మిట్ల సరళీకరణ, యధేచ్ఛగా పర్మిట్ల జారీ, పర్మిట్ల షరతులలో మార్పులు ఇవన్నీ పోటీని తీవ్రతరం చేస్తాయి. ఫలితంగా ప్రమాదాలు పెరిగిపోతాయి. ట్రాఫిక్‌జాములు, కాలుష్య స్థాయి పెరిగిపోతుంది. ఈ దుష్ఫలితాలను ప్రజలు భరించవలసి వస్తుంది. పౌర సమాజానికే ఇది కీడు చేస్తుంది. ప్రమాదాల నివారణే అయితే విచ్చలవిడిగా పర్మిట్లు ఇచ్చే విధానాన్ని ఎందుకు తీసుకువస్తున్నట్లు?

జరిమానాలు, శిక్షలు పొరపాట్లు చేసే వారిలో పరివర్తన తీసుకురావాలి. కానీ బిల్లులో కనీస జరీమానా రూ. 500 నుండి రూ. లక్ష వరకు భారీగా ఉంది. జైలు శిక్ష 3 ఏళ్ళుగా ప్రతిపాదించారు. వాహనాల సంఖ్య పెరిగిపోతున్న దానికనుగుణంగా కేంద్రం ముందుగా రోడ్డు రవాణా రంగంలో మౌలిక వసతులను అభివృద్ధి చేయాలి. తరువాత పెద్ద ఎత్తున రోడ్ల వినియోగదారులకు, డ్రైవర్లకు చైతన్యం కల్పించాలి. తరువాత ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేసి సక్రమంగా నిర్వహించాలి. వీటన్నింటిని విస్మరించి కేవలం శిక్షలు, జరిమానాల పెంపుతో ప్రమాదాలు తగ్గవు, ఈ చర్యలతో అవినీతి మాత్రం పెరిగిపోతుంది.

ప్రస్తుత ఎమ్‌వి చట్టం 1988లో అగ్రిగేటర్లకు అనుమతి లేదు. ఒక చోట ఉండి డ్రైవరును, ప్రయాణీకుడిని అనుసంధానం చేసేదాన్నే యాగ్రిగేటర్లు అంటున్నారు. ఉబర్, ఓలా వంటివే యాగ్రిగేటర్లు. ఆన్‌లైన్ సర్వీసులను యధేచ్ఛగా అనుమతించడానికి, రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి సంబంధం ఏమిటి? సవరణ బిల్లులో సెక్షన్ 93, క్లాజ్ 34లో ఈ యాగ్రిగేటర్లను ప్రవేశ పెట్టారు. ఇది వ్యక్తిగత ఆటోవాలాను, ట్యాక్సీ, లారీ, ప్రయివేటు బస్సు డ్రైవర్లను ఈ రంగం నుండి నెట్టి వేసి కార్పొరేట్ కంపెనీలకు రవాణా రంగాన్ని కట్టబెట్టడానికి కేంద్రం వేసిన పథకమే ఇది.

నేడు రవాణా కార్మిక సంఘాల దేశ వ్యాప్త నిరసన



2017 ఆగస్టు 8న రాజ్యసభలో ప్రతిపక్షాల ఒత్తిడితో బిల్లును సెలక్ట్ కమిటీకి పంపించారు. సెలక్ట్ కమిటీ బిల్లుతో అనుబంధం ఉన్న వారితో, అఖిల భారత రోడ్డు రవాణా కార్మిక సమాఖ్యతోనూ చర్చించింది. ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్ర ప్రభుత్వాలు బిల్లుపై తమ అభ్యంతరాలను ఇవ్వడంపై విఫలమయ్యాయి. బిల్లుపై వేసిన సెలెక్టు కమిటీ తమిళనాడు, కేరళ రాష్ట్రాలను పర్యటించింది. అనేక సంఘాలను కలిసి వారి అభిప్రాయాలను తెలుసుకున్నది. ఈ మొత్తం పనికి 135 రోజుల సమయం తీసుకున్నది. చివరికి బిల్లును సెలక్టు కమిటీ ఆమోదించింది. ఈ రాజ్యసభ సెలెక్టు కమిటీ బిల్లుపై గతంలో పార్లమెంటరీ స్థాయి సంఘం ఇచ్చిన సిఫార్సులను కూడా తమ నివేదికలో ప్రస్తావించలేదు. దీనితో సెలెక్టు కమిటీ అనేది కంటి తుడుపు చర్య అని తేలిపోయింది. ఈ స్థితిలో సెలెక్టు కమిటీలో సిపిఎం, కాంగ్రెస్, డిఎమ్‌కె, ఎఐఎడిఎమ్‌కె, టిఎమ్‌సి వంటి పార్టీల రాజ్యసభ సభ్యులు బిల్లు లోని వివిధ అంశాల పట్ల తమ అసమ్మతి తెలియజేశారు.

బిల్లును ఆమోదించుకోవడానికి కేంద్ర ప్రభుత్వం, కేంద్ర ఉపరితల రవాణా మంత్రి నితిన్ గడ్కరీ పడరాని పాట్లు పడ్డారు. బిల్లుపై రవాణా సంఘాలు చేసిన నికరమైన పోరాటం బిల్లును నాలుగు ఏళ్ళ పాటు ఆమోదం పొందకుండా అడ్డుకున్నాయి. ఈ బడ్జెట్ తొలి సమావేశాలలోనే బిల్లును ఆమోదించుకోవాలని ప్రభుత్వం సంకల్పించినా, ముఖ్యమైన ప్రజా సమస్యలపై ప్రతిపక్షాల పట్టు పట్టడం వల్ల బిల్లును ప్రవేశ పెట్టలేకపోయాయి. ఏప్రిల్ 6 వరకు జరగనున్న పార్లమెంటు సమావేశాలలోనే వినాశకర బిల్లును రాజ్యసభ ఆమోదించే ప్రమాదమున్నది. రాజ్యసభలో ఎన్డీఏకి తగిన బలం సమకూరినందున బిల్లును పాస్ చేసే ప్రమాదం ఉన్నది. అయితే దానిని చట్టం చేసి అమలు చేయగలగడం అంత తేలిక కాదు. డ్రైవర్లు, రవాణా రంగం సహకరిస్తేనే కేంద్రం దీనిని అమలు చేయగలదు.

అందుకే ప్రజా వ్యతిరేక మోటారు వాహనాల చట్ట సవరణ బిల్లును నిలిపివేయాలని, రవాణా కార్మిక సంఘాలన్నీ నేడు (మార్చి 6న) దేశ వ్యాప్త నిరసన కార్యక్రమాలు చేపట్టాలని, మార్చి 20 లోగా అన్ని రాష్ట్రాలలో రాష్ట్ర స్థాయి సదస్సులు నిర్వహించాలని, బిల్లుకు వ్యతిరేకంగా సమ్మెకు సన్నాహాలు చేసుకోవాలని రవాణా కార్మిక సంఘాల జాతీయ కోఆర్డినేషన్ కమిటీ పిలుపునిచ్చింది. ఈ సమ్మెతో దేశ రవాణా వ్యవస్థను స్థంభింపచేయాలి. రవాణా రంగ కార్మికులు ఐక్యమై బలాన్ని చాటాలి. ఇది మాత్రమే ప్రభుత్వాన్ని పునరాలోచనవైపు నెట్టగలదు.

(రచయిత ఉప ప్రధాన కార్యదర్శి, అఖిల భారత రోడ్డు రవాణా కార్మికుల సమాఖ్య)

ప్రజాశక్తి
jeevanapageps@gmail.com
జీవన the family
JEEVANA

మహిళోదయం 6

‘కన్నీళ్లని ఏ భాషలోకి అనువదించినా మూర్తీభవించిన స్త్రీ విషాదమే కనిపిస్తుంది’ .. ‘తను శవమై.. ఒకరికి వశమై.. తనువు పుండై.. ఒకరికి పండై.. ఎప్పుడూ ఎడారై.. ఎందరికో ఒయాసిస్సై’ అని స్త్రీ గురించి కవి అన్న మాటలు అక్షరసత్యాలు. ‘ఈ దుర్యోధన దుశ్శాసన దుర్వినీతి లోకంలో ... మరో మహాభారతం.. ’ అనే సినీపల్లవులూ నేడు దేశంలో జరుగుతున్న అత్యాచారాలకు నిలువుటద్దం. ఉదయం లేచిన దగ్గర నుంచి రాత్రి వరకు.. ఆమెపై జరిగే హింసను తలచుకుంటూ ‘నడిచే గాయమా.. నారీ లోకమా.. శోకపు రూపమా?’ అన్నాడు మరోకవి. పిండదశలోనే చంపేసే దగ్గర నుంచి బాల్యంలో బ్యాడ్ టచ్ .. అత్యాచారాలు.. మేరిటల్ రేప్‌లు.. వృద్ధాప్యం వరకూ స్త్రీలపై జరిగే అత్యాచారాలు ఎన్నో ఎన్నెన్నో. పురాణగాథల్లో పేర్కొన్న కీచకపర్వం ఏమోగానీ.. పని ప్రదేశాల్లో స్త్రీలపై కామపు చూపులు, వెకిలి చేష్టలు, వికారపు హావభావాలు.. అధికారాన్ని అడ్డంపెట్టుకుని నోటీసులు, బెదిరింపులు.. పదోన్నతులివ్వాలంటే.. లొంగిపొమ్మనే బేరసారాలు.. ఇన్ని జరుగుతున్నా ఆమె వాటిని ఎదుర్కొనే సామర్థ్యం పెంచుకుంటూనే పోతుంది. ఆమె నైపుణ్యాన్ని అధిగమించలేక స్త్రీలపై లైంగిక వేధింపులు మరింత ఎక్కువవుతున్నాయనేది కాదనలేని సత్యం.





నారీ లోకంలో మానని గాయం

ఆమె చేసే పోరాటంలో కొన్ని పువ్వులు రాలిపోతున్నా.. కొత్త చిగుళ్లు వేస్తూ మొగ్గలు వేస్తూనే ఆశావహ దృక్పథంలో ఆమె వెన్నుచూపక ముందుకే సాగుతోంది.. ఆమె పటిమను తట్టుకోలేక తుచ్ఛమైన వ్యాఖ్యలు చేయడం.. ‘సోదరా అని వేడుకోవాల్సింది..!’ ‘వస్త్రాలంకరణే కారణమంటూ’ మూర్ఖపు మాటలు.. కోరుకున్న ఆడది లొంగకపోతే యాసిడ్ దాడులు.. లేకపోతే అత్యాచారానికి తెగబడి వీడియో చిత్రీకరణలు.. ఇలా సమాజంలో ‘వికృత ఆటవికత’ పెచ్చరిల్లుతోంది. పోరాడి సాధించుకున్న చట్టాలనూ నిర్వీర్యం చేస్తూ.. స్త్రీని ఇంటికే పరిమితం చేసే మనువాదపు భావాలే ఆమెను వెంటాడుతున్నాయి. నిత్యజీవితంలో మనకెదురయ్యే కొన్ని కేస్‌స్టడీస్ చూస్తే సమకాలీన స్త్రీలపై జరిగే దాడులెలాంటివో అర్థం చేసుకోవచ్చు.

విశాఖకు చెందిన సుమిత్రా (పేరు మార్చాం) నడవలేని స్థితిలో పుట్టింటికి వచ్చేసింది. భర్త అర్ధరాత్రివేళ తాగొచ్చి, ఒళ్లు హూనమయ్యేలా కొట్టి.. దెబ్బలకు తాళలేక ఆమె లేవకపోతుంటే మూడేళ్ల పాపను తలకిందులుగా చేసి, కాల్వలో పడేస్తానంటూ బెదిరించాడు. ఆ బిడ్డ భయంతో గుక్కపెట్టి ఏడుస్తుంటే.. పంటిబిగువున గోడల్ని ఆసరాగా చేసుకుని ఆమె నిలుచుంది. అతను వెంటనే ఆ బిడ్డను నేలపై పడేసి, ఆమె జుట్టు పట్టుకుని ఈడుస్తుంటే, బిడ్డ ఆమె కాలు పట్టుకుంది. అలా ఇద్దరినీ కటిక చలిరాత్రిలో బయటకు నెట్టేసి తలుపులు వేసుకున్నాడు. ఇరుగు పొరుగులో ఒకరు వాళ్లని రైల్వేస్టేషన్‌లో వదిలిపెట్టి, వాళ్లూరికి టిక్కెట్లు కొనిచ్చారు. రెండోరోజే ఆమె దగ్గరకు వెళ్లి ఇంట్లో అందరినీ కొట్టి, భయభ్రాంతులకు గురిచేస్తుంటే, పోలీసులను ఆశ్రయించారు. వాళ్లు వచ్చి, బెదిరిస్తే నోరుమూశాడు. ఇప్పటికీ ఆమె అతనిపై కేసు పెట్టకపోవడానికి కారణం.. అతనుచేసే కాంట్రాక్టు ఉద్యోగం పర్మినెంటు కాదేమోననే భయంతోనే.

...

మనీషా ఐదేళ్ల అమ్మాయి.. పక్కింటి అంకుల్ చాక్లెట్ కొనిస్తానంటే వెళ్లింది.. అతని వికృత చేష్టలకు తీవ్ర రక్తస్రావంతో ఆసుపత్రిలో రోజులు లెక్కబెడుతోంది..

...

స్కూల్లో ఎయిడ్స్‌పై అవగాహనా సదస్సు జరుగుతోంది. వాళ్ల మాటలు వింటున్నంత సేపు తొమ్మిదో తరగతి విద్యార్థిని ఏకధారగా ఏడుస్తూనే ఉంది. ఏంటనీ టీచర్ అడిగితే... ఏడాదిగా తండ్రి ఆమెపై చేస్తున్న అఘాయిత్యాన్ని చెప్పి.. “నాకూ ఎయిడ్స్ వస్తుందా? నేనూ చచ్చిపోతానా?” అని అడుగుతుంటే.. ఆ టీచరే కాదు.. విన్న అందరూ నిశ్చేష్టులై.. వెంటనే తల్లిని పిలిపించి, అతనిపై కేసు నమోదు చేయించారు. విద్యార్థినిని వైద్యపరీక్షలకు పంపారు.

...

తోడుగా ఉంటుంది, ఆర్థికంగా సాయంచేస్తే చదువుకుంటుందని కజిన్‌ను అమెరికాలో తన వద్ద ఉంచుకుంది సంగీత (పేరు మార్చాం). ఆమె ఉద్యోగానికి వెళ్లినప్పుడు భర్త ఆమె చెల్లెల్ని లొంగదీసుకున్నాడు. ఇప్పుడు ఆమె చెల్లెలు కూడా అతనితో కలిసి ఆమెనూ, పిల్లల్ని ఇంట్లోంచి పంపించేశారు. పరువు పోతుందేమోనని కేసు పెట్టకుండా ఇండియా వచ్చి, పిల్లల్ని చదివించుకుంటుందామె.

...

ఎంటెక్ చదువుకున్న భాగ్యను (పేరు మార్చాం) బ్యాంకు మేనేజర్‌కు ఇచ్చి పెళ్లి చేశారు. ఆమె వెంటనే గర్భవతి అయితే ‘నీ బిడ్డకు నేనేనా తండ్రిని?’ అంటూ హాస్పటల్‌లో ఉండగానే.. పెళ్లి అయిన తేదీ నుంచి రోజులు లెక్కపెడుతుంటే.. ఆమె సగం చచ్చిపోయింది. గర్భవతి కాబట్టి కొన్నాళ్లు దూరంగా ఉండాలని అంటే ‘బయటకు వెళితే డబ్బులు ఖర్చవుతాయి.. నిన్ను పెళ్లి చేసుకుంది ఎందుకు?’ అన్న అతని మాటలకు ఆమె ఆగ్రహం కట్టలు తెంచుకుంది. పడకగదిలోని విషయాలన్నీ అమ్మతో పంచుకోవడమేకాదు.. వాళ్లిద్దరూ చాటింగ్ చేసిందీ అత్తగారు చదవడం.. వీటన్నింటినీ భరించలేక ఆమె తీవ్ర మానసిక ఒత్తిడికి గురవ్వడంతో అబార్షన్ అయిపోయింది. దీంతో ఆమె అతనిపై 498ఎ కేసు పెట్టింది. కానీ లాయరు, పోలీసులు



అతను గవర్నమెంటు ఉద్యోగిగా.. కొంత కన్సిడర్ చేయాలంటూ బెయిల్ ఇప్పించారు.

...

అఖిల (పేరుమార్చాం) తనకన్నా రెండేళ్లు పెద్దదని, వేరే కులమని తెలిసినా.. ఆమె ఇబ్బందులు వస్తాయి ఆలోచించు కోమన్నా.. ప్రేమించానంటూ.. తల్లిదండ్రులకు తెలియకుండా ఆమెను తీసికెళ్లి తిరుపతిలో పెళ్లి చేసుకుని వచ్చాడతడు. తీరా వచ్చాక ఆమెను, ఆమె తరఫు కుటుంబసభ్యులను బయటే ఉంచేసి, అతన్ని లోపలికి తీసికెళ్లారు తల్లిదండ్రులు. ఆ తర్వాత కొన్నిరోజుల్లో అతను ప్లేట్ ఫిరాయించాడు. ఆమెకు తనకూ సంబంధం లేదన్నాడు. కేసు పెడితే పరువుపోతుంది. అలా చేస్తే చచ్చిపోతానంటూ అఖిల అన్నయ్య బెదిరించడంతో ఆమె కేసు పెట్టలేదు.



బాల్యం నుంచి వృద్ధాప్యం వరకు!

ఆడపిల్ల అని తెలియగానే పిండదశలోనే మొదలయ్యే హింస.. ఆ ఆడపిల్ల బతికి బయటపడి.. ఎదిగే దశల్లో పలు రూపాల్లో లైంగిక వేధింపులకు, అత్యాచారాలకు గురవు తోంది. బ్యాడ్‌టచ్‌తో కుటుంబంలో, ఇరుగుపొరుగు, బంధు వర్గంలో ఆడపిల్లలపై జరిగే లైంగికదాడులకు లెక్కేలేవు. కౌమారదశలో అడుగుపెట్టిన అమ్మాయిలకు ఇంటా బయటా రక్షణే లేని దుస్థితి. పెళ్లయ్యాక వరకట్న హత్యలు కొన్నయితే.. భర్త ముందే జరిగే అత్యాచారాలు ఇంకొన్ని.. భర్త వల్లే జరిగే అత్యాచారాలు మరికొన్ని.. వయసు తారతమ్యం లేకుండా వృద్ధాప్యంలోనూ అత్యాచారాలకు గురవడం పురుషాధిక్య సమాజంలో దారుణస్థితికి నిలువెత్తు నిదర్శనం. డ్రెస్‌కోడ్ అనే మాటలు ఎంత అవాస్తవమో ఈ పరిస్థితే చెబుతోంది. అసలు కారణం మహిళను మనిషిగా చూడకుండా సెక్స్ సింబల్‌గా చూడటమే.

భద్రత ఎవరి బాధ్యత?

కుటుంబంలో, పంటచేలల్లో, భవననిర్మాణాల్లో, చిన్న పరిశ్రమల్లో, షాపుల్లో.. ఇలా అనేకచోట్ల మహిళలల అవస్థలు అన్నీ ఇన్నీ కావు. పొట్ట పట్టుకుని కుటుంబం కోసం రెక్కలు ముక్కలు చేసుకుంటూ.. ఆ వచ్చే చాలనీ చాలని జీతాలతోనే బాధపడే అబలలపై లైంగిక దోపిడీ యథేచ్ఛగా కొనసాగుతోంది. ఎదురు తిరిగితే చేసే పనిపోతుందని భయం. కుటుంబ అవసరాలతో ఉపాధికోరే మహిళల్ని వేరే దేశాలకు అమ్మేసే ముఠాలకు చిక్కుకుంటున్న మహిళలు మరికొందరు. ఇలాంటి లైంగిక దోపిడీవల్ల హెచ్‌ఐవితో అయినవారందరికీ దూరంగా ఊరవతల బతికే కన్నీటి జీవితాలు మరికొన్ని. వీరికి ఉపాధి ఇవ్వాల్సిన బాధ్యత ఎవరిది? వీరి శరీరాలకి భద్రత కల్పించాల్సింది ఎవరు? అసలు ఆమె సమాజంలో ‘మనిషి’గా బతికే హక్కు ఉన్నట్టా? లేనట్టా?

ఆధారాలు ఎలా?

ఉద్యోగాలు చేసే చోట లైంగిక దాడికి గురైన వారు తమ గోడు ఎవరికి చెప్పాలి? ఆ అకృత్యాన్ని ఎలా నిరూపించుకోవాలి? ఆమె మాట చెబితే నమ్మేదెవరు? ఫిర్యాదు చేస్తే ఆమె విషయం రహస్యంగా ఉంచుతారా? దాన్ని ఆసరా చేసుకుని విచారణాధికారులే కాటేస్తే? ఆమె పరిస్థితి ఏమిటి? పరువు కోసం కుటుంబం ఆమెను ఉద్యోగం మానెయ్యమంటే ఎలా? పోలీసుస్టేషన్‌కు వెళితే, వారి చూపులు, వారి చేష్టలు ఆమెను మరోసారి అత్యాచారానికి గురిచేస్తున్నాయి. కేసు కోర్టు గుమ్మం వరకు వెళ్లకుండానే ఆ చట్టం పోలీసుల చేతుల్లోనే చట్టుబండలు చేస్తే.. ఆమె స్వేచ్ఛా రెక్కలు విరిచేయడంకాక ఏమనాలి? నువ్వు పోలీసుస్టేషన్‌కు వెళతావా? ఇంటిముందు దీక్షలకు కూర్చుంటావా? ఇక నీతో జన్మలో కాపురం చేయనంటూ.. పరువంతా ఆమె తీసేసిందనే అక్రమ సంబంధాల భర్తలను ఏమనాలి? ఇలా ఆమె చుట్టూతా ఇనుప కంచెలు ఎన్నెన్నో ప్రతిబంధకాలై నిత్యం గుచ్చుకుంటూనే ఉన్నాయి. ఆమె ఆంక్షల సుడిగుండంలో రోజురోజుకూ కిందకు జారిపోతూనే ఉంది. ఆమె బయటకొచ్చే మార్గమేది?

చట్టం ఎవరికి చుట్టం?

చట్టాలూ అసమానతలకు ఆజ్యం పోస్తున్నాయి. వారికి ఎలాంటి న్యాయం చేయడం లేదు. ఒకవేళ కోర్టు గుమ్మం వరకు వెళ్లినా.. అటువైపు లాయరు ఇటువైపు లాయర్‌ని కొనేస్తారు. చివరకు అక్కడా ఆమెకు న్యాయం అందని ద్రాక్షే! అసలు బాధితురాలు ఆమె కాదా? ఫిర్యాదు చేయకుండా హెచ్చరించడం నిరుత్సాహపరచడం కాదా? సుప్రీం తీర్పు (విశాఖ) తర్వాత పదిహేనేళ్లకు ఎట్టకేలకు వచ్చిన ‘పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల (నివారణ, నిషేధం, పరిష్కార మార్గాలు, 2013) చట్టం’ అమలు అవుతున్నదెంత?

కొట్టడం అనేది.. వేధించడం అనేది మనిషి లక్షణం కాదు. అది అసహనానికి ప్రతీక. అవతలి వ్యక్తి బలహీనతపై దాడి చేయడం హేయమైన చర్య. స్త్రీని మనిషిగా కాకుండా తన వస్తువుగా భావించడం. అగ్నికి ఆజ్యం పోసినట్లు మనువాదుల మూర్ఖపు వ్యాఖ్యానాలు భరించనంతకాలం బాధిస్తూనే ఉంటుంది. బయటపెట్టిననాడే విముక్తికి మార్గం. గృహ హింసతో శరీరానికే కాదు గాయాలయ్యేది.. ఆమె హృదయం వేల ముక్కలవుతుంది. ప్రేమించిన మనిషే హింసిస్తుంటే మనసు రాచపుండవుతుంది. ఎంతో పోరాడగా వచ్చిన చట్టాలతో న్యాయం జరిగేలా చూడాలి. అందుకే పురుషాధిక్య భావజాలంపై సామాజిక ప్రతిఘటన పెరగాలి. స్త్రీ-పురుషుల సమానతను సాధించేందుకు నిశ్శబ్దాన్ని ఛేదించాలి.

- శాంతిశ్రీ

మనల్ని మనం మార్చుకోవాలంటే పుస్తకాలు చదవాలి

కిరణ్ దేశారు.. 46 ఏళ్ల నవలా రచయిత్రి. ప్రముఖ రచయిత్రి పద్మభూషణ్ అనితా దేశారు కూతురు. 35 ఏళ్లకే బుకర్ ప్రైజ్ దక్కించుకున్న భారతీయురాలు. రచయిత్రిగా అంతర్జాతీయంగా మంచి గుర్తింపు సాధించిన కిరణ్ దేశారు స్వస్థలం కొత్త ఢిల్లీ. 14వ ఏట తల్లితోపాటు ఇంగ్లాండ్‌కు వెళ్లింది. అక్కడ ఒక ఏడాది ఉండి తరువాత అమెరికాకు షిఫ్టయ్యారు. చదువులో ముందున్న కిరణ్‌కి బాల్యం నుంచి రచనలంటే ఇష్టం. ఎక్కువగా పుస్తకాలు చదివేది. అమెరికాలో ఉన్నా.. భారతీయ సాహిత్యాన్ని వదలలేదు. బెల్లింగ్‌టన్‌లోని హాలిన్స్ యూనివర్సిటీ, కొలంబియా యూనివర్శిటీల్లో క్రియేటివ్ రైటింగ్‌లో శిక్షణ తీసుకుంది. చిన్నకథలు రాయడంతో మొదలు పెట్టి... నవలా రచయిత్రిగా మారిపోయింది.



“హుల్లాబాలూ ఇన్ ది గోవా అర్కాడ్” అనేది కిరణ్ దేశారు తొలిరచన. ఇది 1998లో వెలువడింది. ఈ పుస్తకానికి ఆమెను ‘బెట్టీ ట్రాస్క్’ అవార్డు వరించింది. కిరణ్ దేశారుకు ‘మ్యాన్ బుకర్ ప్రైజ్’ను తెచ్చిపెట్టిన పుస్తకం ‘ద ఇన్‌హెరిటెన్స్ ఆఫ్ లాస్’. ఇదే పుస్తకానికి ఆమెకు ‘నేషనల్ బుక్ క్రిటిక్స్ సర్కిల్’ ఫిక్షన్ అవార్డుతో పాటు, వొడాఫోన్ క్రాస్ వర్డ్‌బుక్ అవార్డు దక్కింది. తొలి పుస్తకం తరువాత ఆమె దాదాపు ఏడేళ్లు గ్యాప్ తీసుకుని, ఈ పుస్తకాన్ని రచించారు. ఈ రెండు పుస్తకాలు ఆమెకు అంతర్జాతీయ ఖ్యాతిని తెచ్చిపెట్టాయి. 2007లో బిబిసి రేడియో కార్యక్రమంతో యూరప్‌లోనూ మంచి పాపులారిటీ సంపాదించారు కిరణ్. అదే సంవత్సరం ఏషియా హౌజ్ ఫెస్టివల్ ఆఫ్ ఏషియన్ లిటరేచర్ ఉత్సవాన్ని ప్రారంభించారు. 2013లో బెర్లిన్‌లోని అమెరికన్ అకాడమీ బెర్లిన్ ప్రైజ్ ఫెలోషిప్ ఆమెకు దక్కింది.

“అమ్మ అనితాదేశారు కూడా రచయిత్రి కావడం వల్లేనేమో మా ఇంటినిండా పుస్తకాలుండేవి. ఎక్కువగా ఇంటర్నేషనల్ బుక్స్. నా వేసవి సెలవులన్నీ మా ఇంట్లో ఉన్న పుస్తకాల షెల్ఫ్‌ల మధ్యే గడిచేవి. ఆ పుస్తకాలు చదివే ప్రపంచాన్ని చూశాను. టీనేజ్‌లోకి వచ్చాక... ఆ పుస్తకాల వల్లే ప్రయాణం చేయగలిగాను. ఇండియా, లండన్, అమెరికా భిన్నమైన కల్చర్స్‌ని చూడగలిగాను. అనుభవించగలిగాను. ఆ తేడాలను అక్షర రూపంలోకి మలిచాను. నిన్ను నువ్వు మార్చుకోవాలనుకుంటే కచ్చితంగా పుస్తకాలు చదవాల్సిందే” అంటారు కిరణ్ దేశారు.

★

జీవన సౌరభం

నిశ్శబ్దాన్ని ఛేదించాలి ఆమెపై హింసను ఆపాలి.

మీకోసం



మొటిమలు వాచి నొప్పి పెడుతుంటే ఐస్‌క్యూబ్‌ను వాటిపై మెల్లగా రుద్దితే కొంచెం ఉపశమనం ఉంటుంది.

నేలా.. నింగి.. అంతా ఆమె

అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా నేలా నింగిపై అంతా ఆమె అన్నట్లుంది. ఈ సందర్భంగా శతాబ్ది ఎక్స్‌ప్రెస్‌లోనూ.. ఎయిర్ ఇండియా విమానంలోనూ అంతా మహిళాసిబ్బంది ఉండేలా నిర్ణయించారు. ఈ సందర్భంగానైనా మహిళా శక్తిని గుర్తించినందుకు సంతోషం.

నేషనల్ క్యారియర్ ఎయిరిండియా ఓ ప్రత్యేక విమానాన్ని మొత్తం మహిళా సిబ్బందితో మొత్తం నడుపుతోంది. ఇది అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ వారమంతా పలు ఈవెంట్లను ఎయిర్‌లైన్స్ నిర్వహిస్తోంది. అందరూ మహిళా సిబ్బందితోనే కోల్‌కతా-డిమాపూర్-కోల్‌కతా సెక్టార్‌లో ఈ విమానాన్ని ఆపరేట్ చేస్తోంది. ఎయిర్‌లైన్స్ విడుదల చేసిన ప్రకటనలో విమానం ఏఐ709, ఎయిర్‌బస్ 319కు కాక్‌పిట్ సిబ్బందిగా కెప్టెన్ ఆకాంక్ష వర్మ, కెప్టెన్ సతోవిసా బెనర్జీ వ్యవహరిస్తున్నారని, క్యాబిన్ సిబ్బందిగా డి భుటియా, ఎంజీ మోహన్రాజ్, టీ ఘోస్, యతటిలి కత్‌లు ఉన్నారని తెలిపింది. ఎయిరిండియా జనరల్ మేనేజర్, పర్సనల్ నవ్‌నీత్ సిధు, ఇతర సీనియర్ సిబ్బంది కలిసి ఈ విమానానికి పచ్చజెండా ఊపి ప్రారంభించారని ఎయిర్‌లైన్స్ పేర్కొంది. ప్రపంచంలోనే తొలిసారి అంతా మహిళా సిబ్బందితో విమానాన్ని 1985లో ఎయిరిండియా నడిపింది. అత్యంత పొడవైన మార్గం ఢిల్లీ-శాన్‌ఫ్రాన్సిస్కో-ఢిల్లీ రూట్‌లోనూ అంతా మహిళా సిబ్బందితో ఎయిరిండియా ఓ ప్రత్యేక విమానాన్ని నడిపి, ప్రపంచ రికార్డును సాధించింది.





ఈ శతాబ్దిలో..

పురుష టీటీఈ డ్యూటీ చేసినప్పటి కంటే మహిళలు డ్యూటీ చేసిన రోజు పెనాల్టీలు 66 శాతం పెరగడాన్ని అధికారులు గుర్తించారు! మహిళలు నిజాయితీగా ఉద్యోగం చేస్తారనడానికి ఇదొక నిదర్శనం. ఇటీవలే ముంబైలోని మాతుంగ రైల్వేస్టేషన్ మొత్తం మహిళా ఉద్యోగులతో వార్తల్లోకొచ్చింది. అలాగే జైపూర్‌లోని గాంధీనగర్ రైల్వేస్టేషన్. అక్కడంతా మహిళా సిబ్బందే. ఇప్పుడు మరో మెట్టు. అహ్మదాబాద్ - ముంబయి మధ్య తిరిగే శతాబ్ది ఎక్స్‌ప్రెస్‌లో ఇకనుంచీ టీటీఈ (ట్రావెలింగ్ టికెట్ ఎగ్జామినర్)లందరూ మహిళలే ఉండబోతున్నారు. రానున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవం నుంచి ఈ నిర్ణయాన్ని అధికారికంగా అమలులోకి తీసుకురాబోతోంది ఇండియన్ రైల్వే. ఇంతవరకు ‘శతాబ్ది’లో ఆరుగురిలో షిఫ్ట్‌కి ఇద్దరే మహిళా టీటీఈలు ఉండేవారు. ఇక నుంచి మొత్తం మహిళలే ఉంటారు. ప్రస్తుతానికి ఒక షిఫ్ట్.. అంటే ఆరున్నర గంటల టైమ్ మాత్రమే మొత్తం మహిళా టీటీఈలు డ్యూటీలో ఉండగలుగుతారు. ఈ సంఖ్యను ఇంకా పెంచాలనే ఉద్దేశంలో అధికారులు ఉన్నారు.

★

సెన్సెక్స్ ⬇ 300
33,746

నిఫ్టీ ⬇ 100
10,358

రూపాయి ⬆ 05 పై॥
అమెరికా డాలరుకు రూ.
65.11

మహీంద్రా 'మోజో యుటి 300'

మహీంద్రా మోటార్ సైకిల్స్ మోజో సీరిస్‌లో కొత్త మోజో యుటి 300 మోడల్‌ను ఆవిష్కరించింది. దీని ప్రారంభ ధర రూ.1.39 లక్షలుగా నిర్ణయించింది. ఈ నెల నుంచే ముందస్తు బుకింగ్‌లు ప్రారంభిస్తున్నట్లు ఆ కంపెనీ పేర్కొంది.



మార్కెట్లోకి టాటా జెస్ట్ ప్రీమియో



న్యూఢిల్లీ: ఆటోమొబైల్స్ తయారీ దిగ్గజం టాటా మోటార్స్ కాంపాక్ట్ సెడాన్ 'జెస్ట్'లో ప్రత్యేక ఎడిషన్‌ను సోమవారం మార్కెట్లోకి విడుదల చేసింది. 1.3 లీటర్ డీజిల్ ఇంజిన్ 'జెస్ట్ ప్రీమియో' పేరుతో లాంచ్ అయిన ఈ కొత్త కారులో 13 అదనపు ఫీచర్లను జోడించినట్టుగా కంపెనీ తెలిపింది. ఈ కొత్త ఎడిషన్ ప్రారంభ ధర రూ.7.53లక్షలు (ఎక్స్-షోరూమ్ ఢిల్లీ). దేశంలోని అన్ని టాటా మోటార్స్ రిటైల్ షోరూమ్‌లలో మార్చి 1నుంచి ఈ కొత్త కారు అందుబాటులో ఉంచినట్టు తెలిపింది. కస్టమర్ల ప్రాధాన్యతలకు అనుగుణంగా తాము తీసుకొచ్చిన స్పెషల్ ఎడిషన్ ప్రీమియో తప్పక వినియోగ దారులను ఆకట్టుకుంటుందని కంపెనీ వర్గాలు విశ్వాసం వ్యక్తంచేస్తున్నాయి. డ్యూయెల్ టోన్ రూఫ్, ఎక్స్‌టీరియర్ మిర్రర్స్, డాష్‌బోర్డ్ లాంటి కొత్త ప్రీమియం ఫీచర్లతో పాటు నాలుగు సిలిండర్ డీ 1.3 లీటర్ డీజిల్ ఇంజిన్, 74 బీహెచ్‌పీ, 190 ఎన్ఎం టార్క్, 5-స్పీడ్ మాన్యువల్ గేర్ బాక్స్ ప్రధాన ఫీచర్లుగా ప్రీమియో మార్కెట్లోకి వచ్చింది.



తిరుపతిలో మాట్లాడుతున్న ఐఆర్‌సిటిసి సికింద్రాబాద్ జాయింట్ జిఎం సంజీవయ్య

19 నుంచి ఉత్తర భారత యాత్ర

తిరుపతి నుంచి ప్రత్యేక రైలు

ఐఆర్‌సిటిసి జాయింట్ జిఎం సంజీవయ్య వెల్లడి

ప్రజాశక్తి-తిరుపతి టౌన్

ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19న ఉత్తర భారత యాత్ర, వైష్ణవి మాత సందర్శనకు ప్రత్యేక రైలును ఏర్పాటు చేసినట్లు ఐఆర్‌సిటిసి సికింద్రాబాద్ జాయింట్ జిఎం సంజీవయ్య తెలిపారు. సోమవారం ఓ ప్రయివేటు హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో భారతదేశంలోని అనేక ముఖ్యమైన ప్రాంతాల్లో ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు వెల్లడించారు. ఉత్తర భారత యాత్ర ఈనెల 19 నుంచి 29వ తేదీ వరకూ 11 రోజుల పాటు ఉంటుందన్నారు. ఒక్కొక్క టికెట్ జిఎస్‌టితో కలిపి స్లీపర్ అయితే రూ.10,900, ఏసీ అయితే రూ.13,230లు ఉంటుందని, మూడు పూటలా భోజన వసతి కల్పిస్తామని వివరించారు. సమావేశంలో తిరుపతి స్టేషన్ లైజన్ అధికారి కె.సత్యనారాయణ, స్టేషన్ మేనేజర్ సుబోద్ మిత్ర, బివి.రమేష్, సీనియర్ సూపర్‌వైజర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రెండు బ్యాంకులకు ఆర్‌బిఐ జరిమానా

న్యూఢిల్లీ: దేశంలోని బ్యాంకుల్లో పరిపాలనా మోసాల కారణంగా రోజుకో స్కామ్ వెలుగులోకి వస్తున్న నేపథ్యంలో.. బ్యాంకుల పెద్దన్న భారతీయ రిజర్వు బ్యాంక్ (ఆర్‌బిఐ) రెండు దిగ్గజ బ్యాంకులకు షాక్ ఇచ్చింది. నిర్దిష్ట నిబంధనలు పాటించని కారణంగా ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సంస్థ 'ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్' (ఐవోబీ), ప్రయివేటు బ్యాంకింగ్ దిగ్గజం 'యాక్సిస్ బ్యాంక్'లకు జరిమానా విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఖాతాదారు గురించి తెలుసుకోవడం (కెవైసీ) సంబంధించిన నిబంధనలు పాటించని కారణంగా ఐవోబీకి రూ.2 కోట్ల జరిమానాను విధించింది. ప్రభుత్వ యాజమాన్యంలోని ఈ బ్యాంకు అంతర్గత తనిఖీ నివేదిక సహా.. సంబంధిత పత్రాల పరిశీలన అనంతరం ఆర్‌బీఐ ఈ మేరకు ఉత్తర్వులను జారీచేసింది.

'ట్రేడ్ వార్' భయాలు!

- వెలవెలబోయిన లోహ రంగ షేర్లు
- ఇబ్బంది పెట్టిన ఇటలీ పరిణామాలు
- 300పాయింట్ల మేర కుంగిన సెన్సెక్స్
- 10,359 పాయింట్లకు ఎన్ఎస్ఈ నిఫ్టీ



ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం నష్టాలలో ముగిశాయి. అమెరికా అధ్యక్షుడు చేసిన ట్రేడ్‌వార్ భయాలకు తోడు ఇటలీలో అనిశ్చితి, ప్రపంచ దేశాల్లో స్టాక్స్ పడిపోవడం, దేశీయంగా సేవా రంగం కుంచించుకుపోనుందంటూ వచ్చిన వార్తలు మార్కెట్‌పై ప్రతికూల ప్రభావాన్ని చూపాయి. లోహ, చమురు, ఇంధన, ఆటోమొబైల్, బ్యాంకింగ్ రంగాల షేర్లు నష్టాల్లో సాగడంతో సోమవారం స్టాక్‌మార్కెట్లు భారీగా పతనమయ్యాయి. ఈ ఉదయం 200 పాయింట్లకు పైగా నష్టంతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత ఏ దశలోనూ కోలుకోలేకపోయింది. అద్యంతం నష్టాల్లోనే కదలాడిన మార్కెట్లు ట్రేడింగ్ ముగిసే సమయానికి దాదాపు 1 శాతం నష్టపోయాయి. బీఎస్ఈ సూచీ సెన్సెక్స్ 300 పాయింట్ల మేర నష్టపోయి 33,747 పాయింట్ల వద్ద ముగిసింది. మరోవైపు ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 99 పాయింట్లు కంగి 10,359 పాయింట్ల వద్ద ముగిసింది. దీంతో దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా నాలుగో సెషన్‌లోనూ నష్టాల్లో ముగిసినట్టయింది. అమెరికాలో కంపెనీలను కాపాడుకొనేందుకు ఉక్కు, అల్యూమినియంపై దిగుమతి సుంకాల్ని భారీగా పెంచనున్నట్టుగా అగ్రరాజ్యం ప్రకటించిన నేపథ్యంలో లోహ షేర్లు వెలవెల బోయాయి.

నిఫ్టీ మెటల్ ఇండెక్స్ దాదాపు 3.28% మేర నష్టపోయింది. జిందాల్ స్టీల్ అండ్ పవర, జిందాల్ స్టెయిన్‌లెస్, సెయిల్ స్టాక్‌లు భారీగా నష్టపోయాయి. మరోవైపు ఆటో రంగపు షేర్లు కూడా భారీగానే పడిపోయాయి. ఈ రంపు సూచీ దాదాపు 1.57% మేర కుంగింది. టాటా మోటార్స్, మదర్సన్ సమీ సిస్టమ్స్ తదితర స్టాక్స్ నష్టాలను మూటగట్టుకున్నాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ లేవనెత్తిన ట్రేడ్‌వార్ చర్చతో ప్రపంచ మార్కెట్లలో గుబులు నెలకొంది. ట్రేడ్ వార్‌పై చైనా సీరియస్ అవ్వడంతో ఈ పరిణామాలు దేనికి దారితీస్తాయోనన్న భయం ప్రపంచ మార్కెట్లను వెంటాడింది.

జపాన్ నిక్కీ 0.7 శాతం నష్టపోగా.. ఆసియా పసిఫిక్ జోన్‌లోని ఇతర మార్కెట్లు దాదాపు 0.8 శాతం వరకు కుంగాయి. దక్షిన కొరయా సూచీ కోస్పీ 1.1 శాతం మేర కుంగింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ రూ. 65.09 దరిదాపుల్లో కొనసాగింది. ఎన్ఎస్ఈలో టెక్‌మహీంద్రా, సన్‌ఫార్మా, టీసీఎస్, ఎన్టీపీసీ, యూపీఎల్ లిమిటెడ్ షేర్లు లాభపడగా.. టాటామోటార్స్, హిందాల్కో, అరబిందో ఫార్మా, టాటాస్టీల్, రిలయన్స్ షేర్లు నష్టపోయాయి. టాటామోటార్స్ ఒక్కో షేరు విలువ 5 శాతానికి పైగా పతనమైయ్యాయి.

కొత్త రూపంలో శాంత్రో వచ్చేస్తోంది...!

ధర 3 లక్షల లోపే ఉండే అవకాశం

న్యూఢిల్లీ: చిన్న కార్ల విభాగంగా రారాజుగా వెలుగొందిన హ్యుందాయ్ శాంత్రో కారు కొత్త రూపంలో మార్కెట్లోకి రానుంది. ఒకప్పుడు చిన్న కార్ల విభాగంలో మారుతీ ఆల్టో కారుకు గట్టిపోటీనిచ్చిన శాంత్రో పాపులర్ మోడల్‌ను.. తిరిగి మార్కెట్లోకి తీసుకొచ్చేందుకు హ్యుందాయ్ సన్నద్ధమవుతోంది. వచ్చే దీపావళి పండుగ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని ఏడాది ఆగస్టు నాటికి కొత్త శాంత్రోను హ్యుందాయ్ మార్కెట్లోకి విడుదల చేయనున్నట్టు తెలుస్తోంది. 'ఏహెచ్2' సాంకేతిక నామంతో ఈ కొత్త శాంత్రోను హ్యుందాయ్ రూపొందిస్తోంది. దీని ధర సుమారు రూ.3 లక్షల లోపే ఉండే అవకాశాలు ఉన్నట్టు సమాచారం. ఐ10 ప్లాట్‌ఫామ్ ఆధారితంగా ఇది మార్కెట్‌లోకి రానుంది. 860సీసీ ఇంజన్ 70బీహెచ్‌పీ పవర్, 100 ఎన్ఎం టార్క్యూతో ఈ కొత్త శాంత్రో మార్కెట్లోకి రానుందని సమాచారం. ఆటోమేటెడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ వ్యవస్థ, 5 స్పీడ్ మాన్యువల్ గేర్ బాక్స్ విధానంలో కారు అందుబాటులోకి రానున్నట్టుగా తెలుస్తోంది. వచ్చే ఏడాది నుంచి దేశంలో అమలు కానున్న కొత్త భద్రతా ప్రమాణాల నేపథ్యంలో ఇయాన్ మోడల్ కారును నిలిపివేసి.. దాని స్థానంలో కొత్త శాంత్రోను మార్కెట్లోకి తేవాలన్నది హ్యుందాయ్ ఆలోచనగా తెలుస్తోంది. 2018తో శాంత్రో బ్రాండుకు 20 ఏళ్ల పూర్తవుతుం.. ఈ నేపథ్యంలో కొత్తగా మార్కెట్లోకి తేనున్న హ్యాచ్‌బ్యాక్ పేరును శాంత్రో ట్యాగ్‌తోనే హ్యుందాయ్ అందుబాటులోకి తేనున్నట్టుగా తెలుస్తోంది.

ఆధార్ పేరుతో ఒత్తిడి తేవొద్దు..

బ్యాంక్ అనుసంధాన గడువు పెంచాలి: అసోచామ్

న్యూఢిల్లీ: బ్యాంకు ఖాతాలను ఆధార్ నంబరుతో అనుసంధానం చేసుకునే గడువును పెంచాలని పరిశ్రమ సమాఖ్య అసోచామ్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణం నేపథ్యంలో బ్యాంకింగ్ వ్యవస్థపై ప్రజల్లో ఆందోళనలు పెరిగాయని.. వరుస బ్యాంక్ మోసాల నేపథ్యంలో మరోవైపు బ్యాంకు ఉద్యోగులపై కూడా తీవ్ర ఒత్తిడి నెలకొన్నట్టుగా ఆసోచామ్ తెలిపింది. ఈ నేపథ్యంలో ఆధార్ గడువు ముగింపు పేరుతో వారిని మరింత ఆందోళనకు గురి చేసే కంటే.. ఆధార్ అనుసంధానగడువు తేదీని పెంచితే బాగుంటుందని అసోచామ్ అభిప్రాయపడింది. పీఎన్‌బీ కుంభకోణం తర్వాత బ్యాంకులు తమ కార్యకలాపాలను కాపాడుకునే పనిలో ఉన్నాయని.. ఈ సమయంలో ఆధార్ అనుసంధానం వంటి ప్రక్రియలతో బ్యాంకులపై ఒత్తిడి పెంచడం సరికాదన్న అసోచామ్ అభిప్రాయపడింది. 'పెద్ద నోట్ల రద్దు, జీఎస్‌టీ ప్రభావం నుంచి ఆర్థిక వ్యవస్థ ఇప్పుడిప్పుడే బయటపడుతోందని పేర్కొంది.

ఆల్టోది ఆదే జోరు..

35 లక్షల అమ్మకాలు క్రాస్

న్యూఢిల్లీ: సామాన్యుడి కారుగా మార్కెట్లో తన సత్తా చాటుతున్న మారుతీ ఆల్టో సరికొత్త మైలురాయిని చేరింది. ఈ కారు మొత్తం ఏకీకృత అమ్మకాలు 35 లక్షల మైలు రాయిని దాటేశాయి. గత 14 ఏండ్లుగా దేశీయ మార్కెట్లో అత్యధికంగా అమ్ముడవుతున్న కారుగా ఆల్టో తన సత్తాను చాటుతూనే వస్తోంది. ఈ మోడల్ కార్ల విక్రయాల్లో 2017-18లో దాదాపు ఆరు శాతం వృద్ధి నమోదైనట్టుగా మారుతీ తెలిపింది.

విద్య



ENGLISH PAPER-1

S.S.C.MODEL PAPER

(PART-A&B)

Time: 2.45 Hours - Max Marks: 40

Part - A

Time:1½ Hours Marks: 25

Instructions:

1. **Answer all the questions under Part-A on a seperate answer book.**
2. **Write the answers to the questions under Part-B on the question paper itself.**
3. **Start answering the questions as you read them.**
4. **15minutes of time is alloted exclusively for reading the question paper and 2.30 hours for writing the answers.**
5. **Part-B of the question paper will be supplied along with Part-A at the begining of the examination.**

1. Read the following passage :

Be quiet ! It's ours now. Come Henry, lift your end.

Now, Answer the following questions :

3 × 1= 3

a. Who speaks these words to whom?
b. What does 'it' refer to here?
c. How has 'it' come to 'ours?

2. Read the following lines

"The Apu Trilogy was, in fact, my first portal to West Bengal and its people," he told Frontline. (Rendezvous with Ray)

Now answer the following questions.

2 × 2= 3

a. What is 'Trilgoy?
b. How did the speaker came to know about West Bengal and its people?

3. Read the following passage.

Abel : Why, Ben, you are in mourning! And Lizzie too. And Amelia, and Henry and little Vicky! Who's gone dead? It's someone in the family. (The Dear Deparled - II)

Now answer the following questions.

3 × 1= 3

a. Who is the speaker of these words?
b. Why are Ben and others mourning?
c. Who has gone dead really?

4. Read the following Lines.

So I have learned many things, son.
I have learned to wear many faces
like dresses - home face,
office face, street face, host face,
cocktail face, with all their conforming smiles
like a fixed portrait smile.
(One Upon a Time)

Now, Answer the following questioing :

2×1=2

a. Why has he / she learned to wear many faces?
b. '...... learned to wear many faces. 'What does this expression mean?

5. Read the following passage:

Savitri was human artiste. She was generous to the people who were in need. Once, she donated all the jewellery she was wearing to the Prime Minister's fund. (A Tribute)

Now, Answer the following questioing :

3×1=3

a. What is discussed in the passage?
b. Which of her qualities is mentioned?
c. Why was the 'donation of jewellery' mentioned in the passage?

6. Read the following lines :

'Oh, how tall he is!' sighed the potter. 'I shall never be able to climb onto his back' (The Brave potter)

Now, Answer the following questioing :

2×1=2

a. Who was 'he'?
b. What made to the potter sigh?

7.

a.You have read the lesson, 'My Childhood'. In that lesson, you have read that when Kalam wanted to go to Ramanadhapuram for higher studies, Kalam's mother was heistant. Kalam's father tried to console and comfort her. Write a possible conversation between Kalam's father and his wife in the above context.

(OR)

b. In the lesson 'Attitude is Altitude' you have read that Nick was inspired by a newspaper article about a disabled man who had managed to achieve great things and helped others. Describe the feelings of Nick when he drew the inspiration from the newspaper article. Imagine that were Nick and write the answer in first person narration.

8.

a. You have read the lesson, 'I will Do It'. When IIT entrance results came, Murthy met his father. Imagine you were Narayana Murthy and write an entry in the diary of the day when the IIT results came.

(OR)

In the lesson 'Environment' you have read the views of Wangari Maathai about how wars are fought for the natural resources. Now, write a script for a speach taking the views of Maathai. You have to present this speach on the World Environment Day.

Part – B

Time: 1 Hour Marks:15

Instructions :

1. Answer the questions in 'Part-B' on the paper itself.
2. This part of the question paper should be attached to the Main Answer Book of the student.

9. Edit the following passage correcting the underlined parts


5 × 1/2 = 21/2

The bones in the body <u>is</u> (a) of all shapes and sizes. The **<u>smaller</u>** (b) bone is no long than a grain of rice. The bone is **<u>calling</u>** (c) the stapes, or stirrup, and is deep inside your ear. The stapes carry sound through your ear to the brain so that you can hear. Without it you would be deaf. A fully **<u>grew</u>** (b) person usally **<u>had</u>** (e) 206 bones.

10. Read the following paragraph and fill in the blanks with the correct options given against the number of blanks

5 × 1/2 = 21/2

Humans, as well as most animals, need ------- (a) sleep ------ (b). Sleep restores energy to our body, ------ (c) to our brain ------- (d) nervous system. ------ (e) two kinds of sleep. In one, called the slow-wave sleep, we do not dream. In another, called R.E.M (rapid eye movement), we dream and our brain active.



1. (A) of (B) in
(C) on (D) to
2. (A) alway (B) everday
(C) every week (D) every other day
3. (A) especially (B) rarely
(C) occasionally (D) seldomly
4. (A) There (B) They (C) This (D) T

11. Combine the following sentences using "who" 1

Nick is a motivational speaker. He now lives in Los Angeles.

12. Change the following sentence into Passive Voice.1

Sivasubramania Iyer's wife took Kalam inside her kitchen and served food.

13. Change the following into Reported Speec. 1

'Do you have a pair of old shoes?', asked father.

14. Combine the following sentences using "neither...nor" 1

Jainulabdeen had no formal education and no wealth.

15. Fill in the blanks with suitable preposition given in brackets 2 × 1/2 = 1

a) Mr Ben came to Mr Henry's house .... (in accordance with / along with) his wife, Mrs Elizabeth
b) Roberge used to meet Ray at 9 a.m................ (in/at) Ray's residence on every Sunday.

16. Fill in the blanks with suitable forms of verbs given in brackets 2 × 1/2 = 1

After the Potter .... (give) the letter to his wife he ....(go) to bed.

17. Your friend is not listening to his / her parents. Advise him / her to listen to his / her parents and elders. 1

18. Change the following into a polite request. 1

You to your classmate, "Give me your English notes"

19. Your friend greeted you 'How do you do?' How would you respond. 1

(A) I'm fine (B) Happy
(C) How do you do? (D) Nice

20. (i) It's time you prepared for your exams.

(A) Giving warning (B) Giving advice
(C) Giving information (D) Giving per mission

(ii) Could you please move a bit?

(A) Request (B) Order
(C) Question (D) Suggestion ★

Part -B (Answers)

9. a) are b) smallest
c) called d) grown
e) have
10. 1) D 2) B 3) A 4) A
11. Nick is motivational speaker who now lives in Los Angeles.
12. Kalam was taken inside the kitchen by Subramanyam Iyer's wife and served food.
13. Father asked him whether he had a pair of old shoes.
14. Jainulabedn had neither formal education nor wealth.
15. a) along with b) at
16. a) had given b) went
17. It is better to respect the parents and elders.
18. Could you please give me your English notes
19. I'm fine.
20. a) Giving worning
b) Request

ఉద్యోగాలు

మిధానిలో 40 ఉద్యోగాలు

హైదరాబాద్‌లోని కంచన్‌భాగ్ పరిధిలో కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మిశ్రధాతు నిగమ్ లిమిటెడ్(మిధాని).. 40 ట్రేడ్ అప్రెంటీస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: ట్రేడ్ అప్రెంటీస్. **శిక్షణ వ్యవధి:** ఏడాది.
విభాగాల వారీ ఖాళీలు: ఫిట్టర్-15, ఎలక్ట్రీషియన్-10, మెషినిస్ట్-5, టర్నర్-5, వెల్డర్-5.
అర్హతలు: పదోతరగతితోపాటు సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ.
ఎంపిక: మార్కుల మెరిట్ (ఐటీఐ).
దరఖాస్తు విధానం: అభ్యర్థులు www.apprenticeship.gov.in లేదా www.ncvtmis.gov.inలో వివరాలు నమోదు చేసుకొని, మిధాని ఐడీ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
దరఖాస్తు చివరి తేదీ: మార్చి 10, 2018.
పూర్తి వివరాలు: వెబ్‌సైట్‌లో చూడొచ్చు
వెబ్‌సైట్: www.midhani.com

సాగునీటి కోసం రైతుల రాస్తారోకో

ప్రజాశక్తి - పెనుమంట్ర (పశ్చిమ గోదావరి)

తమ పొలాలకు సాగునీరు అందడం లేదని, సమస్యను పరిష్కరించాలని కోరుతూ పశ్చిమగోదావరి జిల్లా పెనుమంట్ర మండలం చించినాడ కెనాల్ ఆయకట్టు రైతులు సోమవారం రాస్తారోకో, ధర్నా చేశారు. ముందుగా నెగ్గిపూడిలో పెనుగొండ-పాలకొల్లు రహదారిపై బైఠాయించారు. దీంతో పెద్దఎత్తున ట్రాఫిక్ స్తంభించింది. పెనుగొండ సిఐ విజయకుమార్ అక్కడికి చేరుకుని రైతులకు సర్దిచెప్పారు. వివాహాల నేపథ్యంలో ప్రజలకు సహకరించాలని కోరడంతో రైతులు రాస్తారోకో విరమించి నెగ్గిపూడి లాకు వద్ద వరి దుబ్బులు పట్టుకుని ధర్నా నిర్వహించారు. పాలకొల్లు ఇరిగేషన్ ఎఇ పిల్లా సత్యనారాయణ అక్కడికి చేరుకుని రైతులతో మాట్లాడారు. సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



జీపుజాతా

రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని హామీల అమలు కోసం పశ్చిమ గోదావరి జిల్లా నర్సీపట్నంలో కొనసాగుతున్న జీపుజాతాలో మాట్లాడుతున్న అజశర్మ

హోదా కోసం ఉద్యమం

ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ

ప్రజాశక్తి-విశాఖపట్నం

రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని హామీల అమలు కోసం ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ అన్నారు. ప్రత్యేక హోదా, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ, విశాఖకు రైల్వే జోన్, జాతీయ విద్యా సంస్థలకు నిధులు, ఇతర విభజన హామీల సాధన కోసం ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఈ నెల 1న ప్రారంభమైన జీపుజాతా సోమవారం జిల్లాలోని చోడవరం, మాడుగుల, నర్సీపట్నం ప్రాంతాల్లో పర్యటించింది. నర్సీపట్నంలో జరిగిన కార్యక్రమంలో అజశర్మ మాట్లాడుతూ.. రాష్ట్ర విభజన కారణంగా ఎపి అన్యాయమైపోయిందన్నారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్రానికి ప్రత్యేక హోదా తప్ప మరో ప్రత్యామ్నాయం లేదని స్పష్టం చేశారు. హోదా కంటే ప్యాకేజీ మంచిదని నేతలు చెబుతుండటం హాస్యాస్పదమన్నారు. విభజన చట్టంలోని హామీ మేరకు ఉత్తరాంధ్ర అభివృద్ధికి రూ.24 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్రలోని సాగునీటి ప్రాజక్టులతోపాటు పోలవరం ప్రాజెక్టును తక్షణమే పూర్తి చేసి తాగు, సాగు, పరిశ్రమలకు నీటి కొరత లేకుండా చూడాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. విశాఖకు రైల్వే జోన్‌తోపాటు, గిరిజన విశ్వవిద్యాలయం తదితర హామీలను తక్షణం నెరవేర్చాలన్నారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి ఇచ్ఛాపురం నుంచి పాయకరావుపేట వరకు జాపుజాతా చేపట్టినట్లు చెప్పారు.

సమ్మె పరిష్కారంలో ప్రభుత్వ చొరవేది?

- నిరవధిక దీక్షల్లో నాయకుల సూటి ప్రశ్న
- సిఐటియు, ఏఐటియుసి రాష్ట్ర నేతల నిరవధిక దీక్షలు
- పలు ఉద్యోగ, కార్మిక, ఉపాధ్యాయ, ప్రజా సంఘాల మద్దతు
- రెండో రోజుకు చేరిన ఐక్య వేదిక నేతల దీక్షలు
- దీక్ష శిబిరాన్ని సందర్శించిన పిడిఎఫ్ ఎమ్మెల్సీలు, వామపక్ష పార్టీల నాయకులు



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న ఎపి ఎన్‌జిఒ నేత విద్యాసాగర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమ్మె ఉధృతమైంది. గత 14 రోజులుగా సమ్మె కొనసాగుతున్నా ప్రభుత్వం, యాజమాన్యం స్పందించకపోవడంతో కార్మికులు సమ్మెను ఉధృతం చేసేందుకు ఐక్య వేదిక నాయకులు విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద నిరవదిక నిరాహార దీక్షలు చేపట్టి రెండు రోజులయ్యింది. మరోవైపు కార్మికులకు మద్దతుగా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎ గఫూర్, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు రామారావులు సోమవారం నుంచి నిరవధిక నిరాహార దీక్షలు చేపట్టారు. దీంతో అనేక కార్మిక సంఘాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజాసంఘాలు దీక్షా శిబిరానికి విద్యుత్ కార్మికుల సమ్మెకు మద్దతు తెలిపాయి. దీక్షా శిబిరాన్ని ఎపి ఎన్జీఒ నాయకులు విద్యాసాగర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రయత్నించడం లేదన్నారు. కేంద్రం అన్యాయం చేస్తోందంటూ టిడిపి ఎంపీలు పార్లమెంట్‌లో ఆందోళన చేస్తే తప్పు లేనప్పుడు, టిడిపి మ్యానిపెస్టోలో పెట్టిన అంశాన్ని అమలు చేయాలని కార్మికులు ఆందోళన చేస్తే తప్పెలా అవుతుందని ప్రశ్నించారు.. విద్యుత్ కార్మికుల ఆందోళనల్లో అన్ని పార్టీలు ప్రత్యక్షంగా పాల్గొనాలని సూచించారు. ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఒబులేసు మాట్లాడుతూ విద్యుత్ రంగంలో రాష్ట్రానికి ఎన్నో అవార్డులు రావడానికి క్షేత్ర స్థాయిలో కాంట్రాక్టు కార్మికుల కృషి ఎంతో ఉందన్నారు. ఎన్ని బెదిరింపులు ఎదురైనా కార్మికులు రెట్టింపు పట్టుదలతో ఉద్యమాన్ని కొనసాగించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఎమ్మెల్సీ శ్రీనివాసులురెడ్డి, బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ పిడిఎఫ్ ఎమ్మెల్సీల ఫోరం కార్మికుల సమ్మెకు పూర్తి మద్దతు ఇస్తుందన్నారు. ఈ విషయాన్ని శాసన మండలి ఛైర్మెన్ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. సమస్య పరిష్కరించని పక్షంలో సభను జరగనివ్వమని చెప్పామన్నారు. సిఎంను కలిసేందుకు సమయం అడిగితే ఇచ్చే పరిస్థితిలో ఆయన లేరన్నారు. మంత్రులకు ఇదే పరిస్థితి ఎదురవుతుండటం విశేషమన్నారు. ఎమ్మెల్సీ కత్తి నర్సింహారెడ్డి దీక్షా శిబిరానికి హాజరై కార్మికులకు మద్దతు తెలిపారు.. ఎపి ఎన్జీఒ నేత విద్యాసాగర్ మాట్లాడుతూ టిడిపి మ్యానిపెస్టోలో పెట్టిన కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని దశల వారీగా రెగ్యులరైజేషన్ చేస్తామన్న ప్రభుత్వం నాలుగేళ్లవుతున్నా ఇంత వరకూ మొదటి దశ ప్రారంభం కాలేదన్నారు. ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్టు ఉద్యోగులకు జీతాలు 50 శాతం పెంచిన ప్రభుత్వం విద్యుత్ సంస్థల్లో కార్మికులకు ఇదే విధానాన్ని అమలు చేయాలన్నారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు, ప్యాప్టో ఛైర్మెన్ బాబురెడ్డి, ఆర్టీసి ఇయు రాష్ట్ర అధ్యక్షులు వై.వి రావు, మెడికల్ అండ్ సేల్స్ రిప్రెజెంటెటివ్స్ యూనియన్ నాయకులు యు.వి కృష్ణయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి వనజ, బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు అశోక్‌బాబు, ఎన్ఎఫ్‌టిఇ నాయకులు రమణమూర్తి, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్ నాయకురాలు సుబ్బరావమ్మ, హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు సీతారాములు, ఎపి బ్యావరేజ్ కార్పొరేషన్ హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు కొండలరావు, ఎపి శాక్స్ కౌన్సిలర్స్ అండ్ ల్యాబ్ టెక్నిషియన్స్ అసోసియేషన్ అశోక్ తదితరులు మద్దతు తెలిపి ప్రసంగించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబూరావు, ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఆర్.రవీంద్రనాథ్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఉమామహేశ్వరరావు, ఇతర అనేక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కార్మికుడు తిరుపాలు మృతికి నివాళి...

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుడు తిరుపాలు మృతికి ఎపి విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల ఐక్య వేదిక నివాళు లర్పించింది. సోమవారం దీక్షా శిబిరంలో రెండు నిముషాలు మౌనం పాటించి కుటుంబానికి సంతాపం తెలిపారు. కర్నూలుకు చెందిన కార్మికుడు తిరుపాలు సమ్మెలో ఉండగా అధికారులు విధుల్లో చేరాలని తీవ్రమైన వత్తిడి కారణంగా మానసిక వత్తిడికిలోనై కోమాలోకి వెళ్లినట్లు చెప్పారు. చికిత్స నిమిత్తం హైదరాబాదులోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందినట్లు తెలిపారు.

కాంట్రాక్టు కార్మికుడి ఉసురు తీసిన ప్రభుత్వం

అధికారులు, కాంట్రాక్టర్ల వేధింపులతో షాక్‌కు గురై ఫిబ్రవరి 28న కోమాలోకి వెళ్ళిన కర్నూలు జిల్లా డోన్ మండలం చిన్నమల్కాపురం విద్యుత్ సబ్‌స్టేషన్‌కు చెందిన ఆపరేటర్ జి.తిరుపాలు(50) సోమవారం మృతి చెందాడు. ఆందోళనలో భాగంగా సమ్మెలో ఉన్న కాంట్రాక్టు కార్మికుడుని వేధింపులకు గురిచేసి హత్య చేయడాన్ని నిరసిస్తూ విద్యుత్ రంగంలోని కార్మిక సంఘాలన్నీ ఆందోళన బాటపట్టాయి. జెఎసి ఆధ్వర్యంలో కర్నూలు ట్రాన్సుకో కార్యాలయం ఎదుట దాదాపు నాలుగు గంటల పాటు రాస్తారోకో చేశారు. వీరి ఆందోళనకు సిఐటియు, ఎఐటియుసి, వైసిపిలు తమ సంఘీభావం ప్రకటించాయి. ఆందోళనను విరమించాలని పోలీసులు చెప్పినా వినలేదు. ట్రాన్సుకో ఎస్ఇ వచ్చి తిరుపాలు కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా, ఇంట్లో ఒకరికి ఉద్యోగం ఇచ్చే వరకు కదలబోమని రోడ్డుపై బైఠాయించారు. దీంతో ఎస్ఇ భార్గవరాయుడు వచ్చి కార్మిక సంఘాలతో చర్చలు జరిపారు. ఇంట్లో ఒకరికి ఉద్యోగం ఇస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



ఆసుపత్రి ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు

గ్రామీణ వైద్యశాలలను అప్‌గ్రేడ్ చేయాలని విద్యార్థుల ఆందోళన

ప్రజాశక్తి-గన్నవరం (విజయవాడ)

కృష్ణాజిల్లా గన్నవరంలోని బుద్దవరం రోడ్డులో ఉన్న ఎన్‌టిఆర్ పశువైద్యశాలలో వైద్య సేవలను విద్యార్థులు సోమవారం అడ్డుకున్నారు. గ్రామీణ వైద్యశాలలను అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్ చేస్తూ వెటర్నరీ విద్యార్థులు చేపట్టిన ఆందోళన ఐదో రోజుకు చేరింది. పశువుల ఆసుపత్రి మెయిన్ గేటును మూసివేసి వైద్య సేవలను నిలుపుదల చేశారు. తమ ఉద్యమానికి సహకరించాలని పశుపోషకులకు విన్నవించారు. దీంతో విద్యార్థుల ఉద్యమం ప్రశాంతంగా సాగింది. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు యస్వంత్ నాయుడు మాట్లాడుతూ.. వెటర్నరీ విద్యార్థులు, పీజీ వైద్యులు అడుగుతున్న కోర్కెలు అందరికీ ఉపయోగపడేవని తెలిపారు. పశువైద్యశాలలను బలోపేతం చేస్తే పశువులకు మెరుగైన వైద్యం అందుతుందని, తద్వారా పాడిపరిశ్రమ లాభపడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయమని అడుగుతుంటే ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ఇంతకంటే దారుణం మరొకటి ఉండదన్నారు.

నేడు న్యాయవాదుల చలో అసెంబ్లీ

కడపలో 42వ రోజుకు దీక్షలు

ప్రజాశక్తి - కర్నూలు/కడప

రాయలసీమలో హైకోర్టును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ కర్నూలు, అనంతపురం, కడప జిల్లాల్లో ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి.కర్నూలులో నెలన్నర రోజులుగా శాంతియుత ప్రదర్శనలు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో న్యాయవాదులు చలో అసెంబ్లీ ముట్టడికి సోమవారం బయల్దేరారు. బార్ అసోషియేషన్ నాయకులు నాగలక్ష్మిదేవి, సీనియర్ న్యాయవాదులు పి.నిర్మల, వై.జయరాజ్ తదితరుల ఆధ్వర్యంలో పెద్దసంఖ్యలో న్యాయవాదులు గుంటూరుకు తరలివెళ్లారు. కర్నూలు శ్రీకృష్ణదేవరాయల సర్కిల్ వద్దరిలే నిరహార దీక్షలు కొనసాగాయి. నంద్యాలలో 100 మంది న్యాయవాదులు నిరసన ర్యాలీ నిర్వహించి దీక్షల్లో కూర్చున్నారు. ఆయా పాతతాలూకా కేంద్రాల్లోని కోర్టుల పరిధిలో దీక్షలు నిర్వహించారు. కడప జిల్లా కోర్టు ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 42వ రోజుకు చేరుకున్నాయి. సీమ న్యాయవాదుల జెఎసి కన్వీనర్ ఎస్.మస్తాన్‌వలి, ఎపి ట్రెజరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు రవికుమార్ పూలమాలలు వేసి దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలని 42 రోజులుగా న్యాయవాదులు సీమ వ్యాప్తంగా పోరాటం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పందించి సీమలో హైకోర్టును ఏర్పాటు చేసి సీమ ప్రాంత ప్రజలకు న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో పోరాటం మరింత ఉధృతం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. దీక్షల్లో న్యాయవాదులు టి.మల్లికార్జున, ఎం.బాష, సి,ఎస్.లక్ష్మిరెడ్డి, టి.ఆదినారాయణ కూర్చున్నారు. కార్యక్రమంలో కడప బార్ అసోసియేషన్ మహిళా కార్యదర్శి అరుణకుమారి, న్యాయవాదులు పాల్గొన్నారు.

పార్ట్ టైమ్ లెక్చరర్లను రెగ్యులర్ చేయాలని ధర్నా

ప్రజాశక్తి-గాంధీనగర్ (విజయవాడ)

ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో పార్ట్ టైమ్ లెక్చరర్స్‌గా పని చేస్తున్న వారిని రెగ్యులర్ చేయాలని విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ.. సమస్యలు పరిష్కరించాలని స్థానిక ధర్నా చౌక్ వద్ద ఉద్యోగులు చేపట్టిన రిలే దీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. వారికి మద్దతుగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎయిడెడ్ కళాశాలల్లో ఉద్యోగ విరమణతో అయిన ఖాళీలను ప్రభుత్వం భర్తీ చేయకపోవడంతో కళాశాలల యాజమాన్యం పార్ట్ టైమ్ లెక్చరర్లను నియమించుకుని వారికి కనీస వేతనాలు ఇవ్వకుండా వెట్టిచాకిరీ చేయిస్తున్నాయన్నారు. జిఒ నెంబరు 35ను వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు ఎమ్మెల్సీలు వి.బాల సుబ్రహ్మణ్యం, ఆర్.సూర్యారావు, శ్రీనివాసులరెడ్డి, కత్తి నరసింహారావు మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో ఏపి ఎయిడెడ్ కాలేజెస్ పార్ట్‌టైం టెంపరరీ అన్‌ఎయిడెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు విల్లా రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి వివి సంజీవరావు, ఉపాధ్యక్షుడు అంబేద్కర్, కోశాధికారి ఎం.నవీన్, బి.వెంకటరత్నం, ప్రేమ్‌కుమార్, ఎం.కుటుంబరావు, డి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పార్ట్ టైమ్ లెక్చరర్ల దీక్షలకు మద్దతు తెలుపుతున్న ఎమ్మెల్సీలు

31లోపు రిజర్వేషన్లు ఇవ్వకపోతే పోరాటమే : ముద్రగడ

ప్రజాశక్తి-నరసాపురం (పశ్చిమ గోదావరి)

మార్చి 31 నాటికి కాపు రిజర్వేషన్లు అమలు చేయకపోతే కులపరంగా, రాజకీయపరంగా ఏ విధంగా పోరాడాలనే అంశంపై ఏప్రిల్‌లో నిర్ణయం తీసుకుంటామని కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలో నిర్వహించిన కాపు నేతల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ప్రజ్ఞ

జవాబులు

1. ఈజిప్టు రాజధాని కైరోలో (మార్చి 6 నుంచి 12 రోజులు)
2. శతఘ్నుసిన్హా 3. ఆగోందా బీచ్ (గోవా)
4. మొత్తం మహిళా సిబ్బందిని కలిగివున్న రైల్వే స్టేషన్‌గా.
5. ఆర్మేన్ వర్దాని సర్కిసియన్

రొయ్యల చెరువు తవ్వకాన్ని నిలిపివేయాలని ధర్నా

ప్రజాశక్తి - గుడివాడ (కృష్ణా)

దళిత కాలనీకు ఆనుకుని అక్రమంగా రొయ్యల చెరువు తవ్వకాలన్ని నిలుపుదల చేయాలని కోరుతూ కృష్ణాజిల్లా గుడివాడ మండలం పర్నాస గ్రామస్తులు సోమవారం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. కల్వపూడి అగ్రహారానికి చెందిన కొందరు దేవాలయ భూముల్లో అక్రమంగా చెరువు తవ్వకాలను చేపట్టారని గ్రామస్తులు తెలిపారు. దీంతో తామందరం కలిసి వెళ్ళి తవ్వకాలను నిలిపివేశామన్నారు. రొయ్యల చెరువు తవ్వితే దళిత కాలనీ మొత్తం ఖాళీ అవుతుందని, ఎకరాకు 40బస్తాలు పండే పంట భూముల్లో చెరువు తవ్వకానికి అనుమతులివ్వడం దారుణమన్నారు. రెవెన్యూ, మత్స్య శాఖ అధికారులు అడ్డగోలుగా అనుమతులిచ్చారని ఆరోపించారు. వెంటనే తవ్వకాలను ఆపాలని, అనుమతులను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు.

హోదా పోరు

ప్రత్యేక హోదా పోరు ఉధృతం

రాష్ట్రవ్యాప్తంగా వామపక్షాలు, వైసిపి నిరసనలు

ప్రజాశక్తి-యంత్రాంగం

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని కోరుతూ ఢిల్లీలో ఆందోళనలు ప్రారంభం కావడంతో రాష్ట్రంలో ఉద్యమ తీవ్రత పెరిగింది. వామపక్షాలు, వైసిపి, పలు ప్రజాసంఘాల ఆధ్వర్యాన రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు, ప్రదర్శనలు, రిలే నిరాహార దీక్షలు సోమవారం నిర్వహించారు. విశాఖలో టిడిపి ఆందోళన చేసింది. ఆందోళనల్లో నేతలు మాట్లాడుతూ ప్రజా ఉద్యమం ద్వారా హోదా సాధించుకుందామని, హోదా వచ్చే వరకూ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

పశ్చిమగోదావరి జిల్లా పోడూరులో సిపిఎం ఆధ్వర్యాన రిలే నిరాహార దీక్షలు మూడోరోజుకు చేరాయి. తాడేపల్లిగూడెంలో వామపక్షాల ఆధ్వర్యాన హెడ్‌పోస్టాఫీసు వద్ద ధర్నా నిర్వహించారు. నిడదవోలులో ప్రత్యేక హోదా సాధన సమితి ఆధ్వర్యాన నిడదవోలు రైల్వేస్టేషన్ వద్ద ధర్నా చేశారు. వీరవాసరంలో రిలే దీక్షల శిబిరాన్ని సిపిఎం నాయకులు జుత్తిగ నర్సింహమూర్తి ప్రారంభించి, మాట్లాడారు. జిల్లా వికలాంగుల సమాఖ్య ఆధ్వర్యాన తూర్పుగోదావరి జిల్లా కాకినాడ కలెక్టరేట్ వద్ద రిలేదీక్షలు నిర్వహించారు. దీక్షలను ఎన్‌జిఒల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బూరిగ ఆశీర్వాదం ప్రారంభించారు. సిపిఎం జిల్లా, నగర కార్యదర్శులు కెఎస్ శ్రీనివాస్, సిహెచ్ అజయ్‌కుమార్, వాలంటరీ బ్లడ్ బ్యాంక్ ఛైర్మన్ జ్యోతుల వెంకటేశ్వరరావు, జనసేన నాయకులు ఎం.విజయగోపాల్, ఎస్ఎఫ్ఐ నాయకులు తదితరులు మద్దతు తెలిపారు. అఖిలపక్షం ఆధ్వర్యాన కృష్ణాజిల్లా కంకిపాడు, పెనమలూరు మండలాల నాయకులు రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. పెనమలూరులో సిపిఎం తూర్పు కృష్ణా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.హరిబాబు, వైసిపి ఫ్లోర్ లీడర్ హాజరై, మాట్లాడారు. విజయవాడలో శాప్ మాజీ ఛైర్మన్ సిఆర్ మోహన్ తలకిందులుగా నిరసన తెలిపారు. 'ప్రత్యేక హోదా, హామీల అమలు సాధన సమితి' ఆధ్వర్యాన ప్రకాశం జిల్లా ఒంగోలు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. సాధనసమితి జిల్లా నాయకులు షంషేర్ అహ్మద్ అధ్యక్షత వహించారు. బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న ఈ సమయంలోనే కేంద్రంపై హోదా కోసం ఒత్తిడి తీసుకరావాలని సిపిఎం తూర్పు జిల్లా కమిటీ కార్యదర్శి పూనాటి ఆంజనేయులు డిమాండ్ చేశారు. సిపిఐ ఎంఎల్ జిల్లా నాయకురాలు లలితకుమారి, సిపిఐ జిల్లా కార్యదర్శి యంయల్ నారాయణ, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి చిటిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఢిల్లీలో వైసిపి నేతల అరెస్టుకు నిరసనగా తిరుపతి నగర వైసిపి అధ్యక్షుడు పాలగిరి ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యాన ఆ పార్టీ స్థానిక కార్యాలయం నుంచి క్యాండిల్ ర్యాలీ చేశారు. కర్నూలు జిల్లాలో సిపిఎం, వైసిపి ఆధ్వర్యాన నిరాహార దీక్షలు జరిగాయి. కర్నూలులో వైసిపి నాయకుల దీక్షలకు సిపిఎం రాష్ట్ర నాయకులు టి.షడ్రక్ తదితరులు సంఘీభావం తెలిపారు. అనంతపురం జిల్లావ్యాప్తంగా వామపక్షాల ఆధ్వర్యాన ఆందోళనలు చేశారు. బుక్కపట్నం, బత్తలపల్లి, రాయదుర్గంలో రిలే దీక్షలు చేపట్టారు. ప్రత్యేక హోదా, రైల్వే జోన్ ఇవ్వాలని కోరుతూ టిడిపి ఆధ్వర్యాన విశాఖలో ఎనిమిది బోగీల బొమ్మ రైలుతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖ దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ, రైల్వేజోన్ ఇస్తామని ఆంధ్ర ప్రజలను నాలుగేళ్లుగా మోసం చేస్తున్న మోడీ మెడలు వంచుతామని అన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో టిడిపి ఎంపీల నిరసనకు మద్దతుగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.



విజయవాడలో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలదండలు వేస్తున్న శాప్ మాజీ ఛైర్మన్ మోహన్

కనీస వేతనాలు దక్కని ఉబర్, లిఫ్ట్ డ్రైవర్లు

ఎంఐటి అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ : ఉబర్, లిఫ్ట్ డ్రైవర్లలో మెజారిటీ డ్రైవర్లు కనీస వేతనాల కన్నా చాలా తక్కువ మొత్తంలో సంపాదిస్తున్నారని మసాచుసెట్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటి) తెలిపింది. ఎంఐటి నిర్వహించిన కొత్త అధ్యయనంలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. రైడ్ షేరింగ్ యాప్‌ల ద్వారా ఈ కంపెనీల డ్రైవర్ సగటున గంటకు 3.37 డాలర్లు సంపాదిస్తాడు. అది కూడా పన్నులేవీ చెల్లించకముందు. దాదాపు 74శాతం మంది డ్రైవర్లు వారి వారి రాష్ట్రాల్లోని కనీస వేతనాల కన్నా తక్కువే సంపాదిస్తున్నారని ఆ అధ్యయనంలో వెల్లడైంది. ఈ రెండు కంపెనీలకు చెందిన డ్రైవర్లకు వారి వేతనాలు పెంచుకోవడానికి పరిమితమైన మార్గాలే వున్నాయని అధ్యయనం పేర్కొంది. ఒక డ్రైవరు మరో డ్రైవరు ఎంత సంపాదిస్తున్నాడో తెలుసుకోవాలని అనుకున్నా ఆ సమాచారం దొరికే మార్గం లేదు.




అరాచకం । దక్షిణ త్రిపుర జిల్లాలోని బెలోనియాలో లెనిన్ విగ్రహాన్ని కూలదోస్తున్న బిజెపి కార్యకర్తలు

త్రిపురలో కొనసాగుతున్న బిజెపి గూండాల దాడులు

అగర్తల: త్రిపుర ఎన్నికల్లో తమకు అనుకూల ఫలితాలు వెల్లడైన నేపథ్యంలో ఆ రాష్ట్రంలోని పలు చోట్ల బిజెపి, సంఘ్‌పరివార్ గూండాలు రెచ్చిపోతున్నారు. బిజెపి, వేర్పాటువాద ఐపిఎఫ్‌టి కూటమి నూతన ప్రభుత్వం ఏర్పాటు చేయకముందే పలు పట్టణాల్లో సంఘ్‌పరివార్ గూండాలు దౌర్జన్యకాండకు పాల్పడుతున్నాయి. వామపక్ష కార్యకర్తలపై దాడులు, సిపిఎం కార్యాలయాలను తగులబెడుతున్నాయి. వామపక్ష కార్యకర్తల ఇళ్లపై, పార్టీ కార్యాలయాలపై దాడులకు పాల్పడి విధ్వంసం సృష్టిస్తున్నారని, తమ కార్యకర్తలపై హింసకు పాల్పడి భయాందోళనలకు గురి చేస్తున్నారని సిపిఎం ఎంపి శంకర్‌ప్రసాద్‌దత్తా తెలిపారు. దక్షిణ త్రిపుర జిల్లాలోని బెలోనియాలో లెనిన్ విగ్రహాన్ని కూడా కాషాయ గూండాలు నేలమట్టం చేశారు అగర్తలలోని రామ్‌నగర్, దక్షిణ రామ్‌నగర్‌సహా బిషాల్‌ఘర్, అమరేంద్రనగర్,మోహన్‌పూర్, సబ్రూమ్, మేలాఘర్, ఖోవాయి, జిరానియా, ఖోమ్‌లంగ్, బెలోనియా పట్టణాల్లో ఈ దాడులు చేశారు.

అనూహ్య ధనబలం, మీడియా నిరంతర దాడి

త్రిపురలో ఓటమిపై మాణిక్ సర్కార్



అగర్తల : అనూహ్యమైన ధనబలం, మీడియాలో నిరంతర దాడి ఫలితమే అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ ఓటమికి కారణమైందని త్రిపుర ఆపధర్మ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ అన్నారు. ఈ ఫలితాన్ని తాము ఊహించలేదని, రాష్ట్రంలో వామపక్ష ప్రభుత్వాన్ని కూలదోసేందుకు బీజేపీ ఎలాంటి కుట్రలు పన్నిందో త్రిపుర ప్రజలే కాదు, దేశప్రజలు కూడా గమనించారని చెప్పారు. పశ్చిమ బెంగాల్ సీపీఐ(ఎం) అధికారపత్రిక గణశక్తికి ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు. ఎంఎన్‌ఆర్‌ఈజీపీ, హౌసింగ్, తదితర పథకాలకుగాను రాష్ట్రానికి కేంద్ర కేటాయింపుల్లో భారీ కోత విధించడం ద్వారా ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొనేలా చేసిందని విమర్శించారు. 'ఈ ఎన్నికల్లో వామపక్షపార్టీలు తమ శక్తివంచనలేకుండా పోరాడాయి.. అనూహ్యమైన ధన బలం, మీడియా యొక్క నిరంతర దాడికి వ్యతిరేకంగా ఎదురొడ్డి పోరాడారు' అన్నారు. 'త్రిపుర ఎన్నికల్లో ఓటమిని సమీక్షించుకుంటాం. అన్ని ప్రాంతాల నుంచి పూర్తి వివరాలను సేకరించి విశ్లేషిస్తాం' అని మాణిక్ సర్కార్ చెప్పారు. 'వామపక్ష వ్యతిరేక శక్తులను బీజేపీ-ఇండిజినస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర (ఐపీఎఫ్‌టీ) కూటమి తమ వైపు తిప్పుకోగలిగింది. వామపక్షాలకు 45 శాతం ఓట్లు వచ్చాయి. ఇంతకుముందు మేం సంపాదించిన ఓట్లలో కొంత భాగం కూడా బీజేపీ-ఐపీఎఫ్‌టీ కూటమికి అనుకూలంగా పడ్డాయన్నది నిజమే. ఇలా ఎందుకు జరిగిందో మేం సమీక్షించుకుంటాం' అని సర్కార్ చెప్పారు. విచ్ఛిన్నకర ఎజెండాకు వ్యతిరేకంగా సీపీఐ(ఎం) పోరు కొనసాగుతుందని స్పష్టం చేశారు. 'ఫలితాల అనంతరం వామపక్ష కార్యకర్తలపై జరుగుతున్న దాడులు, పార్టీ కార్యాలయాలను తగులబెట్టడం ప్రారంభమైంది. బీజేపీకి ఓటు వేసిన ప్రజలు ఎన్నికల తర్వాత రాష్ట్రంలో ఇటువంటి వాతావరణాన్ని కోరుకోలేదు' అన్నారు. 'ఇప్పుడైనా ఇలాంటి దాడులను నిలిపివేయాలి. బిజెపి-ఐపీఎఫ్‌టీ పార్టీ నాయకత్వం ఈ దాడులను ఆపేలా సానుకూల చర్యలు తీసుకుంటుందని మేం ఆశిస్తున్నాం" అని మాణిక్ సర్కార్ చెప్పారు.

'టాటా' సంస్థ విద్యార్థులకు ఐద్వా మద్దతు

ఇండియా న్యూస్ నెట్‌వర్క్, న్యూఢిల్లీ : దేశంలో వివిధ ప్రాంతాల్లోని టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్స్ (టిఐఎస్ఎస్) ప్రాంగణాల్లో ఆందోళన చేస్తున్న విద్యార్థులకు అఖిల భారత ప్రగతిశీల మహిళా సంఘం (ఐద్వా) సంఘీభావం ప్రకటించింది. భారత ప్రభుత్వ పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ స్టూడెంట్లు (జిఓఐ-పిఎంఎస్)తో సహా విద్యార్థులందరూ ఫీజులు తప్పనిసరిగా చెల్లించాలని టిఐఎస్ఎస్ పరిపాలన విభాగం ఏకపక్షంగా, హఠాత్తుగా ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండించింది. ఈ అన్యాయమైన ఈ నిర్ణయం ఎస్సి-ఎస్టి- ఒబిసి వర్గాలకు చెందిన విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపింది. ముఖ్యంగా ఉన్నత చదువుల కోసం టిఐఎస్ఎస్ విద్యాసంస్థలకు చేరుకున్న ఈ వర్గాలకు చెందిన పేద విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని ఆవేదన వ్యక్తం చేసింది. ఇలాంటి నిర్ణయాలు విద్యను ప్రైవేటీకరించడానికేనని ఐద్వా ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నిర్ణయాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఐద్వా డిమాండ్ చేసింది.

తెలంగాణ విభజన హామీలపై పిటిషన్ రెండు వారాలకు వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీబ్యూరో

విభజన చట్టంలో తెలంగాణకు పొందుపరిచిన హామీలను అమలు చేసే విధంగా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని సుప్రీంకోర్టులో ఓ పిటిషన్ దాఖలైంది. పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన సర్వోన్నత న్యాయస్థానం... విచారణను రెండు వారాల పాటు వాయిదా వేసింది. విభజన హామీలపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి సుప్రీంకోర్టులో ఓ రిట్ పిటిషన్ దాఖలు చేశారు. గత వ్యాజ్యాలు విభజన చట్టాన్ని సవాల్ చేశాయని, కానీ తాము అమలు చేసేలా ఆదేశించాలని కోరుతున్నామని న్యాయవాది శ్రవణ్ వివరించారు. అయితే చట్టం అమలు చేసే బాధ్యత ప్రభుత్వానిది కదా అని ధర్మాసనం ప్రశ్నించింది. ఒకవేళ ప్రభుత్వం తన బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించకపోతే అందుకు అనుగుణంగా ఆదేశించే అధికారం సుప్రీంకోర్టుకు ఉంటుందని శ్రవణ్ తెలిపారు. ఈ సందర్భంగా గతంలోని పలు తీర్పులను చదివి వినిపించారు. దీంతో పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన ధర్మాసనం... వ్యాజ్యం కాపీలను ప్రతివాదులకు అందజేయాలని ఆదేశించింది.

ముంబయిలోనే మరో స్కాం..

447 కంపెనీలు రూ.3200 కోట్ల పన్ను ఎగవేత

ముంబయి: ఒక్క ఏడాది కాలంలోనే ముంబయికి చెందిన 447 కంపెనీలు రూ.3200 కోట్ల పన్నును ఎగవేసినట్టు ఆదాయం పన్నుశాఖ గుర్తించింది. ప్రతినెలా టీడీఎస్(ట్యాక్స్ డిడక్షన్ ఎట్ సోర్స్) పేరుతో కంపెనీలు తమ ఉద్యోగుల జీతాలకు కోత పెట్టి ప్రభుత్వానికి చెల్లించాలి. అయితే,ఉద్యోగుల నుంచి వసూలు చేసిన ఈ పన్నును ఆయా కంపెనీలు ప్రభుత్వానికి చెల్లించకుండా తమ వ్యాపారాలకు ఉపయోగించినట్టు తెలుస్తోంది. టీడీఎస్ విభాగం ఇప్పటికే పన్నులు చెల్లించని కంపెనీలపై చర్యలు ప్రారంభించినట్టు ఓ అధికారి తెలిపారు. పన్నులు ఎగ్గొట్టినవారిలో ఎక్కువగా బిల్డర్లు ఉన్నట్టు తెలుస్తోంది. వారిలో ఒకరు రాజకీయాలతో సంబంధమున్న వ్యక్తి అని, రూ.100 కోట్లమేర ఉద్యోగుల నుంచి వసూలు చేసి ప్రభుత్వానికి చెల్లించకుండా తన వ్యాపారానికి ఉపయోగించారని తెలుస్తోంది. ఎగవేతకు పాల్పడినవారిలో సినీ నిర్మాణ సంస్థలు, మౌలిక వసతుల కల్పనా సంస్థలు, స్టార్టప్ కంపెనీలు ఉన్నట్టు అధికార వర్గాల సమాచారం. ఓడరేవు అభివృద్ధి సంస్థలో భాగమైన ఓ కంపెనీ రూ.14 కోట్లు, ఐటీ సొల్యూషన్స్‌కు చెందిన మరో కంపెనీ రూ.11 కోట్లమేర ఎగవేతకు పాల్పడ్డాయి. ఇప్పటికే కొందరికి వారెంట్లు జారీ అయ్యాయని అధికారులు తెలిపారు.



సోమవారం చెన్నైలోని ఒక ప్రైవేట్ వైద్య కళాశాలలో విద్యార్థులతో రజనీకాంత్. రాజకీయ ప్రవేశ ప్రకటన తరువాత రజనీకాంత్ తొలిసారి పాల్గొన్న బహిరంగ సమావేశం ఇదే కావడం విశేషం

స్వతంత్ర పనితీరుతోనే పార్టీ మరింత బలోపేతం

- పోరాట సామర్థ్యాన్ని పెంచుకుంటున్నాం
- సిపిఎం పశ్చిమ బెంగాల్ రాష్ట్ర మహాసభల ప్రారంభ సభలో సీతారాం ఏచూరి



మహాసభలో మాట్లాడుతున్న సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి

ప్రజాశక్తి ప్రతినిధి, కోల్‌కతా:

స్వతంత్ర పనితీరుతోనే జాతీయ స్థాయిలో పార్టీ మరింత బలోపేతమవుతుందని, పోరాట సామర్థ్యాన్ని పెంచుకుంటోందని సిపిఎం జాతీయప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పేర్కొన్నారు. సోమవారం ఇక్కడ సిపిఎం పశ్చిమ బెంగాల్ 25వ మహాసభలను ఏచూరి ప్రారంభించారు. సిపిఎం ప్రధాన కార్యాలయం మహాసభలకు ఆతిధ్యమిచ్చింది. ముందుగా ఏచూరి అరుణ పతాకాన్ని ఆవిష్కరించి అమరవీరుల స్మారక స్థూపం వద్ద పుష్పగుచ్ఛం వుంచి నివాళులర్పించారు. అనంతరం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బిమన్ బసు, ప్రకాశ్ కరత్, రాష్ట్రకమిటీ కార్యదర్శి డా.సూర్యకాంత మిశ్రా, ఎంఎ బేబి, బృందాకరత్ తదితరులు అమరవీరులకు నివాళులర్పించారు.

అనంతరం ఏచూరి ప్రారంభోపన్యాసం చేస్తూ, అరుణపతాకచ్ఛాయలోనే సామాజిక మార్పు సాధ్యమని స్పష్టం చేశారు. నయా ఉదారవాద విధానాలు, మతోన్మాద శక్తుల దాడులు పార్లమెంటునే కాక సామాన్యుల రాజ్యాంగ హక్కులను సైతం కాలరాస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. కేంద్ర ప్రభుత్వం సామ్రాజ్యవాద అమెరికా తొత్తుగా మారుతూ ప్రజల జీవితాలను ప్రమాదపుటంచులకు నెడుతున్నదన్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు, ప్రస్తుత అణచివేత ప్రభుత్వాన్ని మార్చేందుకు పార్టీ ఉద్యమిస్తుందన్నారు. కేంద్రంలో ప్రస్తుతం అధికారంలో వున్న ఎన్డీయే ప్రభుత్వం నయా సరళీకరణ విధానాలను దూకుడుగా అమలు చేస్తూ పెద్ద నోట్ల రద్దు వంటి ప్రమాదకరమైన చర్యలు చేపట్టిందన్నారు. ప్రస్తుతం అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న సమయంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన నోట్ల రద్దు చర్య అటు శ్రామిక వర్గంతో పాటు ఇటు బడుగు వర్గాలను కూడా ఇక్కట్ల పాలు చేసిందన్నారు. గుజరాత్‌లో చట్టసభలను నిర్లక్ష్యం చేసి ప్రజా వ్యతిరేక పాలన సాగించిన మోడీ ప్రస్తుతం అదే తరహాలో పార్లమెంట్‌ను నిర్లక్ష్యం చేస్తున్నారని ఏచూరి విమర్శించారు. భారతీయ తత్వశాస్త్రం స్థానంలో హిందూ మత సిద్ధాంతాలు, పురాణాలు ప్రాచుర్యం పొందుతున్నాయని, కేంద్ర ప్రభుత్వం ఈ అసంబద్ధమైన విధానాన్ని ప్రోత్సహిస్తోందని అన్నారు. స్వేచ్ఛాభిప్రాయం వెలువరించే పౌరులకు స్థానం కుదించుకుపోతోందని, ప్రభుత్వం నిఘా వ్యవస్థగా మారిపోయిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తృణమూల్ కాంగ్రెస్ సారధ్యంలోని బెంగాల్ ప్రభుత్వం పోటీ మతోన్మాదాన్ని ప్రోత్సహిస్తూ రాష్ట్రంలో లౌకిక వాతావరణాన్ని భగ్నం చేస్తోందని, మైనార్టీ ఛాందసవాద శక్తులను బుజ్జగించే విధానంతో రాష్ట్రంలో మతోన్మాదానికి ఆజ్యం పోస్తోందని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం జరుగుతున్న పార్టీ మహాసభలు రాష్ట్రంలో పార్టీకి పూర్వవైభవాన్ని సాధించేందుకు దోహదపడతాయని భావిస్తున్నామని, ప్రజాబలంతో పార్టీని సంపూర్ణ విప్లవ పార్టీగా తీర్చిదిద్దుతామని ఏచూరి చెప్పారు. ఈ మహాసభల నేపథ్యంలో పార్టీ శ్రేణులు అనేక కార్యక్రమాలు చేపట్టాయి. రాష్ట్ర మహాసభలకు నగరం మూడు ప్రాంతాలనుండి భారీ ర్యాలీలలో కార్యకర్తలు తరలి వచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన సెమినార్లలో ఏచూరితోపాటు ప్రకాశ్‌కరత్, బృందాకరత్ తదితర అగ్రనేతలు ప్రసంగించారు. కార్ల్‌మార్క్స్ ద్విశత జయంత్యుత్సవాలు, అక్టోబర్ విప్లవ శతవార్షికోత్సవాల నేపథ్యంలో సిపిఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఫొటో ఎగ్జిబిషన్‌లు ఏర్పాటయ్యాయి.

త్రిపురలో వేర్పాటు కుంపటి

(మొదటిపేజీ తరువాయి)

తెలిసిందే. అయితే ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి ఈ పార్టీతో బాహాటంగానే పొత్తు కుదుర్చుకోవటం గమనార్హం. ప్రత్యేక రాష్ట్ర డిమాండ్‌తో గత ఏడాది జులైలో త్రిపురను దేశంలోని ఇతర ప్రాంతాలతో కలిపే జాతీయ రహదారిని దిగ్బంధించిన ఉద్యమం హింసాత్మకంగా మారిన విషయం తెలిసిందే. తరువాత కేంద్రం ఐపిఎఫ్‌టి నేతలను ఢిల్లీ ఆహ్వానించటంతో వారు అక్కడ పెద్దలతో భేటీ అయ్యారు. కేంద్రం నుండి హామీలు లభించటంతో వర్మ తమ జాతీయ రహదారి దిగ్బంధన కార్యక్రమాన్ని ఉపసంహరించుకున్నారు. జాతీయ వాదం, దేశభక్తి అంటూ నినాదాలు చేస్తున్న బిజెపి ఈ వేర్పాటు వాద సంస్థతో కుమ్మక్కయి గత ఏడాది చివరి నాటికి ఎన్నికల దోస్తీ ఖరారు చేసుకుంది. ప్రత్యేక రాష్ట్రాన్ని డిమాండ్ చేస్తున్న ఈ సంస్థకు జాతి వ్యతిరేక శక్తులయిన వేర్పాటు వాద సంస్థలతో సంబంధాలున్న విషయం తెలిసిందే. గిరిజనుల సమస్యలను పరిశీలించేందుకు ఉన్నతాధికార కమిటీని ఏర్పాటు చేస్తామని బిజెపి ఐపిఎఫ్‌టి నేతలకు భరోసా ఇచ్చింది. ఇటీవలి త్రిపుర ఎన్నికల మేనిఫెస్టోలో సైతం బిజెపి ఈ విషయాన్ని ప్రస్తావించింది. ఐపిఎఫ్‌టి మాత్రం ఈ అంశాన్ని ఎన్నికల అనంతరం పరిశీలిస్తామని కేంద్రం తమకు హామీ ఇచ్చినట్లు చెబుతోంది. ఈ డిమాండ్‌పైనే ఐపిఎఫ్‌టి తన మొత్తం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించింది. 'మాకున్నది ఒకే ఒక్క డిమాండ్. ప్రచార అజెండా కూడా అదే, ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలన్నదే ఆ డిమాండ్. ప్రభుత్వంలో భాగంగా వున్నప్పటికీ మేం ఈ డిమాండ్‌ను కొనసాగిస్తాం. వాస్తవానికి మా పోరును ఉధృతం చేస్తాం' అని ఈ నెల 3న ఎన్నికల ఫలితాల వెల్లడి అనంతరం ఒక మీడియా సంస్థకిచ్చిన ఇంటర్వ్యూలో దేవ్‌వర్మ పేర్కొన్నారు. కాగా బిజెపి మాత్రం తన మిత్రపక్షం డిమాండ్‌ను ఏ మాత్రం ప్రస్తావించకుండానే తన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించింది. తమ మిత్రపక్షం కేవలం వేర్పాటు వాద డిమాండ్‌పైనే ఓట్లు అడుగుతోందన్న విషయం తెలిసినప్పటికీ కమలదళం తాము రాష్ట్ర విభజనకు అనుకూలం కాదన్న సంకేతాలను వెలువరించింది. ఇప్పుడు ప్రచార పర్వంతో పాటు ఎన్నికల పర్వం కూడా ముగిసి కూటమి విజయం సాధించి గద్దెనెక్కేందుకు సిద్ధమైంది. ఐపిఎఫ్‌టి పార్టీ ఎమ్మెల్యేలలో కొందరు మంత్రులు కూడా కావచ్చు. అధికార గద్దెపైకి ఎక్కనున్న ఈ సంస్థ తన డిమాండ్‌కోసం ఈ అవకాశాన్ని ఏ మాత్రం ఉపయోగించుకుంటుందన్న విషయం ఆసక్తికరంగా మారుతోంది. ఈ డిమాండ్‌కే ప్రభుత్వ ప్రాధాన్యతనిస్తే అది ఆదివాసీ వర్గాలకు బెంగాలీలకు మధ్య చిచ్చు పెట్టటం ఖాయం. దీనితో పాటు వివిధ వేర్పాటు వాద గ్రూపులు కూడా క్రియాశీలకంగా మారేందుకు ఇది అవకాశం కల్పిస్తుంది. దీనిని వ్యతిరేకిస్తున్న వారు ప్రధానంగా త్రిపురలో వామపక్షాలపై హింసకు పాల్పడేందుకు ఈ వేర్పాటు వాదులకు అధికారం మరింత అండగా నిలుస్తుందనటంలో సందేహం అవసరం లేదు. ఇప్పటికే వామపక్ష కార్యాలయాలు, కార్యకర్తలపై దాడులు జరుగుతున్నాయన్న వార్తలు వెలువడుతున్నాయి. ఇక భవిష్యత్తంతా హింసాత్మకమైన చీకటి రోజుల మయమేనని పలువురు భావిస్తున్నారు.

గౌరవప్రదమైన పదవులివ్వకపోతే వెలుపలి నుండే మద్దతు : ఐపిఎఫ్‌టి

మిత్రపక్షమైన బిజెపిపై ఐపిఎఫ్‌టి ఒత్తిడి పెంచింది. రాష్ట్ర మంత్రివర్గంలో తమకు గౌరవప్రదమైన పదవులు ఇవ్వకపోతే కొత్త ప్రభుత్వానికి వెలుపలి నుండే మద్దతిస్తామని ఐపిఎఫ్‌టి అధ్యక్షుడు ఎన్.సి.దేవ్‌వర్మ స్పష్టం చేశారు. 'గౌరవప్రదమైన' అనే పదానికి వివరణ ఇస్తూ, కేబినెట్‌లో తమకు దామాషా ప్రాతినిధ్యం (తమ బలానికి అనుగుణంగా) లభించాలని చెప్పారు. అలాగే ప్రధాన శాఖలను తమకు కేటాయించాలని కోరారు. ఈ రెండూ జరగకపోతే తాము కొత్త ప్రభుత్వానికి బయటి నుండే మద్దతిస్తామని తెలిపారు. అసెంబ్లీలో తమ ఎంఎల్‌ఎలకు విడిగా బ్లాక్ ఇవ్వాలని కూడా కోరనున్నట్లు చెప్పారు. ఐపిఎఫ్‌టి డిమాండ్‌పై బిజెపి నాయకత్వం ఎలాంటి వ్యాఖ్య చేయలేదు. మంగళవారం బిజెపి, ఐపిఎఫ్‌టి ఎంఎల్‌ఎల సంయుక్త సమావేశం జరుగుతుందని, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ హాజరవుతారని రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు విప్లవ్ దేవ్ తెలిపారు.

'పిఎన్‌బి' కుంభకోణంలో నలుగురు అధికారులు అరెస్టు

న్యూఢిల్లీ : పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణంలో నిందితులైన నీరవ్‌మోడీ, చోక్సీలకు సంబంధించిన నలుగురు ఉద్యోగులను అరెస్టు చేసినట్లు సిబిఐ అధికారులు వెల్లడించారు. నీరవ్‌మోడీ గ్రూపు కంపెనీలకు చెందిన ఆడిటర్, ముగ్గురు ఉద్యోగులను అరెస్టు చేశారు. అలాగే చోక్సీకి చెందిన గీతాంజలి గ్రూపు సంస్థల డైరెక్టర్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. నీరవ్‌మోడీ ఫైర్‌స్టార్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కంపెనీకి చెందిన మనీష్ కె. బొసామియా (ఎజిఎం), ఆర్థిక నిర్వాహకుడు మిల్టెన్ అనిల్ పాండ్యాలను పంజాబ్ నేషనల్ బ్యాంకుకు సమర్పించిన మోసపూరిత లెటర్స్ ఆఫ్ అండర్ టేకింగ్స్ (ఎల్‌ఓయుఎస్)కు దరఖాస్తులు సమర్పించిన నేపథ్యంలో అరెస్టు చేసినట్లు తెలిపారు. అలాగే ఆడిటర్ సంజయ్ రాంభియా, వారి సహాయకులు సంపత్, మెహతాలను కూడా విచారణ అధికారులు అరెస్టు చేసినట్లు తెలిపారు. మెహుల్ చోక్సీకి చెందిన కంపెనీ 'గిలి ఇండియా' డైరెక్టర్ అనియత్ శివరామన్ నాయర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. నిందితులు నీరవ్‌మోడీ, మెహుల్ చోక్సీలు పంజాబ్ నేషనల్ బ్యాంకు నుండి మోసపూరితంగా (తాజాగా వెలువడిన లెక్కలతో కలిపి) రూ. 12,600 కోట్లు దోచుకున్న సంగతి తెలిసిందే.

వామపక్ష ఉద్యమాలు మరింత బలపడాలి : జై రాం రమేష్

తిరువనంతపురం : దేశంలో వామపక్ష ఉద్యమాలు మరింత బలపడాల్సిన అవసరం ఉందని సీనియర్ కాంగ్రెస్ నేత జయరాం రమేష్ పేర్కొన్నారు. కేరళలోని ఆర్కిటెక్చర్ లూరీ బేకర్ శత జయంతి వేడుకల సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ వామపక్షాలు బలహీనపడటం దేశానికి హానికరమని తెలిపారు. తాము రాజకీయ ప్రత్యర్థులమైనప్పటికీ, వామపక్షాల ప్రభావం తగ్గడాన్ని ఆమోదించలేకపోతున్నామని తెలిపారు. దీనిపై వామపక్షాలు తమ విధానాలను మార్చుకోవలసిన అవసరం ఉందని పేర్కొన్నారు. త్రిపురలో వామపక్షాల ఓటమి అనంతరం ఈ వ్యాఖ్యలు చేశారు.

'సీనియర్ రాజకీయ నేత'కు రూ. 1.8 కోట్లు : ఈడీ

న్యూఢిల్లీ: పలుకుబడి ఉన్న ఓ 'సీనియర్ రాజకీయ నేత' ఖాతాలోకి కార్తీ చిదంబరం రూ.1.8 కోట్ల బదిలీ చేశారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) తాజాగా ఆరోపించింది. చెన్నైలోని రాయల్ బ్యాంక్ ఆఫ్ స్కాట్లాండ్(ఆర్‌బీఎస్)లోని కార్తీ ఖాతా నుంచి ఆ సీనియర్ రాజకీయ నాయకుడి ఖాతాకు డబ్బులు బదిలీ చేశారని తెలిపింది. 2006-09 మధ్య మొత్తం ఐదు దఫాలుగా డబ్బు బదిలీ అయ్యిందని ఈడీ పేర్కొంది. ఆరోపిత సీనియర్ రాజకీయ నాయకుడు దశాబ్ద కాలంగా కేంద్రంలో వివిధ హోదాల్లో పదవులు చేపట్టినట్టు సమాచారం. అయితే విచారణకు ఆటంకం ఏర్పడుతుందన్న ఆందోళనతో ఆరోపిత నాయకుడి పేరును బహిర్గతం చేయడానికి ఈడీ వెనుకాడుతున్నట్టు సమాచారం. తాజా ఆరోపణల నేపథ్యంలో ఆ సీనియర్ నాయకుడిని రప్పించాలని ఈడీ నిర్ణయించింది. విదేశీ పెట్టుబడుల విషయంలో ఐఎన్‌ఎక్స్ మీడియాకు అనుమతులు ఇచ్చే విషయంలో లంచం తీసుకున్నాడన్న ఆరోపణల నేపథ్యంలో గతేడాది మేలో కార్తీ పై ఎఫ్‌ఐఆర్ నమోదైంది.

ప్రత్యేకం

1.78 లక్షల అధ్యాపక పోస్టులు గల్లంతు

- ఎఐసిటిఈ నూతన నిష్పత్తి అమలు ఫలితం
- వ్యతిరేకిస్తున్న ఉపాధ్యాయ సంఘాలు
- ఈ నెల 9న పిటిషన్ విచారణ

న్యూఢిల్లీ : వృత్తి విద్యా వ్యవస్థ సంక్షోభంలో పడనుంది. ప్రైవేట్ ఇంజనీరింగ్, ఎంబిఎ, హోటల్ మేనేజ్‌మెంట్, ఇతర వృత్తివిద్యా కోర్సుల్లో 1.78 లక్షల ఉపాధ్యాయుల పోస్టులు గల్లంతు కానున్నాయి. ప్రస్తుతం ఈ సంఖ్యలో ఉన్న ఉపాధ్యాయులు తమ ఉద్యోగాలు కోల్పోనున్నారు. ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఎఐసిటిఈ) కొత్తగా ప్రకటించిన ఫ్యాకల్టీ- స్టూడెంట్ నిష్పత్తి ప్రకారం వీరంతా తమ ఉద్యోగాలు కోల్పోనున్నారు. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఈ కోర్సుల ఉపాధ్యాయులంతా సుప్రీంకోర్టును కోరారు. ఈ పిటిషన్‌ను కోర్టు ఈ నెల 9న విచారించనుంది.

గతంలో 1:15 ఉండే ఫ్యాకల్టీ- స్టూడెంట్ నిష్పత్తిని ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఎఐసిటిఈ) ఇటీవల సవరించింది. ప్రైవేట్ మరియు స్వయం ఆర్థిక వనరులు కల బి.ఈ, బి.టెక్, బి. ఆర్కిటెక్, ఎంబిఎ, ఎంసిఎ, హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల్లో ఈ నిష్పత్తిని 1:20 గా కొనసాగిస్తూ, డిప్లమో ఇన్ ఇంజనీరింగ్ కోర్సుల్లో 1:25గా మార్చింది.

నూతన నిష్పత్తిని ఉపసంహరించుకోవాలని, స్టే ఇవ్వాలని తమిళనాడులోని ప్రైవేట్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (పిఈఐఈఎ), తెలంగాణ సెల్ఫ్‌ఫైనాన్సింగ్ కాలేజ్ టీచర్స్ అసోసియేషన్ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశాయి. ఎఐసిటిఈ నూతన నిష్పత్తిని అమలుచేస్తే 1.78 లక్షల మంది ఉపాధ్యాయులు నిరుద్యోగులుగా మారతారని పిటిషన్‌లో పిఈఐఈఎ పేర్కొంది. కేవలం ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల్లోనే ఒక లక్ష మంది ఉద్యోగాలు కోల్పోతారని తెలిపింది. ఈ నిష్పత్తి మార్పు నిర్ణయాన్ని అమలు చేస్తే విద్యావిదానం లోపభూయిష్టంగా మారుతుందని, దేశం నుంచి భారీగా మేధోవలస జరుగుతోందని తెలిపింది. ఉపాధ్యాయుల కొరత కారణంగా భవిష్యత్‌లో విద్యార్థులు బి.ఈ, బి.టెక్ కోర్సుల్లో చేరడానికి ఇష్టపడరని తెలిపింది. అలాగే ఉద్యోగాలు కోల్పోతారనే ఆందోళనలకు గురిచేసి తక్కువ జీతానికే పనిచేయాలని ఉపాధ్యాయులను విద్యాసంస్థలు భయపెట్టే అవకాశం ఉందని హెచ్చరించింది. ప్రపంచంలో ఏ దేశంలోనూ ఇలాంటి నిష్పత్తిని అమలుచేయడం లేదని వెల్లడించింది. దేశంలో సుమారు 3 వేల ప్రైవేట్ మరియు స్వయం ఆర్థిక వనరుల ఉన్న కాలేజీలు ఉన్నాయి. వీటిలో ఎక్కువ శాతం ఒకటి లేదా అర దశాబ్దం నుంచి అనుమతించారు. ఇంజనీరింగ్ పట్టభద్రులకు నిరుద్యోగులుగా ఉండటం ఇంజనీరింగ్ విద్యపై అసక్తి లేకుండా చేస్తుందని పిటిషన్ తెలిపింది.

1:15 నిష్పత్తినే అనేక ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలు అమలు చేయలేదని, తనిఖీల్లో నకిలీ సిబ్బందిని నియమించుకునేవారని ఎఐసిటిఈ అధ్యక్షుడే తెలిపారని పిటిషన్‌లో గుర్తుచేశారు. నిజానికి ప్రైవేట్ కాలేజీలకు అనుకూలంగా ఉండడానికే ఎఐసిటిఈ ఈ నూతన నిష్పత్తిపై దృష్టిపెట్టిందని పిటిషన్ అరోపించింది. విద్యాసంస్థల బ్యాంకు స్టేట్‌మెంట్లతో సరిచూస్తూ ఫ్యాకల్టీల సాలరీ పెయిడ్ స్టేట్‌మెంట్లను ఎఐసిటిఈ ఎప్పుడూ తనిఖీ చేయలేదని పిటిషన్‌లో విమర్శించారు.ఎఐసిటీఈ 2015-16 విద్యా సంవత్సరం నివేదికల ప్రకారం వివిధ సంస్థల్లో 7 లక్షల మంది సిబ్బంది పనిచేస్తున్నారని, దీన్ని కనీసం 5 లక్షల మందిగా తీసుకున్నా ఈ నూతన నిష్పత్తి ప్రభావం ఈ 5 లక్షల మంది కుటుంబాలపై పడుతుందని తెలిపింది.

సంక్షిప్తం

15 లోగా వీలు కల్పించండి : యుఐడిఎఐ సూచన

న్యూఢిల్లీ: వినియోగదారులు తమ సిమ్‌కార్డులు ఆధార్‌తో లింకయిందీ లేనిదీ తెలుసుకునే వెసులుబాటును కల్పించాలని ఆధార్ అధీకృత సంస్థ (యుఐడిఎఐ) టెల్కోలకు సూచించింది. మొబైల్ ఫోన్ సిమ్ కార్డులకు ఆధార్ కార్డును అనుసంధానించే గడువు ఈ నెలాఖరుతో ముగియనున్న నేపథ్యంలో యుఐడిఎఐ ఈ సూచన చేసింది. కొంతమంది రిటైలర్లు, వారి ఏజెంట్లు సిమ్‌ల విక్రయంలోనూ, వాటి రీ వెరిఫికేషన్‌లోనూ ఆధార్ గుర్తింపు సౌకర్యాన్ని దుర్వినియోగం చేస్తున్నట్లు వార్తలు వెలువడుతున్న నేపథ్యంలో యుఐడిఎఐ ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

ప్రజల తీర్పును గౌరవిస్తాం : రాహుల్

న్యూఢిల్లీ: ఈశాన్య రాష్ట్రాలు త్రిపుర, మేఘాలయ, నాగాలాండ్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలిచ్చిన తీర్పును తాము వినమ్రంగా స్వీకరిస్తున్నామని, వారి తీర్పును గౌరవిస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ చెప్పారు. 'కాంగ్రెస్ పార్టీ ఈశాన్య రాష్ట్రాల ప్రజలిచ్చిన తీర్పును గౌరవిస్తోంది. వారి విశ్వాసాన్ని తిరిగి గెల్చుకోవటానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి వుంది. ఈ ఎన్నికల్లో పార్టీ విజయం కోసం శ్రమించిన ప్రతి ఒక్కరికీ, కాంగ్రెస్ కార్యకర్తలకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు' అని ఆయన సోమవారం నాడు ట్విట్టర్‌లో పోస్ట్ చేసిన ఒక ట్వీట్‌లో పేర్కొన్నారు.

ఎస్‌ఎస్‌సి లీకేజ్‌పై దర్యాప్తునకు రాజ్‌నాథ్ ఆదేశం

న్యూఢిల్లీ: గత నెలలో స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్‌ఎస్‌సి) నిర్వహించిన ఉద్యోగ నియామకాల పరీక్ష ప్రశ్నాపత్రం లీకేజ్ కేసును కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ)కి అప్పగిస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. ఈ మేరకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని హోం మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చెప్పారు. సోమవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ ఈ ప్రశ్నాపత్రం లీకేజ్‌పై నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగార్థుల డిమాండ్లను ప్రభుత్వం ఆమోదించిందన్నారు.

బహ్రెయిన్‌లో 116మంది షియా మిలిటెంట్లు అరెస్టు

బహ్రెయిన్ : బహ్రెయిన్‌లో షియా మిలిటెంట్లు లక్ష్యంగా సాగిన పోలీసు దాడుల్లో శనివారం 116మందిని అరెస్టు చేశారు. బహ్రెయిన్ అధికారులను, భద్రతా సిబ్బందిని, కీలకమైన సంస్థలు, ప్రాంతాలను లక్ష్యంగా చేసుకోవడానికి వారు కుట్ర పన్నారని పేర్కొంటూ వారి వద్ద నుండి తుపాకులు, పేలుడు పదార్థాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

సౌదీ బలగాల సాయంతో 2011లో ప్రజాస్వామ్య అనుకూల ప్రదర్శనలను కర్కశంగా అణచివేసినప్పటి నుండి క్రమం తప్పకుండా దాడులు నిర్వహించడం, అరెస్టులు చేయడం కొనసాగుతున్నాయి.

క్యూ కట్టిన సాయం



అమెరికా ప్రేరేపిత ఉగ్రవాదుల దాడులతో అతలాకుతలమౌతున్న సిరియాలోని డెమాస్కస్ శివారు ప్రాంతమైన తూర్పు ఘౌటాలో సహాయందించేందుకు వెళుతున్న రెడ్ క్రాస్ అంతర్జాతీయ కమిటీ (ఐసిఆర్‌సి) వాహనాలు

తూర్పు ఘౌటాలో పోరు కొనసాగిస్తాం : అసద్

డెమాస్కస్ : సిరియాలోని డెమాస్కస్ నగర శివార్లలోని తూర్పు ఘౌటాలో తిష్ట వేసిన రెబల్స్‌కు వ్యతిరేకంగా సైనిక చర్య ఇకపై కూడా కొనసాగుతుందని సిరియా అధ్యక్షులు బషర్ అల్ అసద్ ప్రకటించారు. తమ సైన్యం ఇప్పటి వరకూ తూర్పు ఘౌటాలో తిరుగుబాటు సాయుధుల ఆధీనంలో వున్న 36 శాతం ప్రాంతాలను విముక్తి చేసిందన్నారు.

మిగిలిన ప్రాంతాలనూ పూర్తిగా విముక్తి చేసే వరకూ పోరు కొనసాగిస్తామన్నారు. ఈ ప్రాంతాల్లోని ప్రజలను డెమాస్కస్‌లో వున్న ప్రభుత్వ ఆధీనంలోని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తామని చెప్పారు. పౌరులు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లటానికి వీలుగా తూర్పు ఘౌటాలో మానవతాపరమైన పాక్షిక విరామాన్ని అమలు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. రోజుకు ఐదు గంటల సేపు కొనసాగే ఈ విరామం అనంతరం 'ఉగ్రవాదుల'ను పూర్తిగా తరిమివేసే వరకూ సైనిక చర్య యధాతథంగా కొనసాగుతుందన్నారు.



టర్కీలో అమెరికా ఎంబసీ మూసివేత

ఇస్తాంబుల్: భద్రతాపరమైన ముప్పు పొంచి వున్నట్లు సమాచారం అందటంతో సోమవారం టర్కీలోని అమెరికా రాయబార కార్యాలయం మూతపడింది. ఈ మేరకు అమెరికా దౌత్య కార్యాలయం తన వెబ్‌సైట్‌లో ఒక ప్రకటనను విడుదల చేసింది. అయితే ఆ ముప్పు ఏమిటన్న వివరాలను పేర్కొనలేదు. ముప్పును తొలగించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారని, ముప్పు తొలగిన వెంటనే దౌత్య కార్యాలయాన్ని పునఃప్రారంభించి సేవలందిస్తామని తెలిపింది. 2013లో అంకారాలోని అమెరికా రాయబార కార్యాలయం ఎదుట ఆత్మాహుతి దాడి చేసిన విషయం తెలిసిందే.

పోలెండ్‌లో భవనం కూలి 24 మందికి గాయాలు

పోలెండ్ : పోలెండ్‌లోని పశ్చిమ ప్రాంత నగరమైన పోజ్నమ్‌లో నాలుగు అంతస్తుల భవనం కూలిపోవడంతో 24మంది గాయపడ్డారని పోలీసులు తెలిపారు. ఆ భవనంలో 18 ఫ్లాట్‌లు వుండగా వాటిలో 40మంది నివసిస్తున్నారు. శిథిలాల కింద ఇంకా ఎవరైనా వున్నారేమో అనే అనుమానంతో సహాయక బృందాలు గాలింపు జరుపుతున్నాయి. భవనం ఎందుకు కుప్పకూలిందో కారణం తెలియరాలేదు.

6.5 శాతం వృద్ధి రేటు లక్ష్యం

- కోటిమందికి దారిద్ర్య విముక్తి
- రక్షణ బడ్జెట్ పెంపు
- చైనా పార్లమెంట్ వార్షిక సమావేశంలో ప్రధాని లీ కెకియాంగ్ వెల్లడి

బీజింగ్ : ఈ సంవత్సరంలో దాదాపు 6.5శాతం వృద్ధిరేటును సాధించాలని, కోటి మంది ప్రజలను దారిద్ర్యం నుండి బయటపడవేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చైనా సోమవారం ప్రకటించింది. నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ (పార్లమెంట్) వార్షిక సమావేశంలో చైనా ప్రధాని లీ కెకియాంగ్ మాట్లాడుతూ, గత ఐదేళ్ళ కాలంలో సాధించిన విజయాలను వివరించారు. అలాగే మరో ఏడాది కాలానికి చేపట్టే అభివృద్ధి కార్యకలాపాల ప్రణాళికను ఆవిష్కరించారు. తన కార్యకలాపాల నివేదిను ఈ సమావేశంలో ఆయన సమర్పించారు. చైనా స్థూల దేశీయోత్పత్తి (జిడిపి)ని 6.5శాతానికి పెంచాలని భావిస్తున్నట్లు తెలిపారు. నిరోద్యోగిత రేటును 5.5శాతాని కన్నా తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. చైనా బడ్జెట్‌లో 8.1శాతాన్ని సైనిక వ్యయానికి కేటాయించనున్నట్లు తెలిపారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలకు దీటుగా వుండేలా తమ సాయుధ బలగాలను తీర్చిదిద్దాలన్నది బీజింగ్ లక్ష్యమని పేర్కొన్నారు. సైనిక వ్యయం కింద 17,500కోట్ల డాలర్లు కేటాయిస్తున్నట్లు మీడియాకు అందిన నివేదికను ఉటంకిస్తూ జిన్హువా పేర్కొంది. గతేడాది చైనా తన బడ్జెట్‌లో రక్షణ రంగానికి ఏడు శాతం నిధులను కేటాయించింది. పటిష్టమైన నావికా, వైమానిక బలగాల నిర్మాణంపై దృష్టి కేంద్రీకరించాలని భావిస్తున్నట్లు లీ చెప్పారు. చైనా ఇప్పటికే ఐదవ తరానికి చెందిన జె-20 స్టెల్త్ యుద్ధ విమానాలను తన



ఆయుధాగారంలో ప్రవేశపెట్టింది. అణు శక్తితో నడిచే ఇంజన్‌ను ఉపయోగించి మూడవ విమాన వాహక నౌక నిర్మించాలని చైనా యోచిస్తున్నట్లు వార్తలందాయి. అమెరికాతో సాగుతున్న వాణిజ్య యుద్ధం పట్ల ఆందోళన వ్యక్తం చేసిన లీ, చైనా జాతీయ భద్రతా వాతావరణంలో మౌలిక మార్పులు వస్తున్నాయన్నారు. సైనిక శిక్షణ, యుద్ధ సంసిద్ధత వంటి అన్ని అంశాలకు సంబంధించి ప్రపంచ స్థాయిలో చైనా సాయుధ బలగాలను తీర్చి దిద్దాలన్నది తమ లక్ష్యమని చెప్పారు. తద్వారా జాతీయ సార్వభౌమాధికారం, భద్రత, అభివృద్ధి ప్రయోజనాలన్నింటినీ పరిరక్షించుకోగలుగుతామని అన్నారు. చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి, సెంట్రల్ మిలటరీ కమిషన్ (సిఎంసి) నాయకత్వంతో పిఎల్‌ఎ ఇప్పటికే పటిష్టమైన ప్రపంచ స్థాయి సైనిక శక్తిగా ఎదిగిందని లీ పేర్కొన్నారు. చైనా సముద్ర జలాల హక్కులను పరిరక్షించడంలో, తీవ్రవాదంపై పోరు సల్పడంలో, సామాజిక భద్రతకు హామీ కల్పించడంలో తన శక్తిసామర్థ్యాలను రుజువు చేసుకుందన్నారు. తవినూత్న చొరవలతో కూడిన అత్యంత నాణ్యమైన ఆర్థిక వ్యవస్థకు చైనా మారేందుకు అనుగుణంగానే కొత్త బడ్జెట్ కేటాయింపులు వున్నాయని చెప్పారు.

వేర్పాటువాద కార్యకలాపాలు సహించం

స్వయం పాలిత ప్రాంతం తైవాన్‌లో ఎటువంటి వేర్పాటు కార్యకలాపాలు చేపట్టినా తాము సహించబోమని చైనా ప్రభుత్వం హెచ్చరించింది. తాము పవిత్ర ప్రాంతంగా భావిస్తున్న తైవాన్ ద్వీపాన్ని ప్రధాన భూభాగంతో పునరేకీకరణ చేసే లక్ష్యంతో చైనా ప్రాదేశిక సమగ్రతను పరిరక్షించుకుంటామని ప్రధాని లీకెకియాంగ్ పార్లమెంట్‌లో చేసిన ప్రారంభోపన్యాసంలో స్పష్టం చేశారు. తైవాన్, అమెరికా మధ్య అధికారిక సంబంధాలు ఊపందుకుంటున్నట్లు వస్తున్న వార్తలపై చైనా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో పార్లమెంట్‌లో ప్రధాని చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

పిఎల్‌ఎలో సైనికేతర సిబ్బంది కుదింపు

చైనా సైనిక సంస్కరణల్లో భాగంగా సైనికేతర సిబ్బందిని పెద్ద సంఖ్యలో కుదించినట్లు పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పిఎల్‌ఎ) ఒక నివేదికలో పేర్కొంది. బలగాల పోరాట సామర్థ్యాన్ని, నాణ్యతను మెరుగుపరిచేందుకు ఈ చర్య తీసుకున్నట్లు చైనా సైనిక నిపుణులు పేర్కొన్నారు. దీంతో పిఎల్‌ఎ పదాతి బలగాల రోజువారీ నిర్వహణ, శిక్షణ వంటి అంశాల్లో తీవ్ర మార్పులు వచ్చాయని ఆ నివేదిక పేర్కొంది. సైనిక రంగానికి చెందని వారి సంఖ్యను గణనీయంగా తగ్గించడం వల్ల యుద్ధ రంగంలో పాల్గొనే బలగాల శక్తి సామర్థ్యాలను మరింత పెంచడానికి, పటిష్టపరచడానికి మరిన్ని వనరులు కేటాయించే అవకాశం వుంటుందని చైనా మిలటరీ నిపుణుడు సాంగ్ ఝూంగ్‌పింగ్ గ్లోబల్ టైమ్స్‌కు తెలిపారు.

ఉక్కుపై సుంకాలకు అమెరికా సమర్థన

వాషింగ్టన్ : ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై ప్రతిపాదిత సుంకాలను అమెరికా వాణిజ్య మంత్రి విల్బర్ రాస్ సమర్థించుకున్నారు. రెండో ప్రపంచ యుద్ధం ముగిసినప్పటి నుండి చైనా, జర్మనీ వంటి దేశాలకు అన్ని రకాల రాయితీలను ఇస్తూ వస్తున్న దశాబ్దాల నాటి విధానాన్ని సరిదిద్దడానికి ఇది సాయపడుతుందని అన్నారు. ఈ చర్య వల్ల అమెరికా ఉత్పత్తులపై యురోపియన్ దేశాలు సుంకాలు విధించే అవకాశం వుందంటూ వ్యక్తమవుతున్న ఆందోళనలను ఆయన తోసిపుచ్చారు. రెండో ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత తాము ఏకపక్షంగా అన్ని రకాల రాయితీలను వదులుకున్నామని, యుద్ధం కలిగించిన విధ్వంసం నేపథ్యంలో యూరప్, ఆసియాలను పునర్నిర్మించడానికి అది మంచి విధానమై వుండవచ్చునని రాస్ మీడియాతో అన్నారు. ఆనాటి కాలంలోని తమ వాణిజ్య ప్రతినిధులు చేసినవి అప్పటికి సరైనవే అయివుండవచ్చునని కానీ అవి అలాగే కొనసాగడం మంచిది కాదని తాము భావిస్తున్నామని చెప్పారు. చైనా, జర్మనీ వంటి ఆ దేశాలు ఇప్పుడు చాలా పటిష్టమైన ఆర్థిక వ్యవస్థలను కలిగివున్నాయని అన్నారు. ఈ టారిఫ్ ప్రతిపాదనలపై వచ్చే వారం ట్రంప్ సంతకాలు చేయనున్నారు.

ఈజిప్ట్‌లో సౌదీ యువరాజు పలు ఒప్పందాలపై సంతకాలు?

కైరో : సౌదీ అరేబియా యువరాజు మహ్మద్ బిన్ సల్మాన్ ఆదివారం ఈజిప్ట్‌కు చేరుకున్నారు. గతేడాది యువరాజు అయిన తర్వాత రాజకీయ, ఆర్థిక రంగ ప్రక్షాళనకు చర్యలు చేపట్టిన నేపథ్యంలో మొదటిసారిగా ఆయన విదేశీ పర్యటనకు వచ్చారు. మూడు రోజుల పాటు కైరోలో వుండి అధ్యక్షుడు



అబ్దుల్ ఫత్తా అల్ శిశితో సమావేశమవుతారు. కైరోతో సౌదీ యువరాజు పలు ఒప్పందాలను కుదుర్చుకుంటారని భావిస్తున్నారు. అనంతరం 7వ తేదీన బ్రిటన్ వెళతారు. ఈ నెల చివరిలో అమెరికాలో పర్యటిస్తారు. ప్రాంతీయ అంశాలపై చర్చించడానికి, తీవ్రవాదంపై పోరు సల్పడానికి గల మార్గాలను అన్వేషించడానికి రావాల్సిందిగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా ఈజిప్ట్ అధ్యక్షుడిని ఆహ్వానించారని ఈజిప్ట్ అధ్యక్ష కార్యాలయం ప్రకటించింది. 2013లో శిశి అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఈజిప్ట్, సౌదీల మధ్య సంబంధాలు పటిష్టమయ్యాయి. సౌదీ అరేబియాకు రెడ్ సీ దీవులు బదిలీ చేసే ఒప్పందానికి ఎదురైన చట్టపరమైన సవాళ్ళన్నింటినీ యువరాజు కైరో రావడానికి ముందు రోజు ఈజిప్ట్ అత్యున్నత కోర్టు కొట్టివేసింది.

మొదటి పేజీ తరువాయి

గవర్నర్ 'హోదా'పైనే చర్చంతా

ఇరుకున పెట్టినట్లుగా ఉందని ఇంకొంతమంది వ్యాఖ్యానించారు. సాధారణంగా గవర్నర్ ప్రసంగ పాఠాన్ని ప్రభుత్వమే తయారు చేయడం, దానిని యథా తథంగా గవర్నర్ వినిపించడం జరుగుతున్న నేపథ్యంలో తాజాగా గవర్నర్ హెూదా మాటల ప్రభావం కేంద్రంపై ఎంతవరకు పడుతుందన్నది కూడా చర్చనీయాంశంగా ఉందని కొందరు ఎమ్మెల్యేలు అభిప్రాయపడ్డారు. బిజెపి సభ్యులు మాత్రం గవర్నర్ చేసిన హెూదా ప్రసంగంపై స్పందించేందుకు ఆసక్తి చూపించలేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా గవర్నర్ ప్రసంగంలోని హెూదా, ఇతర ప్రయోజనాల అంశాలను ప్రస్తావిస్తూ, ఆయన అభిప్రాయాలను కూడా కేంద్రానికి వివరించాలని ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడుకు సూచించారు. బిజెపి జాతీయ అధ్యక్షులు అమిత్‌షా, ఇతర కేంద్ర ప్రముఖులతో జరిగే భేటీలో పాల్గొనేందుకు ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు ఢిల్లీకి వెళ్లారు. అంతకు ముందు ఆయన శాసనసభలో ముఖ్యమంత్రితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఢిల్లీ భేటీలో అనుసరించాల్సిన వ్యూహంపై ఆయన మాట్లాడినట్లు సమాచారం. రాష్ట్రంలో ఉన్న పరిస్థితులను కేంద్రానికి స్పష్టంగా వివరించాలని, హెూదా కోసం రాష్ట్ర ప్రజలు చేస్తున్న ఆందోళనను కూడా చెప్పాలని సూచించారు. ఇదే సమయంలో ఢిల్లీలోనే ఉన్న తెలుగుదేశానికి చెందిన కేంద్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులతో కూడా చంద్రబాబు ఫోన్‌లో మాట్లాడారు. వారికి కూడా హెూదాపై, రాష్ట్ర ప్రయోజనాలపై పట్టు వీడవద్దని స్పష్టం చేసినట్లు సమాచారం.

ఇదిలావుండగా శాసనసభలో అనుసరించాల్సిన వ్యూహంపైనా వ్యూహ కమిటీ సభ్యులతో చంద్రబాబు చర్చించారు. ప్రధాన ప్రతిపక్షం సభలో లేకపోయినప్పటికీ, తాజా పరిణామాలతో ప్రతిపక్షంగా మారిన మిత్రపక్షం బిజెపి సభ్యులతో ఎలా వ్యవహరించాలన్న కోణంలోనూ చర్చ జరిగినట్లు తెలిసింది. ఢిల్లీలో జరిగే పరిణామాలు, ఉద్యమాలపై శాసనసభలో చర్చ లేకుండా చూస్తే మంచిదన్న భావాన్ని కొంతమంది ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిసింది. దీనివల్ల బిజెపి సభ్యులు మాట్లాడేందుకు అవకాశం లేకుండా చూడవచ్చునన్న భావం కూడా చర్చలో వెల్లడైనట్లు తెలిసింది.

8న బడ్జెట్

ముద్దుకృష్ణమ నాయుడికి మంగళవారం సంతాపం తర్వాత సభను వాయిదా వేయనున్నారు. గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బుధవారం ఉదయం చర్చను ప్రారంభిస్తారు. గురువారం బడ్జెట్ ప్రతిపాదించిన అనంతరం 9,10,11 తేదీల్లో మూడు రోజులపాటు విరామం ఉంటుంది. తిరిగి 12 నుండి 15వ తేదీ వరకూ బడ్జెట్‌పై చర్చించనున్నారు. మళ్లీ 16,17,18 సెలవుల అనంతరం 19వ తేదీ నుండి జరిగే సమావేశాల్లో విభాగాల వారీగా కేటాయింపులపై చర్చించనున్నారు. 28వ తేదీన ద్రవ్య వినియోగపు బిల్లుతో సమావేశాలు ముగియనున్నాయి. ఈ సమావేశాల్లో అధికార పక్షం మొత్తం 24 అంశాలను లేవనెత్తాలని నిర్ణయించింది. బిజెపి కూడా 15 అంశాలను ప్రతిపాదించగా వాటిలో ఏడు ఒకే విధంగా ఉండటంతో వాటిని కలిపేశారు. ముఖ్యంగా విభజన హామీలు, హోదాపైనే టిడిపి, బిజెపి దృష్టి సారించనున్నాయి. దీంతోపాటు రాజధానికి నిధుల వెచ్చింపుపై బిజెపి పట్టుబడుతోంది. అసలు ఎంత ఖర్చు చేశారనే అంశంపై బిజెపి తరుపున చర్చించనున్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థుల ఆత్మహత్యలు, ఉద్యోగ కల్పన, నిరుద్యోగ భృతి, తదతర అంశాలనూ బిజెపి ప్రతిపాదించింది. దీనికి ప్రభుత్వమూ అంగీకరించింది. దీంతోపాటు విశాఖ సమ్మిట్, సిఎం విదేశీ పర్యటనలు, పోలవరం ప్రాజెక్టు, ఐటి కంపెనీలు, ఉద్యోగాలు, రైతు రుణమాఫీ, రియల్ టైం గవర్నెన్స్, 2019 నాటికి పది లక్షల ఇళ్ల నిర్మాణం, ఎస్‌సి, ఎస్‌టి, బిసి సంక్షేమం, పింఛన్లు, రోడ్లు, సదుపాయాలు, ఆదరణ, పెళ్లి కానుక, గ్రామీణ ఉపాధి హామీ తదితర అంశాలపై అధికారపక్షం చర్చించనుంది. ప్రతిపక్షం హాజరు కాకపోవడంతో అధికారపార్టీ సభ్యులే ప్రశ్నలు లేవనెత్తడం, వారే సమాధానం చెప్పడం అనే విధంగా సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. బిజెపి కూడా ఈసారి లేవనెత్తే అంశాలపైనే చర్చించేందుకు సిద్ధంగా ఉండాలని టిడిపి మంత్రులు, ఎమ్మెల్యేలకు సూచించింది.

జూడాలతో సమ్మె తాత్కాలిక వాయిదా

జిఒ నెంబరు 18ని విడుదల చేసిందన్నారు. గత ఏడాది ఆగస్టు నుంచి ఈ గౌరవ తేదనాలు పెంపు వర్తిస్తోందన్నారు. సీనియర్ రెసిడెంట్స్‌కు రూ.33 వేల నుంచి 45 వేలకు, సూపర్ స్పెషాలిటీ వైద్యులకు రూ.41 నుంచి రూ.55 వేలకు గౌరవ వేతనాలను పెంచినందుకు ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రికి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపినట్లు వెల్లడించారు.

ఢిల్లీ వీధుల్లో ఏపి గర్జన

మొదటి పేజీ తరువాయి

పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ కార్యక్రమాలకు బిజెపి ఎంపీలు హాజరుకాలేదు. పార్లమెంట్ స్ట్రీట్‌లోని సంసద్ మార్గ్‌లో వైసిపి ధర్నా చేపట్టింది. ఈ ధర్నాకు సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శులు పి.మధు, కె.రామకృష్ణ, సిపిఐ నేత ముప్పాళ్ల నాగేశ్వరరావు, ఆప్ నేత రామారావు, ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షుడు సదాశివరెడ్డి, ఆంధ్ర మేధావుల సంఘం అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్, సినీ విమర్శకుడు కత్తి మహేష్, ఎఐఎస్‌ఎఫ్ జాతీయ అధ్యక్షుడు వల్లీ ఉల్లా ఖాద్రీ తదితరులు సంఘీభావం తెలిపారు. ధర్నా అనంతరం హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు వినతి పత్రం ఇచ్చేందుకు ర్యాలీగా పార్లమెంటుకు బయలుదేరిన వైసిపి నేతలను ఢిల్లీ పోలీసులు అడ్డుకొని.. బలవంతంగా అరెస్టు చేసి పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఈ సందర్భంగా ధర్నా నుద్దేశించి వైసిపి సీనియర్ నేత ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రత్యేక హోదా ఇవ్వకుంటే నెల 21న కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెడతామని ఆయన తెలిపారు. అయినా, ప్రభుత్వం స్పందించకుంటే ఏప్రిల్ 6న వైసిపి ఎంపిలంతా రాజీనామా చేస్తారని తెలిపారు. వైసిపి రాజ్యసభ ఎంపి విజయసాయి రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాసం పెట్టాలని డిమాండ్ చేసిన పవన్ కళ్యాణ్, ఇప్పుడు అవిశ్వాసం వల్ల ఉపయోగం లేదంటున్నారని విమర్శించారు. గవర్నర్ ప్రసంగంలో ప్రత్యేక హోదాను చేర్చడం సంతోషకరమని వైసిపి సీనియర్ నేత ధర్మాన ప్రసాదరావు వ్యాఖ్యానించారు. హోదా కంటే ప్యాకేజీనే ముద్దని ఇన్నాళ్లు ప్రజలను మభ్యపెట్టినందుకు ప్రజలకు చంద్రబాబు క్షమాపణ చెప్పాలని ధర్మాన డిమాండ్ చేశారు. ఎంపి వైవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక హోదా సాధించే వరకు తమ పోరాటాన్ని ఆపేది లేదని స్పష్టం చేశారు. ప్రత్యేక హోదా, విశాఖ రైల్వేజోన్, దుగరాజపట్నం పోర్టు, కడప స్టీల్ ప్లాంట్ వంటి హామీలను తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నేతలు బొత్స సత్యన్నారాయణ, పెద్ది రెడ్డి రామచంద్రా రెడ్డి, పార్థసారథి, మల్లాది విష్ణు, వంగవీటి రాధా, పిల్లి సుభాష్ చంద్రబోస్, పిడికి రాజన్నదొర, కోటం రెడ్డి శ్రీధర్ రెడ్డి, కోలగట్ల వీరభద్రస్వామి, దేశాయి తిప్పారెడ్డి, పార్టీ నేతలు కురసాల కన్నబాబు, తమ్మినేని సీతారాం, విశ్వరూప్ తదితరులు పాల్గొన్నారు. బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్ షా నివాసం ఎదుట ఏపికి ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి, శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ విద్యార్థి జెఎసి ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. దీంతో పోలీసులు ఆందోళనకారులను అరెస్ట్ చేశారు.

బిజెపికి పోయే కాలం వచ్చింది: పి.మధు

ప్రత్యేక హోదా మన హక్కని, హోదాను సాధించే పోరాటంలో అందరూ కలిసి రావాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు పిలుపు నిచ్చారు. అందరూ కలిసి పోరాడితే..రాష్ట్రానికి ప్రత్యేక హోదా తప్పకుండా వస్తుందని అన్నారు. ప్రత్యేక హెూదా కోసం వైసిపి చేస్తున్న పోరాటానికి తమ మద్దతు ఉంటుందని మధు తెలిపారు. విభజనతో తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్ ప్రజల భవిష్యత్ కోసం అన్ని పార్టీలు ఐక్యంగా ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. బిజెపికి పోయేకాలం వచ్చిందని, అందుకే విభజన హామీలు అమలు చేయడం లేదని ధ్వజమెత్తారు. ప్రత్యేక హోదా కంటే ప్యాకేజీనే మంచిదంటూ కేంద్రం అడుగులకు చంద్రబాబు నాయుడు మడుగులొత్తుతున్నారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని ఎలా పోరాడామో, హోదా సాధన కోసం అలాగే పోరాడాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు.



ప్రధాన మంత్రి మోడీ, సిఎం చంద్రబాబునాయుడుపై ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

తాడోపేడో తేల్చుకోవాల్సిందే: కె.రామకృష్ణ

ఏపికి ప్రత్యేక హోదాపై కేంద్రంతో తాడోపేడో తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకష్ణ వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అసెంబ్లీ సమావేశాలు వాయిదా వేసి ఢిల్లీకి రావాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో ఇంత జరుగుతుంటే చంద్రబాబు అసెంబ్లీలో ఉండటం సరికాదని రామకష్ణ అభిప్రాయపడ్డారు. మేధావుల సంఘం నేత చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ, వైసిపి పోరాటాన్ని తాము అభినందిస్తున్నామని, టిడిపి ఎంపిలు కూడా రాజీనామాలకు సిద్ధం కావాలని డిమాండ్ చేశారు.

పార్లమెంట్‌లో ఏపి ఎంపిలు ఆందోళన

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాతో పాటు విభజన హామీలు అమలు చేయాలంటూ పార్లమెంట్‌లో ఏపి ఎంపిలు ఆందోళన చేపట్టారు. పార్లమెంటు ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద టిడిపి ఎంపిలు ఆందోళన చేశారు. ఎంపి శివ ప్రసాద్ శ్రీకష్ణుడి వేషధారణలో పార్లమెంటు ముందుకు వచ్చారు. పార్లమెంట్ ఉభయ సభల్లో టిడిపి, కాంగ్రెస్, వైసిపి ఎంపిలు నిరసన తెలిపారు. లోక్‌సభ, రాజ్యసభల్లో వెల్‌లోకి వెళ్లి ఆందోళన చేపట్టారు.

మోడీ, బాబులపై కాంగ్రెస్ ఫిర్యాదు

ప్రత్యేక హోదా హామీ, విభజన చట్టం అమలు చేయకుండా ఏపి ప్రజలను మోసం చేసిన ప్రధాని మోడీ, ఏపి సిఎం చంద్రబాబును అరెస్టు చేయాలని ఢిల్లీలో ఏపి కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదు చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల మేనిఫెస్టో హామీలు అమలు పరచకుండా ఏపికి అన్యాయం చేశాయని ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు సోమవారం నాడిక్కడ పార్లమెంటు స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌లో న్యూఢిల్లీ డిసిపి మధుర వర్మకు ఏపి పిసిసి అధ్యక్షుడు రఘువీరా రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ బృందం వినతి పత్రం అందజేసింది.

హోదాకు టిఆర్ఎస్ మద్దతు

ఏపికి ప్రత్యేక హోదా కోసం పోరాడుతున్న వారికి తమ మద్దతు ఉంటుందని టిఆర్ఎస్ ఎంపి జితేందర్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రత్యేక హోదాపై కేంద్రం నాన్చడం సరికాదని అన్నారు. సోమవారం నాడిక్కడ ఆయన మీడియాతో మాట్లాడుతూ రిజర్వేషన్ల అంశంపై తాము పార్లమెంట్‌లో పోరాడతామని చెప్పారు. ప్లకార్డులతో తమ నిరసన తెలియజేస్తామని అన్నారు. రాష్ట్ర విభజన చట్టంలో తమకున్న హక్కుల్ని పోరాడి సాధించుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

ఫ్రంట్ కోసం కెసిఆర్ కసరత్తు

మొదటి పేజీ తరువాయి

ఐపిఎస్, ఐఎఫ్ఎస్, ఐఆర్ఎస్ వంటి అఖిలభాతర సర్వీసు రిటైర్డ్ అధికారులతోనూ, వివిధ రాష్ట్రాల్లో ఏళ్లతరబడి పనిచేసి అనుభవం ఉన్న అధికారులతోనూ చర్చించాలని కెసిఆర్ భావిస్తున్నారు. ఈ సమావేశం తరువాత రక్షణ శాఖకు చెందిన సైనిక, వాయు, వైమానిక సేనలో ఉద్యోగ విరమణ చేసిన అధికారులతోనూ ఆయన సమావేశం కానున్నారు. అదే విధంగా న్యాయనిపుణులు, న్యాయవాదులు, రైతుసంఘాల నేతలతో, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో పనిచేసిన రిటైర్డ్ ఉద్యోగులు, సంఘాలు, మీడియా సంస్థలు, పాత్రికేయులు, కార్మిక సంఘాలు ప్రతినిధులతో కూడా సమావేశమవుతారు. హైదరాబాద్, న్యూఢిల్లీ, కొల్‌కత్తా, ముంబై, చెన్నై, బెంగళూరు వంటి నగరాల్లో ఈ సమావేశాలు నిర్వహించనున్నట్లు సిఎం కార్యాలయం తెలిపింది.

అజిత్‌జోగి మద్దతు

కెసిఆర్‌కు ఛత్తీస్‌గఢ్ జనతా కాంగ్రెస్ నేత అజిత్‌జోగి మద్దతు ప్రకటించినట్లు టిఆర్ఎస్ వర్గాలు తెలిపాయి. కెసిఆర్ ఏర్పాటు చేయనున్న ఫ్రంట్‌లో భాగస్వామి కావడానికి ఆయన సంసిద్ధత వ్యక్తం చేసినట్లు పేర్కొన్నాయి.

రేపు వెయిటేజీ మార్కులపై విచారణ

ప్రజాశక్తి- హైదరాబాద్

ట్రాన్స్‌కో, మెడికల్ విభాగాల్లో వివిధ పోస్టుల భర్తీ సమయంలో తాత్కాలిక, ఒప్పంద కార్మికులకు ప్రాధాన్యత ఇస్తూ వెయిటేజీ మార్కులు ఇవ్వడాన్ని సవాల్ చేసిన పలు రిట్ పిటిషన్లపై సోమవారం హైకోర్టులో వాదనలు సాగాయి. సమయం సరిపోక పోవడంతో కేసు ప్రాధాన్యత దష్ట్యా బుధవారం సమగ్రంగా విచారణ కొనసాగిస్తామని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి విజయలక్ష్మిలతో కూడిన డివిజన్ బెంచ్ ప్రకటించింది. విచారణ 7వ తేదీకి వాయిదా పడింది.

సంక్షేమ పథకాల అమలు తీరుపై మంత్రులు, ప్రజాప్రతినిధులతో సిఎం భేటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సాంఘిక సంక్షేమానికి నిధుల కేటాయింపులు, సంక్షేమ పథకాల అమలు తీరుపై మంత్రులు, టిడిపి ప్రజాప్రతినిధులతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉండవల్లిలోని గ్రీవెన్స్ హాల్‌లో సోమవారం సమావేశమయ్యారు. రానున్న బడ్జెట్‌లో సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖలకు కేటాయించాల్సిన నిధులు, ఇప్పటి వరకు ఈ శాఖల ద్వారా చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు, వాటి అమలు తీరు పై చర్చించారు. మరి ముఖ్యంగా దళిత తేజం కార్యక్రమంతో పాటు సంక్షేమ కార్యక్రమాలు, పథకాల ద్వారా ఫలాలు లబ్ధిదారులకు ఏమేరకు అందుతున్నాయనే అంశం పై చర్చించారు. ఈ సమావేశంలో మంత్రులు నక్కా ఆనంద్ బాబు, కె జవహర్, తెలుగుదేశం పార్టీకి చెందిన దళిత, గిరిజన ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, దళిత సంఘాల నేతలు పాల్గొన్నారు.

వేతనాల పెంపుకై పంచాయతీ కార్మికుల సమ్మె

కమిషనర్‌కు నోటీసు అందజేసిన యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరితో మూడు రోజుల పాటు సమ్మె నిర్వహిస్తున్నట్లు ఎపి గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధ సంస్థ) వెల్లడించింది. పంచాయతీ రాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ బి రామాంజనేయులను యూనియన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డి వెంకట్రామయ్య, కె ఉమామహేశ్వరరావు సోమవారం ఈ మేరకు సమ్మె నోటీసు అందజేశారు. సమస్యల పరిష్కారానికై ఈ నెల 13,14,15 తేదీల్లో సమ్మె నిర్వహిస్తున్నట్లు ఈ నోటీసులో పేర్కొన్నారు. కనీస వేతనాల చట్టం -1948ని గ్రామ పంచాయతీ కార్మికులకు వర్తింపచేయడం లేదని తెలిపారు. పంచాయతీ కార్మికులకు రూ.1500ల నుంచి రూ.8వేల లోపు మాత్రమే జీతాలు చెల్లిస్తున్నారని, వీటినీ ప్రతి నెలా చెల్లించడం లేదని, 8-9 నెలలు పెండింగ్ పెడుతున్నారని వివరించారు. జీవో నెం 151 ప్రకారం కనీస వేతనాలను ప్రభుత్వమే చెల్లించాలని, బకాయి జీతాలు ఇవ్వాలని కోరారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం, ఎన్ఎంఆర్, పార్ట్‌టైం, ఫిక్సెడ్ పేతో సహా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్, గుర్తింపు కార్డులు, ఈపిఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యూటీ, పెన్షన్‌తోపాటు గ్రామ కార్యదర్శులుగా ప్రమోషన్స్, హైకోర్టు తీర్పుకు అనుగుణంగా టెండర్స్ లేకుండానే కార్మికులను ఉద్యోగులుగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికీ యూనిఫాం, గుర్తింపు కార్డులు, పిఎఫ్, ఈ ఎస్ఐ, ప్రమాద బీమా, పెన్షన్, గ్రాట్యూటీ అమలు, భద్రతా సౌకర్యాలు కల్పించాలని కోరారు. బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని, అర్హులైన కార్మికులకు వాచ్‌మెన్, అటెండర్ పోస్టుల్లో ప్రమోషన్స్ కల్పించాలని, దహన సంస్కారాలకు ఇచ్చే ఆర్థిక సహాయాన్ని రూ.5 వేల నుంచి రూ.20వేలకు పెంచాలని, ప్రభుత్వం ఇస్తున్న ట్రాక్టర్లను గ్రామ పంచాయతీ కార్మికులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమ్మెకు పూర్తి బాధ్యత రాష్ట్ర ప్రభుత్వమే వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

ఎన్టీఆర్‌కు జోడీగా హెగ్డే

ఎన్టీఆర్, మాటల మాంత్రికుడు, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో ఓ చిత్రం రూపొందనున్న విషయం తెలిసిందే. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌లో ప్రతిష్టాత్మకంగా రూపుదిద్దుకోబోతోంది. ఈ చిత్రంలో ఎన్టీఆర్‌కు జోడీగా పూజా హెగ్డేను ఎంపిక చేశారు. బాలీవుడ్ హీరోయిన్లను ఎంపిక చేయాలని ముందు చిత్రబృందం ఆలోచన చేసిందీ గానీ అంతిమంగా పూజా హెగ్డే ఎంపికకే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ చిత్రం కోసం ఎన్టీఆర్ ప్రత్యేకంగా ముంబాయిలో శరీరంలో మార్పుల కోసం కరసత్తులు చేస్తున్నారు. త్వరలోనే ఆ తర్ఫీదు పూర్తి కానుంది. ఈ చిత్రానికి సంగీతాన్నీ థమన్ అందిస్తున్నారు. ఛాయాగ్రహణం పి. ఎస్. వినోద్ అందిస్తారు. సూర్యదేవర రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్నారు. ఏప్రిల్‌లో ఈ చిత్రం షూటింగ్ మొదలు కానుంది. ఈ సంవత్సరం ద్వితీయ భాగంలో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని చిత్రబృందం ప్రకటించింది.







'ది షేప్ ఆఫ్ వాటర్'కు ఆస్కార్ల పంట



ఉత్తమ నటుడు ఓల్డ్ మ్యాన్

- ఉత్తమ చిత్రంతో సహా మూడు విభాగాల్లో అవార్డులు
- ట్రాన్స్‌జెండర్‌కు ఆస్కార్
- మూడు విభాగాల్లో 'డన్‌క్రిక్'కి
- రెండేసి విభాగాల్లో నాలుగు చిత్రాలు



ఉత్తమ నటి ఫ్రాన్సిస్ మెక్‌డోర్మండ్

ప్రపంచ సినిమా పండుగ ఆస్కార్ కనుల పండుగగా నిర్వహించారు. హాలీవుడ్ తారలతో సందడి నెలకొంది. 90వ అకాడమీ అవార్డులను అత్యధికంగా నాలుగు విభాగాల్లో 'ది షేప్ ఆఫ్ వాటర్' గెలుచుకుంది. 13 విభాగాల్లో పోటీ పడ్డ ఈ చిత్రం నాలుగు పురస్కారాలు సొంతం చేసుకుంది. విదేశీ భాషా చిత్రాల విభాగంలో 'ఎ ఫెంటాస్టిక్ ఉమెన్' పురస్కారాన్ని అందుకుంది. ఈ చిత్రంలో ట్రాన్స్‌జెండర్ దానియల్ వేగ్ లీడ్ రోల్ పోషించింది. ఆమె నటనను ఆస్కార్ అవార్డుల కమిటీ ప్రశంసించిడం విశేషం.

మూడు అవార్డులతో రెండో స్థానంలో నిచిలించింది 'డన్‌క్రిక్'. ఈ చిత్రానికి ఏడు విభాగాల్లో అత్యధికంగా నామినేషన్లు లభిస్తే మూడు ఆస్కార్లను గెలుచుకుని రెండో స్థానాన్ని దక్కించుకుంది. 'ది షేప్ ఆఫ్ వాటర్' తర్వాత అత్యధికంగా తొమ్మిది విభాగాల్లో పోటీ పడిన 'త్రీ బిల్‌బోర్డర్స్ అవుట్‌సైడ్ ఎబ్బింగ్ మిస్సోరీ 2' చిత్రం మాత్రం రెండు అవార్డులకే పరిమితమై మూడో స్థానంలో నిలిచింది. ఈ చిత్రంతో పాటు రెండేసి విభాగాల్లో 'డార్కెస్ట్ అవర్', 'బ్లాడ్ రన్నర్ 2049' అవార్డులను సొంతం చేసుకున్నాయి. భారత కాలమానం ప్రకారం ఉదయం 6:30 గంటలకు లాస్‌ఏంజెల్స్‌లోని డాల్బీ థియేటర్‌లో ఈ వేడుకను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రముఖ అమెరికన్ టెలివిజన్ హోస్ట్ జిమ్మీ కిమ్మెల్ ఈ షోకు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. హాలీవుడ్ నటీనటులంతా హాజరై సందడి చేశారు.

ఉత్తమ చిత్రంగా 'షేప్ ఆఫ్ వాటర్' నిలిచింది. ఎనిమిది చిత్రాలతో పోటీ పడి ఈ పురస్కారాన్ని దక్కించుకుంది. ఉత్తమ నటిగా ఫ్రాన్సెస్ మెక్‌డోర్మండ్ నిలిచారు. ఓ హత్య కేసులో కూతుర్ని పోగొట్టుని న్యాయం కోసం పోరాడుతున్న తల్లి పాత్రలో ఫ్రాన్సెస్ నటించిన చిత్రం 'త్రీ బిల్‌బోర్డ్స్ ఔట్‌సైడ్ ఎబ్బింగ్, మిస్సోరీ 2'. ఈ సినిమాలో ఈమె నటనకు ఉత్తమ నటి అవార్డు వరించింది. ఉత్తమ నటుడిగా గ్యారీ ఓల్డ్‌మ్యాన్ ఆస్కార్‌ను అందుకున్నారు. 'డార్కెస్ట్ అవర్'లో బ్రిటన్ మాజీ ప్రధాని విన్‌స్టన్ చర్చిల్ పాత్రలో చేసి మెప్పించిన గ్యారీ ఓల్డ్‌మ్యాన్‌కు ఉత్తమ నటుడిగా అవార్డు వరించింది. ఉత్తమ సహాయ నటిగా ఆల్లిసన్ జాన్నేకు దక్కింది. 'ఐ, టోన్యా' చిత్రంలో జాన్నే తల్లి పాత్రలో నటించారు. ఇందులో ఈమె నటనకు సినీ విమర్శకులు సైతం ప్రశంసించారు. ఉత్తమ సహాయనటుడిగా సామ్ రాక్‌వెల్ నిలిచారు. 'త్రీ బిల్‌బోర్డ్స్ ఔట్‌సైడ్ ఎబ్బింగ్, మిస్సోరీ2'లో మద్యానికి బానిసైన పోలీస్ అధికారి పాత్రలో నటించారు. సహాయనటుడిగా రాక్‌వెల్ పేరు ప్రకటించగానే తన ప్రేయసి వల్లే ఈ అవార్డు వరించిందని తెలిపారు.

ఉత్తమ చిత్రంగా ఆస్కార్ అందుకున్న ' ది షేప్ ఆఫ్ వాటర్' నాలుగు విభాగాల్లో ఆస్కార్ పురస్కారాలను సొంతం చేసుకుంది. ఉత్తమ చిత్రం, దర్శకుడు, ఒరిజినల్ స్కోర్, ప్రొడక్షన్ డిజైన్ విభాగాల్లో ఈ చిత్రం అవార్డులను అందుకుంది. 'డన్‌కర్క్' చిత్రానికి మూడు పుస్కారాలు లభించాయి. బెస్ట్ సౌండ్ మిక్సింగ్, బెస్ట్ ఫిలిం ఎడిటింగ్, బెస్ట్ విజువల్ ఎఫెక్ట్స్ విభాగాల్లో ఆస్కార్‌లను సొంతం చేసుకుందీ చిత్రం.



ఉత్తమ సహాయ నటి అల్లీసన్ జెన్నీ



ఉత్తమ సహాయ నటుడు సామ్ రాక్‌వెల్

అవార్డుల పూర్తి వివరాలు

- ఉత్తమ చిత్రం: ది షేప్ ఆఫ్ వాటర్
- ఉత్తమ నటి: ఫ్రాన్సిస్ మెక్‌డోర్మండ్ (త్రీ బిల్ బోర్డ్స్ అవుట్ సైట్ ఎబ్బింగ్, మిస్సోరీ)
- ఉత్తమ నటుడు: గ్యారీ ఓల్డ్‌మ్యాన్ (డార్కెస్ట్ అవర్)
- ఉత్తమ దర్శకుడు: గల్లీర్మో డెల్ టోరో (ది షేప్ ఆఫ్ వాటర్)
- ఉత్తమ సహాయ నటి: అల్లీసన్ జెన్నీ (ఐ, టోన్యా)
- ఉత్తమ సహాయ నటుడు: సామ్ రాక్‌వెల్ (త్రీ బిల్ బోర్డ్స్ అవుట్ సైడ్ ఎబ్బింగ్, మిస్సోరీ)
- ఉత్తమ యానిమేటెడ్ చిత్రం: కోకో
- ఉత్తమ యానిమేటెడ్ షార్ట్ ఫిలిం : డియర్ బాస్కెట్‌బాల్
- ఉత్తమ సినీమాటోగ్రఫీ చిత్రం: బ్లేడ్ రన్నర్ 2049
- ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్: మార్క్ బ్రిడ్జెస్ (ఫాంటమ్ థ్రెడ్)
- ఉత్తమ డాక్యుమెంటరీ ఫీచర్: ఇకారస్
- ఉత్తమ లఘు చిత్రం: హెవెన్ ఈజ్ ఎ ట్రాఫిక్ జామ్ ఆన్ ది 405
- ఉత్తమ ఎడిటర్: లీ స్మిత్ (డన్‌కర్క్)
- ఉత్తమ అలంకరణ, కేశాలంకరణ: కజుహిరో సుజి, డేవిడ్ మాలినోవ్‌స్కీ, లూసీ సిబ్బిక్ (డార్కెస్ట్ అవర్)
- బెస్ట్ సౌండ్ మిక్సింగ్: మార్క్ వీన్‌గార్టెన్, గ్రెగ్ ల్యాన్‌డార్కర్, గ్యారీ ఎ.రిజ్జో (డన్‌కర్క్)
- బెస్ట్ ప్రొడక్షన్ డిజైన్: పాల్ డెన్‌హామ్, ఆస్టర్‌బెర్రీ (ది షేప్ ఆఫ్ వాటర్)
- ఉత్తమ విదేశీ చిత్రం: ఎ ఫెంటాస్టిక్ ఉమెన్ (చిలీ)
- ఉత్తమ యానిమేటెడ్ షార్ట్ ఫిలిం : డియర్ బాస్కెట్‌బాల్
- బెస్ట్ విజువల్ ఎఫెక్ట్స్: జాన్ నీల్సన్, గెర్డ్ నెఫ్జర్, పాల్ లాంబర్ట్, రిచర్డ్ ఆర్. హూవర్(బ్లేడ్ రన్నర్ 2049)
- బెస్ట్ లైవ్ యాక్షన్ షార్ట్ ఫిలిం: ది సైలెంట్ చైల్డ్
- బెస్ట్ అడాప్టెడ్ స్క్రీన్ ప్లే: జేమ్స్ ఐవరీ (కాల్ మి బై యువర్ నేమ్)
- బెస్ట్ ఒరిజినల్ స్క్రీన్‌ప్లే: జోర్డన్ పీలే (గెటౌట్)
- బెస్ట్ ఒరిజినల్ పాట: రిమెంబర్ మీ(కోకో)

ఎనిమిది చిత్రాల మధ్య పోటీ

ఉత్తమ చిత్రంగా నిలిచిన 'ది షేప్ ఆఫ్ వాటర్'కు తీవ్రమైన పోటీ ఎదురైంది. ఏకంగా ఎనిమిది చిత్రాలు ఈ విభాగంలో పోటీ పడ్డాయి. కాల్ మీ బై యువర్ నేమ్, డార్కెస్ట్ అవర్, డన్‌క్రిక్, గెట్ అవుట్, లేడీ బర్డ్, ఫాంటాన్ థ్రెడ్, ది పోస్టు, త్రి బిల్‌బోర్డర్స్ అవుట్‌సైడ్ ఎబ్బింగ్, మిస్సోరీ2 ..చిత్రాలు ఉత్తమ చిత్రంగా నిలిచేందుకు పోటీ పడ్డాయి. చివరకు 'ది షేప్ ఆఫ్ వాటర్'కు దక్కింది. 2017లో వచ్చిన ఈ సినిమాను దర్శకుడు గులెర్మో డెల్ టోరో అమెరికన్ ఫాంటసీ డ్రామా తెరకెక్కించారు. సాల్లీ హాకిన్స్, మైఖెల్ షాన్నన్, రిచర్డ్ జెన్‌కిన్స్, డోగ్ జోన్స్, మైఖెల్ స్టుల్‌బార్గ్, ఆక్టేవియా స్పెన్సర్ తదితరులు ఈ చిత్రంలో ప్రధాన పాత్రల్లో నటించారు. ల్యాబొరేటరీలో పనిచేస్తున్న ఓ మూగ యువతి అదే ల్యాబొరేటరీలో పరిశోధన నిమిత్తం ఉంచిన హ్యూమనాయిడ్ అనే నీటి జంతువుతో ప్రేమలో పడిన కథే ఈ చిత్రం. 19.5 మిలియన్ డాలర్స్ తీసిన ఈ సినిమా 114.3 మిలియన్ డాలర్ల వసూళ్లు రాబట్టింది.

ఉత్తమ చిత్రం 'ది షేప్ ఆఫ్ వాటర్'





దానియల్ వేగ్

ట్రాన్స్‌జెండర్‌కు ఆస్కార్

ఈ ఏడాది ఆస్కార్ అవార్డుల్లో ట్రాన్స్‌జెండర్‌కు పురస్కారం రావడం విశేషం. విదేశీ భాషా చిత్రాల విభాగంలో దక్షిణాఫ్రికాలోని చిలీ దేశానికి చెందిన 'ఎ ఫెంటాస్టిక్ ఉమెన్' చిత్రానికి ఆస్కార్ లభించింది. ఈ విభాగంలో ది ఇన్‌సాల్ట్, లవ్‌లెస్, ఆన్ బాడీ అండ్ సోల్, ది స్క్వేర్ చిత్రాలు పోటీ పడ్డాయి. అయితే ఈ చిత్రాలు అన్నింటిలోనూ ట్రాన్స్‌జెండర్ చేసిన పాత్రలేకపోవడం 'ఎ ఫెంటాస్టిక్ ఒమెన్' చిత్రంలో దానియల్ వేగ్ చేసిన నటన అద్భుతంగా ఉండడంతో ఈ పురస్కారం దక్కింది.

బోర్డ్ ఎగ్జామ్స్ రాసినంత టెన్షన్ పడుతున్నా

విజయ్ దేవరకొండ



అల్లు అరవింద్, మెహ్రీన్, విజయ్ దేవరకొండ

'పెళ్లిచూపులు' 'అర్జున్‌రెడ్డి' చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న విజయ్ దేవరకొండ నూతన చిత్రం షూటింగ్ సోమవారం ప్రారంభమైంది. ఇందులో మెహ్రీన్ కథానాయికగా చేస్తున్నారు. 'ఇంకొక్కడు' ఫేమ్ ఆనంద్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతోంది. స్టూడియో గ్రీన్ పతాకంపై కె.ఇ. జ్ఞానవేల్ రాజా తెలుగు, తమిళ్‌లో నిర్మిస్తున్నారు. హైదరాబాద్ రామానాయుడు స్టూడియోలో లాంఛనంగా చిత్రీకరణ ప్రారంభమైంది. నిర్మాతలు అల్లు అరవింద్, కె.ఎస్.రామారావు, బి.వి.ఎస్.ఎన్ ప్రసాద్, మైత్రి మూవీస్ అధినేతలు నవీన్ ఎర్నేని, సి.వి.మోహన్, ప్రముఖ దర్శకులు వంశీ పైడిపల్లి, మెహర్ రమేష్, సందీప్ రెడ్డి వంగ పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం హీరో విజయ్ దేవరకొండ, హీరోయిన్ మెహరీన్‌లపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి అల్లు అరవింద్ క్లాప్‌నిచ్చారు. సందీప్ రెడ్డి వంగ, కెమెరా స్విచాన్ చేశారు. ఈ సన్నివేశానికి చిత్ర దర్శకుడు ఆనంద్ శంకర్ గౌరవ దర్శకత్వం వహించారు.

హీరో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ 'రోజులు చాలా ఫాస్ట్‌గా గడిచిపోతున్నాయి. ఇప్పుడిప్పుడే యాక్టింగ్ నేర్చుకుంటున్నాను. స్టూడియో గ్రీన్ కె.ఇ. జ్ఞానవేల్ రాజా బేనర్‌లో సినిమా చేస్తున్నందుకు చాలా గర్వంగా ఫీలవుతున్నాను. స్క్రిప్ట్ వినగానే చాలా ఎగ్జైట్ అయ్యాను. ఫస్ట్‌టైమ్ తెలుగు, తమిళ్‌లో సినిమా చేస్తున్నాను. సినిమా ఎప్పుడెప్పుడు చెయ్యాలా అని యాంగ్జైటింగ్‌గా ఉంది. బోర్డ్ ఎగ్జామ్స్ రాస్తున్నప్పుడు ఎంత టెన్షన్ పడ్డానో అంతే టెన్షన్‌గా అనిపిస్తుంది. డేట్స్ లేకపోయినా స్క్రిప్ట్ నచ్చడంతో.. ఎలాగైనా సినిమా చేయాలని డేట్స్ అడ్జస్ట్ చేసి సినిమాకి ఓకే చెప్పాను. స్క్రిప్ట్ ఖతర్నాక్‌గా ఉంది. యంగ్ టాలెంటెడ్ టీమ్‌తో వర్క్ చేస్తున్నందుకు చాలా హ్యాపీగా వుంది"అని అన్నారు. ఈనెల ఎనిమిదో తేదీ నుంచి మొదటి షెడ్యూల్‌ను హైదరాబాద్‌లో మొదలెడతామని నిర్మాత చెప్పారు. రెండో షెడ్యూల్ చెన్నైలో ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ చిత్రంలో సత్యరాజ్, నాజర్ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం : సి.ఎస్. శ్యాం, కెమెరా : శాంత, ఆర్ట్: కిరణ్, కాస్ట్యూమ్ డిజైనర్: శ్రావ్య, దర్శకత్వం: ఆనంద్ శంకర్, నిర్మాత: కె.ఇ. జ్ఞానవేల్ రాజా.

'అనగనగా ఒక ఊళ్లో' గీతాలు వచ్చాయి



ప్రియాంక శర్మ, అశోక్ కుమార్


చంద్రబాలాజీ ఫిలిమ్స్ పతాకంపై సాయికృష్ణ కె.వి.ని దర్శకుడిగా పరిచయం చేస్తూ కె.చంద్రరావు నిర్మిస్తున్న చిత్రం 'అనగనగా ఒక ఊళ్ళో'. పల్లెటూరికి వినోద యాత్ర అనేది ట్యాగ్‌లైన్. అశోక్‌కుమార్, ప్రియాంక శర్మ హీరో హీరోయిన్స్‌గా నటిస్తున్న ఈ చిత్రం ఆడియో సీడీని శ్రీకాంత్ విడుదల చేశారు. థియేట్రికల్ ట్రైలర్‌ను హీరో నవీన్ చంద్ర ఆవిష్కరించారు. శ్రీకాంత్ మాట్లాడుతూ 'టైటిల్ చాలా బాగుంది. పల్లెటూరు వాతావరణం ఈ చిత్రంలో చూడబోతున్నాం. సంగీత దర్శకుడు యాజమాన్య మంచి ఆల్బమ్‌ను అందిస్తాడు. ఇంతకుముందు నేను నటించిన 'నాటుకోడి' చిత్రానికి మంచి మ్యూజిక్‌ని ఇచ్చాడు. ఈ చిత్రంలోని సాంగ్స్ కూడా చాలా బాగా ఉంటాయని నమ్ముతున్నాను. అలాగే ఈ చిత్రం కూడా మంచి సక్సెస్ అయ్యి దర్శక నిర్మాతలకు, ఆర్టిస్ట్‌లకు, టెక్నీషియన్‌లకు మంచి పేరు తీసుకురావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను ' అని అన్నారు.

సుధాకర్ తోపురా..!



సుధాకర్, నిత్యాశెట్టి

'లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్' ఫేమ్ సుధాకర్ కొంత విరామం అనంతరం మళ్లీ వెండితెరపై కనువిందు చేసేందుకు సన్నద్ధమవుతున్నాడు. హరనాథ్ బాబు.బి దర్శకత్వంలో యునైటెడ్ ఫిలిమ్స్ పతాకంపై డి.శ్రీకాంత్ నిర్మిస్తున్న చిత్రం 'నువ్వు తోపురా'. చిత్రీకరణ పూర్తి చేసుకొని పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుపుకుంటోంది. హీరో సుధాకర్ కొమాకుల మాట్లాడుతూ "ఈ చిత్రంలో నా పాత్ర అన్ని భావోద్వేగాలను కలగలిపి వినూత్నంగా ఉంటుంది. యువతరం తమని తాము ఈ పాత్రలో చూసుకుంటారు. ఈ చిత్రం నాకు మరో మెట్టు పైకి ఎదిగేలా చేస్తుందని నమ్ముతున్నాను. నిర్మాతలకి ఈ చిత్రం మొదటిది అయినప్పటికీ కూడా ప్రేక్షకులకి ఒక మంచి చిత్రాన్ని అందించాలనే ఉద్దేశంతో కథానుసారంగా ఉత్తమ నిర్మాణ విలువలతో ఈ చిత్రాన్ని నిర్మించారు. తప్పకుండా ఈ చిత్రం తో ప్రేక్షకుల్లోనూ, ఇండస్ట్రీలోనూ ఒక మంచి పేరు సంపాదిస్తామని ఆశిస్తున్నాం" అని అన్నారు.



ఉత్తమ దర్శకుడు గల్లీర్మో డెల్ టోరో

సవరణ

ఈనెల మూడో తేదీన సినిమా పేజీలో 'ఎన్టీఆర్‌కు ఎవరు?' అనే వార్తలో ఇప్పటికే ఎన్టీఆర్ సరసన రాశీ ఖన్నా 'జనతా గ్యారేజ్'లో మెప్పించింది అని పొరపాటుదొర్లింది. దాన్ని 'జై లవ కుశ'లో మెప్పించింది అని చదువుకోగలరు.

– ఎడిటర్





మూత్రపిండాల వ్యాధులనేవి మహిళలు, పురుషులు అనే తేడాలు లేకుండా ఎవరికైనా వస్తాయి. కానీ వీటివల్ల అధికంగా ప్రభావితమౌతున్నది, సమస్యలను ఎదుర్కొంటున్నదీ ఎక్కువగా మహిళలే. దీనికి కారణం ప్రస్తుత సమాజంలో ఆరోగ్యసమస్యలను పురుషుల్లా ముందుగా మహిళలు బహిర్గతం చేయలేకపోవడమే. చివరికి అవి ప్రాణాంతకమైన స్థితికి వారిని నెట్టేస్తుండడం సర్వసాధారణమౌతోంది. ఈ నెల 8న అంతర్జాతీయ శ్రామిక మహిళాదినోత్సవంతోపాటు.. ప్రపంచ కిడ్నీ దినం కూడా. మహిళలు మూత్రపిండాల వ్యాధులకు ఎలా బలౌతున్నారు? ఈ వ్యాధుల లక్షణాలేమిటి? చికిత్సలు, అవగాహన తదితర అంశాలు ఈ వారం 'డాక్టర్ స్పెషలిస్ట్'లో...

మహిళల ఆరోగ్యంపై కిడ్నీ వ్యాధుల కాటు

క్రానిక్ కిడ్నీ డిసీజ్ (సికెడి) ప్రపంచవ్యాప్తంగా భయాందోళనలు కలిగిస్తున్న వ్యాధి. ప్రస్తుతం మహిళల మరణానికి కారణమౌతున్న వ్యాధుల్లో ఇది ఎనిమిదో స్థానంలో ఉంది. ప్రతి ఏటా ప్రపంచంలో ఆరు మిలియన్ల మంది ఈ వ్యాధివల్ల చనిపోతున్నారంటే దీని తీవ్రత ఏమిటో తెలుసుకోవచ్చు. ప్రతి ముప్పై మంది కిడ్నీ రోగుల్లో 18 మంది మహిళలుండగా, 12 మంది వరకూ పురుషులున్నారు. ఈ వ్యాధిపై అవగాహన లేకపోవడం, సకాలంలో సరైన వైద్యం అందకపోవడం మహిళల ఆరోగ్యానికి ప్రతిబంధకాలుగా మారుతున్నాయి. డయాలసిస్ చేయించే విషయంలోనూ పురుషుల కన్నా మహిళల పట్ల కుటుంబాల్లోనివారు అంత శ్రద్ధ చూపించడం లేదు. కొన్నిసార్లు మూత్రపిండాల మార్పిడికి తగిన అవకాశం లభిస్తున్నా పురుషరోగుల కోసం తీసుకునేటంత శ్రద్ధని మహిళా రోగుల విషయంలో చూపించడం లేదు. అంతేకాకుండా చాలా కుటుంబాల్లో మహిళలే కిడ్నీదాతలుగానూ ఉంటున్నారు.

ల్యూపస్ నెఫ్రోపతి

మహిళల కిడ్నీ వ్యాధులలో ప్రముఖమైనది ల్యూపస్ నెఫ్రోపతి లేదా మూత్రపిండాల ఇన్ఫెక్షన్. ఇది ఎక్యూట్, క్రానిక్ దశల్లో కూడా మహిళల ఆరోగ్యంపై ప్రభావాన్ని చూపిస్తుంది. ఇది మహిళల్లో వ్యాధి నిరోధకశక్తి తక్కువగా ఉన్న సమయంలో తీవ్రమౌతుంది. తగిన వ్యాధినిరోధక శక్తి ఉన్న మహిళల్లో ఇది వ్యాధిగా విస్తరించదు. పౌష్టికాహారానికి దూరమై రక్తహీనతతో ఉన్న మహిళలు అంతిమంగా ఈ వ్యాధికి గురౌతున్నారు. ఇది ముందు మూత్ర సంబంధ ఇన్ఫెక్షన్‌గా మొదలై, దీర్ఘకాలంపాటు చికిత్స తీసుకోలేని స్థితిలో ఆ ఇన్ఫెక్షన్ మూత్ర పిండాల్లోకి ప్రవేశిస్తుంది. అప్పటికే వ్యాధి నిరోధకశక్తి లోపించడం, రక్తహీనత వంటి కారణాల వల్ల ఇది క్రానిక్ కిడ్నీ డిసీజ్‌గా మారుతుంది. కిడ్నీ వ్యాధులున్నప్పుడు, పరిస్థితి చాలా తీవ్రతరం అయ్యేంతవరకూ వ్యాధికి సంబంధించి ఎటువంటి లక్షణాలూ త్వరగా బయటపడవు.



కిడ్నీవ్యాధి ప్రారంభ లక్షణాలు

మూత్రవ్యవస్థ పనితీరులో మార్పులు అంటే మూత్రంలో హెచ్చుతగ్గులు. ఇందులో తరచూ మూత్రవిసర్జనకు వెళ్ళాల్సి రావడం లేదా అసలు మూత్రవిసర్జన చేయకుండా ఉండడం. రాత్రి సమయంలో ఎక్కువసార్లు మూత్ర విసర్జనకు వెళ్లడం. మూత్రం దట్టమైన రంగులో ఉండడం. మూత్రవిసర్జన సమయంలో అసౌకర్యం, లేదా కష్టంగా అనిపించడమూ ఈ వ్యాధి లక్షణాలే. యూరినరీ ట్రాక్ ఇన్ఫెక్షన్లు కిడ్నీలకు వ్యాప్తి చెందితే జ్వరం, బ్యాక్ పెయిన్ వంటి సమస్యలు వస్తాయి. అలాగే కిడ్నీ వ్యాధులలో ఆందోళకు గురిచేసే ఒక కచ్చితమైన కారణం మూత్రంలో రక్తం కనిపించడమూ ఒక ప్రధాన లక్షణమే.

తీవ్రమైన దశలో లక్షణాలు

కిడ్నీ వ్యాధి తీవ్రమౌతున్న దశలో బహిర్గతమయ్యే లక్షణాలు ఇలా ఉంటాయి.

- భోజనం రుచించదు, ఆహారమంటే అయిష్టం కలుగుతుంది. వాంతులు వస్తుంటాయి.
- నీరసంగా ఉండి, బరువు తగ్గిపోతుంటారు.
- కొద్దిగా పని చేయగానే అలసిపోవడం, ఆయాసం వస్తుంటుంది.
- రక్తం లేక శరీరం పాలిపోవడము (ఎనీమియా). కిడ్నీలో తయారయ్యే ఎరిత్రోపోయెటిన్ అనే హార్మోన్ తక్కువ కావడంతో శరీరంలో రక్తము తక్కువగా తయారవ్వడము.
- శరీరంపై దురద పుడుతుంటుంది. జ్ఞాపకశక్తి తగ్గిపోతుంది.
- నిద్రపోయే రీతిలో మార్పులుంటాయి. ఎన్ని మందులు వాడినా బీపీ వంటివి అదుపులోకి రావు.
- మహిళల్లో రుతుక్రమం సరిగా ఉండదు. పురుషులు నపుంసకత్వానికి లోనౌతారు.
- కిడ్నీ ఫెయిల్యూర్ వల్ల సంభవించే సమస్యలు ఎక్కువగా ఉన్నప్పటికీ.. సరైన చికిత్స అందకపోతే ఆయాసం అధికమౌతుంది. రక్తాన్ని వాంతి చేసుకోవచ్చు.
- రోగికి నిద్ర సరిగా ఉండదు. శరీరము బాధాకరంగా ఉంటుంది. తరచూ స్పృహ తప్పిపోతుంటారు.
- రక్తములో పొటాషియం ఎక్కువై, దాని ప్రభావం గుండెపై పడుతుంది. ఫలితంగా గుండె అకస్మాత్తుగా ఆగిపోతుంది.

తొలిదశలో గుర్తిస్తే

కిడ్నీ వ్యాధుల లక్షణాలను తొలిదశలోనే గుర్తించినట్టైతే, వెంటనే సంబంధిత వైద్యుణ్ణి సంప్రదించి, తగు జాగ్రత్తలు తీసుకోవాలి. కిడ్నీలు శరీరంలో వ్యర్థాలను, అదనపు నీటిని తొలగిస్తాయి. అలా సమయానికి వాటిని తొలగించలేనప్పుడు, ఈ అదనపు నీరు చేతులు, పాదాలు, ముఖానికి చేరి, వాపును కలిగిస్తాయి.

కిడ్నీలు ఎరిత్రోపోయిటిన్ అనే హార్మోన్‌ను ఉత్పత్తి చేస్తాయి. ఇవి ఎర్రరక్తకణాలు ఆక్సిజన్ సరఫరా చేయడానికి సహాయపడతాయి. కిడ్నీలలో ఎరిత్రోపోయిటిన్ తక్కువగా ఉన్నప్పుడు రక్తంలో రెడ్ బ్లడ్‌సెల్స్ తగ్గి, ఫలితంగా రక్తహీనత వస్తుంది. ముఖ్యంగా రక్తహీనత కిడ్నీవ్యాధులతో సంబంధం కలిగి ఉండటంవల్ల మెదడుకు సరైన రక్తం, ఆక్సిజన్ సరఫరా తగ్గి నీరసం, అలసట, మెదడుకు ఏకాగ్రత తగ్గుతుంది. కిడ్నీ ఫెయిల్యూర్ అయినప్పుడు రక్తంలో వ్యర్థాల ఎక్కువై, చర్మంపై దద్దుర్లు, దురద రావడానికి కారణమవుతాయి.

మూత్రపిండాలు మొరాయిస్తే

మూత్రపిండాలు పనితీరులో విఫలమైనపుడు రక్తంలో యూరియా పెరుగుతుంది. ఈ యూరియా లాలాజలంలోని అమ్మోనియాను విచ్ఛిన్నం చేస్తుంది. ఫలితంగా చెడు శ్వాసకు కారణమవుతుంది. దీన్నే అమ్మోనియా బ్రీత్ అనీ పిలుస్తారు. ఈ బ్రీత్ మెటాలిక్ టేస్ట్‌ను కలిగి ఉంటుంది. అలాగే ఈ వ్యాధివల్ల ఏర్పడ్డ రక్తంలోని వ్యర్థపదార్థాలు వ్యాధిగ్రస్తుల్లో వికారం, వాంతుల రావడానికి కారణమవుతాయి. ముఖ్యంగా కిడ్నీ వ్యాధులవల్ల ఊపిరితిత్తుల్లో నీరు చేరుతుంది. రక్తహీనత కిడ్నీ వ్యాధులకు ఒక సాధారణ సైడ్ ఎఫెక్ట్. ఫలితంగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఏర్పడతాయి. మూత్రపిండాలు విఫలం చెందినప్పుడు వెన్ను పక్కలలో నొప్పి వచ్చే అవకాశం ఉంది. కిడ్నీలో రాళ్ళు ఉన్నప్పుడు లోయర్ బ్యాక్ పెయిన్ నుంచి గజ్జదిగువల భాగం వరకూ ఒక తీవ్రమైన తిమ్మిరితో కూడిన నొప్పి కలుగుతుంది. అలాగే పాలీసిస్టిక్ కిడ్నీ డిసీజ్, వారసత్వ మూత్రపిండాల లోపంతోనూ ఇటువంటి సమస్యలు వస్తాయి.

కిడ్నీ ఫెయిల్యూర్‌ని నిర్ధారించడం

రక్తంలోని క్రియాటినిన్, యూరియాల పరిమాణాలను పరీక్ష చేస్తే.. కిడ్నీ పనితీరు, సామర్థ్యం వెల్లడవుతాయి. కిడ్నీ పనిచేసే శక్తి శరీరానికి అవసరమైన దానికంటే ఎక్కువగా ఉంటుంది. అందుచేత ఏదైనా వ్యాధివల్ల కిడ్నీకి కొంచెం నష్టం కలిగినా, రక్తపరీక్షలో ఏవిధమైన తేడాలూ కనపడవు. అయితే వ్యాధివల్ల రెండు కిడ్నీలు 10 శాతం కంటే ఎక్కువగా పాడైతే, అప్పుడు రక్తంలోని క్రియాటినిన్, యూరియాల పరిమాణం సాధారణం కన్నా ఎక్కువగా ఉంటాయి.

కిడ్నీ ఫెయిల్యూర్ రెండు రకాలు

కిడ్నీ ఫెయిల్యూర్ ముఖ్యంగా రెండు రకాలు. ఎక్యూట్ కిడ్నీ ఫెయిల్యూర్, క్రానిక్ కిడ్నీ ఫెయిల్యూర్, ఈ రెండు రకాల కిడ్నీ ఫెయిల్యూర్ల మధ్య ఉండే తేడాని స్పష్టంగా గమనించాలి.

ఎక్యూట్ కిడ్నీ ఫెయిల్యూర్

ఎక్యుట్ కిడ్నీ ఫెయిల్యూర్ అంటే మామూలుగా పనిచేస్తున్న రెండు కిడ్నీలకు విభిన్న వ్యాధుల కారణంగా నష్టపోవడం. ఈ సమయంలో వాటి పనితీరు మందగిస్తుంది.

ఈ వ్యాధికి వెంటనే చికిత్స చేస్తే, తక్కువ వ్యవధిలో కిడ్నీ సంపూర్ణంగా తిరిగి పనిచేస్తుంది. తర్వాత రోగికి మందులు వేసుకునే అవసరంకానీ, ఆహార నియమాలు పాటించవలసిన అవసరం కానీ లేదు.



ఎక్యూట్ కిడ్నీ ఫెయిల్యూర్ రోగులకు మందుల ద్వారా, ఆహార నియమాల ద్వారా చికిత్స అందించవచ్చు. వీరిలో కూడా కొంతమందికి కొన్నిరోజుల వరకూ డయాలసిస్ చేయాల్సి ఉంటుంది.

క్రానిక్ కిడ్నీఫెయిల్యూర్

క్రానిక్ కిడ్నీ ఫెయిల్యూర్ అంటే వ్యాధి తీవ్రమైన స్థితి. చాలా రకాల రోగాల వల్ల కిడ్నీ పనిచేసే శక్తి క్రమేపి కొద్ది నెలలుగా కానీ కొన్ని సంవత్సరాలుగా కానీ తగ్గుతూ ఉంటుంది. అలా రెండు కిడ్నీలు మెల్లమెల్లగా పని చేయడం పూర్తిగా నిలిచిపోతుంది. ఈ వ్యాధిని ప్రస్తుతమున్న చికిత్సా విధానాలలో పూర్తిగా నయం చేసే మందులు ఏమీ లేవు. క్రానిక్ కిడ్నీ ఫెయిల్యూర్ రోగులకు మందుల ద్వారా ఆహార నియమాలతో, ఎప్పటికప్పుడు పరీక్షలు చేయడం ద్వారా చికిత్స చేయొచ్చు. మొదట్లో బలహీనంగా ఉన్న కిడ్నీల పనితీరు పెరిగేలా చూడడం తప్పనిసరి. వీరికి కిడ్నీ ఫెయిల్యూర్ లక్షణాలను పరిశీలనలో ఉంచుకుని, చికిత్స చేయాలి. అయితే ఇది సంపూర్ణ చికిత్స కాదు. మందులతో చికిత్స చేస్తే కిడ్నీ ఎక్కువ పాడయిపోవటంతో సరైన చికిత్స చేస్తున్నా రోగ లక్షణాలు పెరుగుతుంటాయి. రక్త పరీక్షలలో క్రియాటిన్ యూరియాల పరిమాణాలూ పెరుగుతుంటాయి. ఇటువంటి రోగులకు డయాలసిస్ చేస్తే కొంతకాలం మరణాన్ని వాయిదా వెయ్యొచ్చు. కిడ్నీ మార్పిడితో చాలావరకూ దీనినుంచి బయటపడే అవకాశం ఉంటుంది.

డాక్టర్ జి. శ్రీధర్
నెఫ్రాలజిస్ట్
కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్
అవేర్ గ్లెనీగల్స్ గ్లోబల్ హాస్పిటల్స్
హైదరాబాద్



గ్లకోమా నుంచి విముక్తి కోసం



కంటి చూపును కబళించే గ్లకోమా నుంచి విముక్తి కోసం చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. గ్లకోమా కంటి నరాలకు సంబంధించిన వ్యాధి. కంటి నరాల్లో పీడనం పెరిగితే ఇది వస్తుంది. ఈ వ్యాధి ప్రారంభంలో పాక్షికంగా దృష్టిలోపం కలుగుతుంది. దానిని నిర్లక్ష్యం చేసి, సరైన చికిత్స తీసుకోకపోతే కొన్నాళ్లకు పూర్తిగా కంటిచూపు పోతుంది. చాలా కారణాలవల్ల వచ్చే ఈ వ్యాధిలో రకాలు కూడా ఎక్కువే ఉన్నాయి. గ్లకోమాను నియంత్రించే అవకాశాలు లేకపోయినా కొన్ని జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలి

- వంశపారంపర్యంగా గ్లకోమా వచ్చే అవకాశం ఉన్న వ్యక్తులు క్రమం తప్పక వైద్యుల చేత కంటి పరీక్షలు చేయించుకోవాలి.
- ఒక కంటిని మూసి ఉంచి రెండో కంటిచూపును పరీక్షించుకోవాలి. ఇలా రెండు కళ్లనూ స్వీయ పరీక్ష చేసుకుంటూ గ్లకోమాను ప్రారంభ దశలోనే గుర్తించే ప్రయత్నం చేయాలి.
- స్టెరాయిడ్స్ వాడకాన్ని వీలైనంత తగ్గించాలి.
- కళ్లను బాధించే చిన్న చిన్న రుగ్మతలకు వైద్యుల ప్రమేయం లేకుండా స్టెరాయిడ్ కలిగిన చుక్కల మందులు వాడేయకూడదు.
- మధుమేహులు చక్కెర స్థాయిల్ని అదుపులో ఉంచుకోవాలి.
- కళ్లకు దెబ్బలు తగలకుండా కాపాడుకోవాలి.
- టపాసులు కాల్చేటప్పుడు నిప్పు రవ్వలు కంట్లో పడకుండా చూసుకోవాలి. ఈ ప్రమాదాల వల్ల కూడా కళ్లల్లో గ్లకోమా రావొచ్చు.
- షటిల్ ఆడేటప్పుడు కాక్ కంటికి తగలటం, క్రికెట్ ఆడేటప్పుడు బాల్ బలంగా కంటిని తాకితే గ్లకోమా వచ్చే అవకాశాలు పెరుగుతాయి. కాబట్టి ఇలాంటి ఆటలాడేటప్పుడు ఎంతో జాగ్రత్తగా ఉండాలి.
- రక్తపోటు, హైపర్ టెన్షన్‌లను అదుపులో ఉండేలా చూసుకోవాలి.



చిన్నారి



పొడుపు కథ

బొంగరంలా తిరుగుతుంటా,
అదెవ్వరికీ కన్పించదంట,
నేను తిరగడం వల్లేనంట
రాత్రి, పగలొస్తాయంట. నేనెవరిని?


జవాబు : భూమి

జోక్:

టీచర్ : ఒరేయ్ బంటీ! నేనొక ప్రశ్న అడుగుతా జవాబు చెప్పు. ఆల్‌జీబ్రా అంటే ఏమిటి?

బంటి : అంటే.. అంటే... జీబ్రాలన్నీ ఒకేచోట కలిస్తే అదే ఆల్‌జీబ్రా టీచర్..!

దారి చూపండి!



పిల్లలూ..! పక్కనున్న బొమ్మలోని ఎలుకకు లోపలి నుంచి బయటకు ఎలా వెళ్ళాలో.. దారి చూపండి!

అప్పుడు నాలుక చేదుగా ఎందుకు?



జ్వరమొస్తే మనం ఏమీ తినలేం. ఆహార పదార్థాలన్నీ చేదుగానే ఉంటాయి. ఎందుకంటే మన నాలుక రుచులను గుర్తించే ఇంద్రియ అవయవం. ఆహార పదార్థాలు, పానీయాలు, మసాలా దినుసులలోని రుచుల్ని వేరువేరుగా గుర్తించగలిగే రసాయనిక గ్రాహకాలు నాలుక మీద ఉంటాయి. నాలుక చివరిభాగం తీపిని గుర్తించగలుగుతుంది. నాలుక పక్కటంచులు ఉప్పదనాన్ని గుర్తిస్తాయి. నాలుక అంచుల్లో మధ్య భాగాలు పుల్లని రుచుల్ని పసిగడతాయి. నాలుక వెనుక భాగంలో దాదాపు గొంతు దగ్గర చేదును గుర్తించే ప్రాంతం ఉంది. చేదు అంటే మనకు ఇష్టంలేని రుచి. నాలుకపై దాన్ని పసిగట్టే ప్రాంత వైశాల్యం ఎక్కువ. జ్వరం వచ్చినప్పుడు శరీరపు ఉష్ణోగ్రత పెరగడం వల్ల చాలా జీవవ్యవస్థలు మందగిస్తాయి. అందులో రుచి కూడా ఒకటి. అయితే తీపి, ఉప్పదనం, పులుపు రుచుల్ని చూసే భాగాలకన్నా చేదు రుచిని పసిగట్టే భాగం ఎక్కువ ఉండటం వల్ల జ్వరం ఉన్నా అది అంతో ఇంతో పనిచేస్తూనే ఉంటుంది. అందువల్ల ఆహార వస్తువుల్లో ఉన్న చేదు పదార్థాలే ఎక్కువ ప్రభావం చూపుతాయి. చేదును అధిగమించేలా ఇతర రుచులున్నా నాలుక పసిగట్టలేదు. అందువల్లే జ్వరం సమయంలో ఏది తిన్నా కొంత చేదుగా అనిపిస్తుంది. ★





నేను గీసిన బొమ్మ





ఎన్. సాత్విక,
9వ తరగతి, మాంటిసోరి స్కూల్,
పున్నయ్యతోట, విజయవాడ.

పిల్లల్లారా.. రారండి!!

కథలు, కవితలు, మీరు గీసిన బొమ్మలు, చూసిన ప్రదేశాలు, కనిపెట్టిన సైన్సు సంగతుల గురించి రాసి మీపేరు, ఫొటోతో పంపవలసిన మా చిరునామా

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com

కుర్రాళ్లు సత్తా చాటేనా!



1998... శ్రీలంక 50 ఏండ్ల స్వాతంత్ర్య వేడుక. నిదాస్ ట్రోఫీ పోరు. న్యూజిలాండ్, శ్రీలంకలు పోటీపడిన ఆ టోర్నీ ఫైనల్లో ఆతిథ్య లంకపై మనోళ్లు గర్జించారు. గంగూలీ, సచిన్‌లు తొలి వికెట్‌కు రికార్డు స్థాయిలో 252 పరుగులు జోడించగా.. నిదాస్ ట్రోఫీ టీమ్ ఇండియా సొంతమైంది. 2018.. శ్రీలంక 70 ఏండ్ల స్వాతంత్ర్య సంబురం. మళ్లీ నిదాస్ ట్రోఫీ పోరాటం. ఈసారి ప్రత్యర్థులు ఆతిథ్య శ్రీలంక, బంగ్లాదేశ్. అప్పుడు దిగ్గజాలతో లంకకెళ్లగా.. ఇప్పుడు సీనియర్లకు విశ్రాంతినివ్వగా కుర్ర జట్టు ద్వీపదేశంలో అడుగుపెట్టింది. అయినా, మనోళ్లే ఫేవరేట్‌గా బరిలోకి దిగుతున్నారు. నేడు తొలి పోరులో శ్రీలంకతో తలపడనున్నారు. యువ జోరుకు మరో నిదాస్ ట్రోఫీ మనదయ్యేనా!?

కొలంబో : ఇటువైపు పరుగుల యంత్రం విరాట్ కోహ్లి లేడు. మిస్టర్ కూల్ ఎం.ఎస్ ధోని కనిపించడు. ఆల్‌రౌండర్ పాండ్య అందుబాటులో లేడు. బౌలింగ్ మెరుపులు భువి, బుమ్రాలు సైతం లేరు. అటు వైపు ఎంజెలో మాథ్యూస్ సహా గుణరత్నె, మధుశంక సేవలు లంకకు లేవు. రెండు వైపులా కీలక ఆటగాళ్లు కొందరు లేకపోయినా.. నిదాస్ ట్రోఫీ తొలి పోరుపై ఆసక్తి ఏమాత్రం తగ్గలేదు. సీనియర్లు లేని భారత్‌పై పంజా విసిరేందుకు ఇదే సరైన అదనుగా లంకేయులు భావిస్తుండగా.. సత్తా చాటేందుకు ఇదే సరైన సమయమని భారత కుర్రాళ్లు ఎదురుచూస్తున్నారు. దీంతో ముక్కోణపు టీ20 తొలి పోరు ఆసక్తికరంగా మారింది. శ్రీలంకపై విరుచుకుపడే అలవాటున్న రోహిత్ శర్మ సారథ్యంలో టీమ్ ఇండియా సమరానికి సిద్ధమైంది.

అటు ఇటు ఆశలు : శ్రీలంకపై మన ఓపెనర్లు రోహిత్ శర్మ, శిఖర్ ధావన్‌లు ఆకాశమే హద్దుగా చెలరేగిన రికార్డు ఉంది. తాజా సిరీస్‌లోనూ వీరిద్దరి విధ్వంసాన్ని నిలువరించటమే లంకేయుల ప్రథమ కర్తవ్యం. చాలా కాలంగా తుది జట్టులో లేని కెఎల్ రాహుల్ ఇక్కడ అవకాశం కోసం చూస్తున్నాడు. మిడిల్ ఆర్డర్‌లో సత్తా చాటేందుకు ఎదురుచూస్తున్నాడు. పొట్టి ఫార్మాట్ చిచ్చరపిడుగు సురేశ్ రైనా వన్డే జట్టుపై కన్నేసి భారీ ఇన్నింగ్స్‌లు ఆడాలని భావిస్తున్నాడు.



- శ్రీలంకతో తొలి పోరు నేడు
- ఫేవరేట్‌గా టీమ్ ఇండియా
- ముక్కోణపు టీ20 సిరీస్
- సా।। 7 గంటకు డీ స్పోర్ట్స్‌లో..

వాషింగ్టన్ సుందర్, దీపక్ హుడాతో పాటు రిషబ్ పంత్, దినేశ్ కార్తీక్‌లు తుది జట్టులో కోసం పోటీపడుతున్నారు.

శ్రీలంక జట్టులో కుశాల్ మెండిస్ కీలకంగా కనిపిస్తున్నాడు. ఇటీవల బంగ్లాదేశ్ పర్యటనలో వరుస అర్ధ సెంచరీలు బాదిన మెండిస్.. దేశవాళీ క్లబ్ తరఫున అద్భుత ఇన్నింగ్స్‌లు నమోదు చేశాడు.

దీంతో తాజా సిరీస్‌లో కుశాల్‌పై లంకేయులు భారీ ఆశలు పెట్టుకున్నారు. గుణతిలక, కుశాల్ పెరీరా, ఉపుల్ తరంగతో పాటు దినేశ్ చండిమాల్ రాణిస్తే విజయావకాశాలు మెండుగా ఉంటాయని లంక భావన.

వర్షం ముప్పు : కొలంబో ప్రేమదాస సహజంగా నెమ్మదైన పిచ్. ఆరంభంలో ఫాస్ట్ బౌలర్లకు అనుకూలిస్తుంది. తక్కువ ఎత్తులో బంతి వచ్చే వికెట్ బ్యాట్స్‌మెన్‌కూ అనుకూలమే. సాయంత్రం వేళ భారీ వర్షం కురిసే అవకాశముందని వాతావరణ శాఖ చెబుతోంది.

తుది జట్లు (అంచనా) : శ్రీలంక : కుశాల్ మెండిస్, ధనుష్క గుణతిలక, కుశాల్ పెరీరా, ఉపుల్ తరంగ, దసున్ శనక, తిశార పెరీరా, దినేశ్ చండిమాల్ (కెప్టెన్), అఖిల ధనంజయ, అమిలా, సురంగ లక్మల్, దుష్మంత చమీరా

భారత్ : రోహిత్ శర్మ (కెప్టెన్), శిఖర్ ధావన్, సురేశ్ రైనా, కెఎల్ రాహుల్, మనీశ్ పాండే, రిషబ్ పంత్/దినేశ్ కార్తీక్, వాషింగ్టన్ సుందర్, దీపక్ హుడా, యుజ్వేంద్ర చాహల్, శార్దుల్ ఠాకూర్, అక్షర్ పటేల్, జైదేవ్ ఉనద్కత్.

ఇమ్రాన్‌ఖాన్‌ను గుర్తుచేస్తున్నాడు

కోహ్లిపై రవిశాస్త్రి ప్రశంసల జల్లు



ముంబయి : బ్యాటింగ్ సూపర్‌స్టార్ విరాట్ కోహ్లిపై టీమ్ ఇండియా చీఫ్ కోచ్ రవిశాస్త్రి ప్రశంసల పర్వం కొనసాగుతూనే ఉన్నది. విరాట్ కోహ్లి బ్యాటింగ్ తీరు, పరుగుల ప్రవాహంతో పాటు నాయకత్వ పటిమపై ప్రశంసలు జల్లు కురిస్తోన్న రవిశాస్త్రి.. తాజాగా అతడిని పాకిస్థాన్ క్రికెట్ దిగ్గజం ఇమ్రాన్‌ఖాన్‌తో పోల్చాడు. కోహ్లిని చూస్తుంటే ఇమ్రాన్‌ఖాన్ గుర్తుకొస్తున్నాడని శాస్త్రి అన్నాడు. ' కోహ్లి ఇంకా కెరీర్ ప్రారంభ దశలోనే ఉన్నాడు. ఎంతో చిన్నవాడైనా అప్పుడే దిగ్గజాల సరసన చేరిపోయాడు. జట్టును ఆదర్శంగా నడపాలని తపన పడుతు న్నాడు, ఈ శైలితో ఇమ్రాన్ ఖాన్‌ను గుర్తుచేస్తు న్నాడు. పాకిస్థాన్ క్రికెట్ దిగ్గజం ఇమ్రాన్‌ఖాన్‌లోని లక్షణాలను కోహ్లి అప్పుడే పుణికిపుచ్చు కున్నాడు. ఎక్కడ ఆడినా, ఎలాంటి పరిస్థితుల్లో ఆడినా.. గెలవాలనే తపన ఇద్ద రిలో కనిపించే సహజ లక్షణం' అని శాస్త్రి చెప్పుకొచ్చాడు.

పసిడి మను



10 మీ పిస్టోల్‌లో స్వర్ణం కైవసం
రవికుమార్‌కు కాంస్య పతకం
ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచకప్

లమెక్సికో : షూటింగ్ ప్రపంచకప్‌లో మనోళ్ల పసిడి గురి అదురుతోంది. మహిళల విభాగంలో మను భాకర్ స్వర్ణ గురితో భారత్ పతకాల జోరు పెంచింది. ఈ అక్టోబర్‌లో యూత్ ఒలింపిక్స్‌లో పాల్గొనబోతున్న మను భాకర్.. ప్రపంచకప్‌లోనే సత్తా చాటింది. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి పసిడి పతకం సొంతం చేసుకున్నది. పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో రవికుమార్ కాంస్య పతకం సాధించాడు. దీంతో షూటింగ్ ప్రపంచకప్‌లో భారత్ పతకాల సంఖ్య రెండు స్వర్ణాలు, మూడు కాంస్యాలకు చేరుకున్నది. 24 రౌండ్ల ఫైనల్లో 237.5 పాయింట్లతో మను భాకర్ గోల్డ్ కొట్టేయగా.. లోకల్ స్టార్ జావెలా 237.1తో సిల్వర్‌తో సరిపెట్టుకున్నది. ఫ్రాన్స్ అమ్మాయి గొబెర్‌విల్లె 217.0తో కాంస్యం దక్కించుకున్నది. ఫైనల్స్‌కు చేరిన మరో భారత షూటర్ యషశ్విని సింగ్ 196.1తో త్రుటిలో పతకం చేజార్చుకున్నది. ఆఖరు రౌండ్‌లో 10.8 పాయింట్లు సాధించిన మను భాకర్ సమీప ప్రత్యర్థిని వెనక్కి నెట్టేసి పసిడి సాధించింది. ' స్వర్ణ పతకం సాధించటం ఎంతో ఆనందంగా ఉంది.

ఇది నాకు తొలి ప్రపంచకప్. ఇక్కడే గోల్డ్ కొట్టాను. రానున్న టోర్నీల్లోనూ సత్తా చాటేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను' అని మను భాకర్ ఆనందం వ్యక్తం చేసింది.

విజయం, వివాదం



డర్బన్ : సఫారీ గడ్డపై విజయవంతమైన రికార్డును కొనసాగిస్తూ ఆస్ట్రేలియా తొలి టెస్టులో గెలుపొందింది. 417 పరుగుల ఛేదనలో దక్షిణాఫ్రికాను 298కే కుప్పకూల్చిన కంగారూలు 118 పరుగుల తేడాతో ఘన విజయం సాధించారు. అయితే, డర్బన్ టెస్టు విజయంపై గురించి కాకుండా, వివాదం చుట్టూ తిరుగుతోంది. మ్యాచ్‌లో పలు మార్లు ఆస్ట్రేలియా ఆటగాళ్లు దురుసుగా ప్రవర్తించటం, తాజాగా (నాల్గో రోజు టీ సెషన్) డెవిడ్ వార్నర్, క్వింటన్ డికాక్‌లు డ్రెస్సింగ్‌రూమ్‌కు వెళుతూ మెట్లపై గొడవ పడిన వీడియో బయటికొచ్చింది.

ఈ విషయమై రెండు దేశాల బోర్డులు ఒకరిపై ఒకరు వేలెత్తి చూపుకుంటున్నారు. ఈ విషయంలో మ్యాచ్ రిఫరీ జోక్యం చేసుకొని.. సిరీస్‌లో మున్ముందు ఈ ఘటనతో వాతావరణ వేడెక్కకుండా చూసేందుకు తగు సూచనలు చేశాడు. డికాక్ గీత దాటి నోరు పారేసుకున్నాడని ఆస్ట్రేలియా బోర్డు వాదిస్తుండగా, డెవిడ్ వార్నర్ వ్యక్తిగతంగా తీసుకోవటంతోనే సమస్య వచ్చిందని దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డు అంటోంది.

రెండో ఇన్నింగ్స్‌లో ఏబీ డివిలియర్స్ రనౌట్ అయిన సందర్భంలోనూ ఆస్ట్రేలియా ఆటగాళ్లు (డెవిడ్ వార్నర్, నాథన్ లియాన్) హద్దు మీరిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో లియాన్‌కు మ్యాచ్ ఫీజులో కోత పడే అవకాశం ఉంది. ఇక నాల్గు మ్యాచుల టెస్టు సిరీస్‌లో ఆస్ట్రేలియా 1-0తో ముందంజ వేసింది. సఫారీ పతనాన్ని శాసించిన మిచెల్ స్టార్క్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

రవాణా రంగ సమస్యలపై
నేడు దేశవ్యాప్త నిరసన

పరిష్కరించకపోతే ఉద్యమం ఉధృతం : నాయకులు • కర్నూలులో నేడు 6 గంటల పాటు రవాణా బంద్



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో /కర్నూలు కార్పొరేషన్

కేంద్ర ప్రభుత్వం ట్రాన్స్‌పోర్టు రంగాన్ని నిర్వీర్యం చేసేలా తెస్తున్న మెటారు వెహికిల్ బిల్లును ఉపసంహరించుకోవాలనే డిమాండ్‌తో మంగళ వారం దేశవ్యాప్తంగా రవాణారంగ యజమానులు, కార్మికులు నిరసన తెలియజేయనున్నారు. దీనిలో భాగంగా కర్నూలులో స్థానికలారీ యజమానుల సంఘం ఆరుగంటల పాటు రవాణా బంద్ చేయడా నికి నిర్ణయించింది. మరో వైపు రాష్ట్రంలోని అన్ని ఆర్టీసీ డిపోల ఎదుట నిరసన తెలియజేయనున్నట్లు ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ కె జిలానీ, ప్రధాన కార్యదర్శి సిహెచ్ సుందరయ్య, ప్రచార కార్యదర్శి ఎం అయ్యప్పరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీలకు, రవాణా రంగానికి ప్రమాదకరమైన ఎంవి చట్ట సవరణ బిల్లును ఆపాలని, ఆర్టీసీలను కాపాడా లని, ఆర్టీసీలకు సహకారం అందించాలని, బస్సుల కొను గోలుపై పెంచిన పన్నులు తగ్గించాలని, పెట్రో లియం ఉత్పత్తులను జిఎస్‌టి పరిధిలోకి తేవాలని, రవాణా రంగ కార్మికులకు కనీసవేతనం ఇవ్వాలని, సమగ్ర సామాజిక భద్రతా స్కీమును అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

కర్నూలులో సిటీ లారీ ఓనర్స్ అసోషియేషన్ అధ్యక్షులు రామకృష్ణ అధ్యక్షతన జరిగిన కర్నూలు సిటీ లారీ ఓనర్స్, వెల్ఫేర్ అసోషియేషన్ విస్తృత సమావేశంలో సిఐటియు జిల్లా నాయకులు ఇ పుల్లారెడ్డి మాట్లాడుతూ ఈ మోటారు వెహికల్ సవరణ బిల్లు ఆమోదం పొందితే దేశానికి ప్రజలకు నిత్యావసర సరుకులు సరఫరా చేసే వ్యవస్థంతా అస్తవ్యస్తంగా మారుతుందని తెలిపారు. ట్రాన్స్ పోర్టు రంగంలోకి ఓలా, ఉబేర్ లాంటి బహుళజాతి కంపెనీలు వస్తున్నందున ఆ కంపెనీల ప్రయోజ నాల కోసం కేంద్ర ప్రభుత్వం కార్మికులను ఫణంగా పెడుతోందని విమర్శించారు. ఈ బిల్లును ఉపసంహరించుకోవలని డిమాండ్ చేస్తూ ఈనెల 6న నిర్వహించే ఆరు గంటల బంద్‌ను జయ ప్రదం చేయాలని కోరారు. లారీ ఒనర్ల సంఘం నాయకులు మిన్నెల్ల, బషీర్ అహమ్మద్, దాసన్న, ఆయూబ్, యూసుఫ్‌మియ్య, శ్రీనివాసులు, ఖాదర్‌బాష తదితరులు పాల్గొన్నారు.

ఇ- విధానాలపై ఎన్‌ఐసి వీడియో భేటీ



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న సిఎస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇ-నిధి, ఇ-ఆఫీస్, బయోమెట్రిక్ విధానాలపై ఢిల్లీ నుంచి నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (ఎన్‌ఐసి) డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఇన్చార్జి రచన శ్రీవాస్తవ సోమవారం వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో హైదరాబాద్ ఎన్‌ఐసి నుంచి రాష్ట్ర ప్రభుత్వ ఐటి సలహాదారు జె సత్యనారాయణ, అమరావతి సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ పాల్గొన్నారు. ఇ-నిధి, ఇ-ఆఫీస్, ఎఐబిఎఎస్ అంశాలకు సంబంధించి వివిధ సాంకేతిక పరమైన విషయాలపై ఈ సమావేశంలో ఎన్‌ఐసి అధికారులు రాష్ట్ర అధికారులకు సూచించారు. సమావేశంలో న్యాయశాఖ కార్యదర్శి వెంకటరమణ, ఆర్థిక శాఖ కార్యదర్శి హేమ వెంకట మునియప్ప, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

• రైళ్లలో చోరీ చేసిన రూ.60 లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిప్ టాప్‌గా తయారవు తారు...ఎసి ప్రయా ణికుల్లా రైలు టిక్కెట్లు తీసుకుంటారు... కోచ్‌ల్లో ఎక్కి ప్రయాణికులతో మాట కలుపుతారు... ఇంగ్లీష్, హిందీ భాషల్లో అధికారుల్లాగా అదర గొడ తారు... ఎవరెవరి దగ్గర ఎంత సొమ్ములు న్నాయో గుట్టుగా గమనిస్తారు... అందరూ మత్తుగా నిద్రలోకి జారుకున్న తరువాత విలువైన నగలు, నగదు, ఇతర వస్తు సామాగ్రితో ఉడాయిస్తారు. ఏసీ బోగీలే లక్ష్యంగా వరుస చోరీలకు తెగబడుతూ ఆరు రాష్ట్రాల్లోని పోలీసులను, ప్రయాణికులను ముప్పు తిప్పలు పెడుతున్న ఐదుగురు సభ్యుల హర్యానా దొంగల ముఠాను విజయవాడ రైల్వే డివిజన్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి సుమారు రూ.60 లక్షలు విలువైన రెండు కేజీల బంగారు ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విజయవాడలోని జిఆర్‌పి ఎస్‌పి కార్యాలయంలో వీరిని మీడియా ముందు ప్రవేశ పెట్టారు. ఈ సందర్భంగా ఎస్పీ మోహనరావు మీడియాతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, ఒడిశా, హర్యానా, కర్ణాటక రాష్ట్రాలతో పాటు వివిధ ప్రాంతాల్లో సాధారణ ప్రయాణికుల్లా రైళ్లలో ప్రయాణిస్తూ వీరు దోపిడీకి పాల్పడేవారని తెలిపారు. ఐదుగురు సభ్యులుగల ఈ ముఠాలో సూపర్ ఫాస్ట్ రైళ్లలోని ఒక్కొక్క ఏసీ బోగీలో ఒక్కొక్కరు ఎక్కి వృద్ధులు, మహిళలు, చిన్నారులను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలు చేసేవారన్నారు. సూట్‌కేసుల్లో ఉన్న విలువైన వస్తువులను దొంగి లించి మళ్లీ ఆ సూట్‌కేసులకు తాళాలు యథావిధిగా వేయడం ఈ ముఠా ప్రత్యేకతగా చెప్పారు. ఇటు వంటి ముఠాల గురించి ఫిర్యాదులు అందడంతో ఆర్‌పి ఎఫ్ పోలీసులతో కలిపి జిఆర్‌పి సిబ్బంది ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించినట్లు వివరించారు. దోపిడీ చేసే సమయంలో ఎవరైనా ప్రయాణి కులకు మెలుకువ వచ్చి గమనిస్తే వారిపై దాడికి కూడా సిద్ధపడతారని చెప్పారు. రాష్ట్రంలో రాజమండ్రి, భీమవరం, గుడివాడ, విశాఖపట్నం ప్రాంతాల్లో ఈ ముఠాపై పలు కేసులు నమోదైనట్లు వివరించారు. రాత్రి ప్రయాణాల్లో ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని అనుమానాస్పద వ్యక్తులు తారసపడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని రైల్వే ఎస్పీ మోహనరావు సూచించారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68